

వ్యవస్థాపకులు

**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 24 సంచిక : 10

ఆగస్టు - 2021

'ప్లవ' శ్రావణ మాసం

**సంపాదకులు** (EDITOR)

**సాగి కమలాకర శర్మ**

**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)

**దత్తయ్య అట్టెం**

**DATTAIAH ATTEM**

**Printed and Published by**

B. Anantha Laxmi

***Type Setting at :***

**Kavyasree Graphics**

**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**

**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**

**సంవత్సర చందా : 200/-**

**శాశ్వత సభ్యత్వం : 2500/-**

(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక,**

**2-2-1109/బికె - ఎల్ఐజి-10,**

**బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,**

**హైదరాబాద్ - 500 013**

**ఫోన్ : 9347971177**

**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER

**ISSN 2457-0796**



# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

మూసీ సాహిత్య ధార 6

హరిహర సోమనాథుల రచనల్లో దళిత ప్రసక్తి ... బి. పవిత్ర 7

తిలక్ అభిరుచులు - అలవాట్లు .. ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు 11

తెలుగు సాహిత్యంపై రైతాంగ ఉద్యమాల ప్రభావం ... చింతరెడ్డి భాస్కర రెడ్డి 15

అడ్లూరి అయోధ్యరామయ్య కథల్లో జాతీయోద్యమం ... ఘనపురం సుదర్శన్ 17

నిశ్శబ్ద అక్షర యోధుడు - వెలపాటి రామరెడ్డి ... డా. రాపోలు సత్యనారాయణ 19

మూసీ పదవినోదం - 28 ... డా. తాడేపల్లి పతంజలి 20

పాదముద్రలు (తెలంగాణ కథకుల పరిచయం)... బి.వి.ఎన్.స్వామి 21

గ్రంథాంతరంగం 3 - నేటి కాలపు కవిత్వము ... ఘట్టమరాజు 23

కరిగే మేఘం (కథానిక) ... డా. బి. నాగశేషు 27

పద్య మనోహరం -20 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 32

వట్టికోట ఆళ్వారుస్వామి జీవితం - సాహిత్యం - సమగ్ర పరిశీలన ... గాదె చంద్రశేఖర్ 33

తెలుగు సాహిత్యంలో తెలంగాణ సంస్కృతి ... వై. సత్యనారాయణ 35

ఇందూరు గడ్డపై తొలి క్షేత్రమాహాత్మ్య కావ్యం - శ్రీమన్నింబాచల మాహాత్మ్యం ... మేకల రామస్వామి 38

వంగర వాసీయుడు - భారతీయ భాస్కరుడు ... డా. వొజ్జల శరత్ బాబు 41

కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 14 ... టి. లక్ష్మీనారాయణ 47

శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 51

### కవితలు

పార్వతీపతీ! ...వి.వి.సుబ్రహ్మణ్యం - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; ముగింపు లేని వాక్యం ... శ్రీనిధి విప్లవశ్రీ - 9; మరమ్మత్ .. డా. ఎన్. గోపి - 10; పెళ్ళంటే నాటకం కాదు - పెద్దపల్లి తేజస్విని - 10; పెద్ద ఒడి ... డా. ఏనుగు నరసింహారెడ్డి - 14; వృద్ధురాలు - డా. కందుల శ్రీను - 26; మాండూక్యోపనిషత్తు (అనువాదం) ... జక్కని వెంకటరాజం - 31; ముగిసిన విద్యార్థి శకం - అందమైన తరగతి జీవితం ... ఎజ్జు మల్లయ్య - 46; అంతరాత్మ ... కన్నోజు లక్ష్మీకాంతం - 58; సురాజ్య ఆశయం ... జినుకుల వెంకటేశ్ - 60; 'వహ్వా'వకాయ ... డా. దామరాజు కామేశ్వరరావు-62;

### సమీక్షలు

సంకుచితత్వాన్ని ప్రశ్నించిన గ్రంథం 'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం' ... ఇమ్మిడి మహేందర్ 53

గుండెవాల్ మీద ప్రయోగాల కవిత్వపు పిట్ట ... పేర్ల రాము 57

మచ్చా హరిదాసు 'తథ్యము సుమతీ' ... డా. అమ్మిన శ్రీనివాస రాజు 59

స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.

*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.

*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.

*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





## అణువు

అత్యంత సూక్ష్మమైనది అనే అర్థంలో అణుశబ్దాన్ని వినియోగిస్తారు. ఇంకా శ్రేష్ఠమైనది, సూక్ష్మమైనదిగా భాసించేది పరమాణువు. అణువుకు అపరిమితమైన శక్తి ఉంటుంది. అణు సంఘటితానికి శక్తి తక్కువగా ఉంటుంది. సూక్ష్మమవుతున్న కొద్దీ దేనికైనా శక్తి పెరుగుతుంది. ఈ ప్రపంచము, కనిపించే చరాచరాలు అన్నీ అణు సంఘటితాలే. కంటికి కనిపించనివానిలోనూ అణు ఘటన ఉంటుంది. అన్ని వస్తువుల్లోనూ, అన్ని పదార్థాల్లోనూ, అనంతంలోనూ కూడా అణువులే ఉంటాయి. స్థూల సూక్ష్మాలన్నింటిలోనూ వ్యాపనం పొందేది అణువే.

స్థూలమైనది సూక్ష్మంగా మారుతున్నా కొద్దీ దానిలోని అణువుల విఘటనం వల్ల శక్తి జనిస్తుంది. ఉదాహరణకు ఒక పండు తీసుకొని, ముక్కలు ముక్కలుగా కోసుకొని, నోటిలో వేసుకొని, నమిలి నమిలి దాని పూర్వస్థితి లేకుండా చేస్తున్నాం. ఎంతగా నమిలి ముక్కలు చేస్తే అంతగా దానిలోని శక్తిని మన శరీరం తీసుకోగలుగుతుంది. ఆ శక్తినే మనం వినియోగించుకొని వేరు వేరు కార్యక్రమాల నిర్వహణకు వినియోగించుకుంటున్నాం. అణు విఘటన లేకుంటే స్థూలమైన పదార్థంలోని శక్తి మనకు ప్రత్యక్షంగా వినియోగపడదు. ఒక బియ్యపు గింజ అయినా, గోధుమ గింజ అయినా. అన్నీ ఉడకబెట్టి గానీ, పిండి కొట్టి కానీ వినియోగించుకోక తప్పదు. అప్పుడే దానిలోని శక్తి మన శక్తిగా మారుతుంది. మన శరీరం ఉపయోగించుకోలేని మిగిలిన చెత్త భాగం వెళ్ళిపోతుంది. వ్యక్తమై, పదార్థమై ఈ లోకానికి వచ్చినవారు, అవ్యక్తమై మరణానంతరం జీవించాలన్నా, అమృతమయులు కావాలన్నా వారంతా అణుస్వరూపులు కావాల్సిందే. ఆనందంలో తేలియాడాల్సిందే.

అణువే ఆత్మ. ఆతమ శబ్దమది. ఆ చీకటి (పెంజీకటి – పోతన ప్రయోగం) వరకు. తమ శబ్దం ఉన్నతికి కూడా తరతమాదుల్లో వినియోగిస్తాం. ఈ ఆతమ శబ్దమే ఆంగ్లంలో 'ఆటమ్' అయింది. పరమాణువే పరమాత్మ. స్థూలమైన వస్తువుల కన్నింటికీ సూక్ష్మమైన శక్తి మూలమైనట్లు ఈ లోకంలో అందరికీ శక్తి మాత్రమే ఆధారం అవుతుంది. ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టుకొని వినియోగించుకున్నట్లే వ్యక్తమైన అన్ని జీవులూ మూల శక్తి వల్ల మాత్రమే మనుగడ సాగిస్తాయి. దానిని పట్టుకొనే శక్తిని ఈ శరీరం కోల్పోయినప్పుడు మరణం అని పిలుస్తున్నాం.

వ్యక్తి తాత్కాలిక గుర్తింపుల కన్నా, ఈ లోకంలోని సమస్యానుభవాలను అర్థం చేసుకుని, అవసరమైన ఉలి దెబ్బలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. స్థూలంగా ఉన్నప్పుడు శక్తి అంతర్గతంగా ఉన్నా వినియోగించుకోలేడు. లోకానికి సేవ, వేరు వేరు కార్యక్రమాలలో యోగదానం, ప్రకృతికి పశుపక్ష్యాదులకు, సమాజానికి బాధ్యత వహించడం వంటివి చేస్తున్నప్పుడు తాను సహజంగా శక్తిగా మారగలడు. శక్తి యొక్క లక్షణమే వ్యాపనం. మన ఫోన్‌లో ఎందరి నెంబర్‌లు ఉన్నాయని కాకుండా, మన ఫోన్ నెంబర్ ఎన్ని ఫోన్‌లలో ఉంటే అదే మన వ్యాపనం అవుతుంది. అది శక్తి వల్లనే కలుగుతుంది. సూక్ష్మమైన అణు స్వరూపంగా మారుతున్న కొద్దీ, ఎన్నో పనులు సునాయాసంగా చేయగలిగే శక్తి వస్తుంది. స్థూలమైన దేహంతో, ఒక జన్మలో చేయలేని పనులెన్నో ఎందరో పెద్దలు వేరు వేరు రంగాలలో చేసి చూపిస్తున్నారు కూడా. పదార్థం నుండి యథార్థానికి మారడం అంటే కూడా ఇదే. ఉన్న యథార్థమంతా అణు స్వరూపమే. సూక్ష్మమైన దానికున్న శక్తి ఎప్పటికీ స్థూలానికి ఉండదు. ఈ జీవిత పరమార్థం కూడా స్థూలంగా వచ్చి సూక్ష్మంగా మారి ఎందరి హృదయాలలోనో వ్యాపించడమే. పరమాణువుగా మారడమే. అణు స్వరూపమై అనంత శక్తిగా విస్తరించడమే. దివ్యత్వాన్ని పొందడమే. నిరంతరానందమయులు కావడమే.

# పార్వతీపతీ !

భారము కావు శైలములు, భారము కావు కరీంద్ర సంఘముల్
భారము కావరణ్యములు, వార్ధులు భారము కావు లేశమున్
నేరపు చేష్టలన్ బ్రతుకు నీతివిహీనుల కోట్లు వేయు దు
ష్టారులు మాత్రమే బరువు భారత భూమికి పార్వతీపతీ!



నేరములే యుపాధులగు నీచులు గల్గుట కేమిగాని, య
వ్వారలు శిక్షలన్ బడక ప్రాభవమందుట, వారి వెన్కనే
పౌరులు చేరి జైయనుట, వారలు శాసనకర్తలౌట యె
వ్వారికి వింత కాదిపుడు పాపపు కాలము పార్వతీపతీ!



దొరకినవాడె దొంగయని తొల్త వచించెడి వార లిప్పుడో
దొరికిన నేరగాండ్లకును దోష నిరూపణ, శిక్ష వేయుటల్
జరుగవు, వారె నేతలును చట్టము చేసెడివారు సైతమున్,
దొరకినవాడు కూడ దొర, తోచదయా గతి పార్వతీపతీ!

దొంగల దొంగ వేషముల దోషము జూడగలేని కోర్టులున్,
దొంగలచే పరిశ్రమలు, దొంగలకే ఋణమిచ్చు బాంకులున్
దొంగలు గెల్చు ఎన్నికలు, దొంగల గుంపుల రాజ్యపాలనల్
దొంగలు చేయు చట్టములు, దుర్భరమైనవి పార్వతీపతీ!



**వి.వి. సుబ్రహ్మణ్యం**
రాజమండ్రి, ఫోన్ : 9490104820





# మూసీ సాహిత్య ధార - 33-35

సాహిత్య సమాచార వాహికగా ఎన్నో వైవిధ్యమైన అంశాలను అందిస్తూ సాగుతున్న సాహిత్య ధార ఎందరో పరిశోధకుల సంశయాలను తీరుస్తూ, తీర్చిదిద్దుతుంది. ముప్పైఐదు మాసాలు నిండిన ఈ వేదికమీద గత మూడు నెలలుగా వేరు వేరు అంశాలపై సుప్రసిద్ధమైన పరిశోధకులు మాట్లారు. అందులో **జూన్ నెలలో ఆచార్య డి. విజయలక్ష్మి గారు 'తెలుగులోని మూల ద్రావిడ పదాలు – అధ్యయన విధానం', జూలై నెలలో డా. కుర్ర జితేందర్ బాబు ' తెలంగాణ శాసనాలు – సాహిత్యం', ఆగస్టు మాసానికి ఆచార్య జి.ఎస్.మోహన్ గారు 'పరిశోధన – స్వరూప, స్వభావాలు'** అనే అంశాల మీద ప్రసంగాలు చేసారు. వారి వారి విభాగాలలో సాధికారత గల ఈ వక్తల ఉపన్యాసాలు పరిశోధక విద్యార్థులకు మాత్రమే కాకుండా సాహితి ప్రియులను కూడా సంబురపరచాయి.

ఈ వేదిక మీదన ప్రతిమాసం లాగే పరిశోధక విద్యార్థులు నెలకు ఒక విభాగంలో ఒకరు చొప్పున స్వీయ పరిశోధనాంశాన్ని, పుస్తక సమీక్షను చేసారు. వీరితో పాటు ఇద్దరు వారి స్వీయ కవిత పఠనం చేసారు. **దర్శనం జాన్, వోలేటి శైలజ, వై. సత్యనారాయణలు** వారి స్వీయ పరిశోధనాంశాలను గురించి పరిచయ ప్రసంగాలు చేయగా, **బోళ్ళ ప్రవీణ్ కుమార్, పేర్ల రాము, ఇమ్మిడి మహేందర్‌లు** గ్రంథ సమీక్షోపన్యాసాలు చేసారు. **పెద్దపల్లి తేజస్విని, సిద్ధగౌని సుదర్శన్, బి.సందీప్ కుమార్, ఎం. రజిత** వారి వారి కవితలు చదివి మన్ననలు పొందారు. ప్రతి వేదికను సమీక్షిస్తూ డా. సాగి కమలాకరశర్మ, డా. ఎస్.రఘు గార్లు విద్యార్థులకు కావాల్సి సూచనలను అందించారు. ఈ సమావేశంలో ప్రతి మాసం అంతర్జాలం గుండా వందల మంది పాల్గొని విజయవంతం చేస్తూ సంతోషాన్ని కలిగిస్తున్నారు.

ఇంకా ఈ వేదిక గుండా ఈ రెండు మాసాలలో రెండు విశేష పుస్తకాల ఆవిష్కరణలు జరగడం ఆనందదాయకం. **అట్టెం దత్తయ్య** రాసిన **'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం'** జూలై 12న జరిగింది. ఇందులో 250కి పైగా పాల్గొని ఆనందపరిచారు. మరో పుస్తకం **ఆచార్య వెలుదండ నిత్యానందరావు** గారి **'ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం – అనుభూతి – అన్వేషణ (సమీక్షలు, పీఠికలు)** అనే ఆరు వందల పైచిలుకు పేజీలు గల పెద్దపుస్తకం. ఈ వేదిక మీద మూడు తరాల సాహితీ మూర్తులు పాల్గొని అందరికి కనువిందు చేసారు.






# తుకారాం అభంగం

నారాయణుని రంగులో
మేము లీనమైనాము
నిలిపినాము జగతిలో
హరి కీర్తనామృతము

చేతుల్లో పట్టితిమి వీణలు
కంఠం నుండ నారాయణుని
మూర్తిని చూడగానే శాంతి
మనసుకదే విశ్రాంతి

తుకా పలికే ఓ దేవా
ఇచ్చినావు కీర్తనమనే నావ




**అనువాదం : మంత్రి శ్రీనివాస్**
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,
ఫోన్ : 83283 33720

# హరిహర సోమనాథుల రచనల్లో దళిత ప్రసక్తి

**బి. పవిత్ర,** తెలుగు పరిశోధక విద్యార్థిని, కన్నడ విశ్వవిద్యాలయం, హంపి. ఫోన్ : 8762108046

ప్రాచీనకాలంనుంచి చండాలురని, పంచములని, అంత్యజులని, అస్పృశ్యులని కవులు, తాత్త్వికులు పేర్కొంటూవచ్చిన వారిని దళితులని పిలవడం ఆధునికకాలంలోనే జరిగింది. స్వాతంత్రోద్యమసమయంలో హరిజనులనే పేరు బాగా వాడుకలోకి వచ్చింది. కాని తర్వాతి కాలంలో దళితులనే పేరునే ఆవోదించి దళితులంతా ఆత్మాభిమానాన్ని చాటుకున్నారు. 'హరిజన' పదాన్ని తిరస్కరించారు. వారికి డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రేరణ లభించడంవల్ల దళితస్పృహని అలవరచుకున్నారు, దళిత సాహిత్యాన్ని సృష్టించుకున్నారు.

ప్రాచీన సాహిత్యంలో దళితుల ప్రసక్తి చాలా తక్కువగానే కనిపిస్తుంది. వర్ణాశ్రమపద్ధతిని పాటించాలనే విషయమే ఎక్కువగా కనిపిస్తుంది. దళితులనికూడా తమలో కలుపుకోవాలనే ఆలోచన మతపరంగా కలగడాన్ని గమనించవచ్చు. ఇది భక్తిపంథావల్ల సాధ్యమయింది. తమిళంలో నాయన్మారులు, ఆళ్వారులు దళితులతో సహా వివిధ జాతులవారిని, వృత్తులవారిని తమలో కలుపుకున్నారు. దీనినే కన్నడంలో వచనమనే విశిష్ట సాహిత్య ప్రక్రియని చేపట్టిన బసవాదులు అనుసరించారు.


కన్నడం, తెలుగు భాషాపరంగా, సాహిత్యపరంగా, సంస్కృతి పరంగా చాలా దగ్గరవి. ముఖ్యంగా శైవసాహిత్యం విషయంలో కన్నడానికి తెలుగుకి దగ్గరి సంబంధం ఉంది. తెలుగుమీద కన్నడ వీరశైవ సాహిత్య ప్రభావం ప్రత్యేకంగా పరిశీలించదగ్గది.[1] అలాగే కన్నడ శైవసాహిత్యం మీద, అందులోనూ బసవ సాహిత్యం మీద పాల్కురికి సోమనాథుని ప్రభావం కూడా తప్పక పరిశీలించదగ్గది.

**హరిహరసోమనాథులు :**

హరిహరదేవుడు (13వ శ.) కన్నడ శైవకవులలో పేరెన్నిక గన్నవాడు. రగడ (కన్నడంలో రగళె) ఛందస్సులో శివశరణుల జీవిత చిత్రాలని అద్భుతంగా అందించాడు. రగడకు కథనకళాగౌరవాన్ని కల్పించిన మహాకవి హరిహరనాథుడు. ద్విపదలాగే పాదనియమం లేకుండా రాస్తూ మాత్రాఛందస్సును పాటించే రగడల్ని రాయడంవల్ల కొందరు హరిహరుణ్ణి రగడ కవి అని హేళన చేశారు. అందువల్లనే వారికి సమాధానంగా హరిహరుడు చంపూపద్ధతిలో గిరిజాకల్యాణ మహాప్రబంధాన్ని రచించాడంటారు.

కన్నడ సాహిత్య చరిత్రని రాసిన వాళ్ళు పలురకాలుగా వర్గీకరణం చేశారు. ఎక్కువమంది పంప, బసవేశ్వరుడు, కుమారవ్యాసుడు యుగకర్తలుగా పేర్కొన్నారు. కాని త.సు. శామరాయ గారు బసవేశ్వరుడు కవిగా కంటె మతప్రచారకునిగా పేరు గడించాడని, హరిహరయుగమనడమే సమంజసమని భావించారు.[2]




హరిహరుడికీ పాల్కురికి సోమనాథుడికీ స్ఫూర్తిని కల్గించినవాడు తమిళ రచయిత శేక్కిళార్. ఆ కవి రచించిన 'పెరియ పురాణం' పురాతన శివభక్తుల జీవితాలని చిత్రించే ప్రసిద్ధ గ్రంథం.

పాల్కురికి సోమనాథుడు కవి, పండితుడు, భక్తుడు, జీవన చరిత్ర కారుడు, దేశీయుగప్రవక్త. సోమనాథుడు అరుదైన కవి. సమాజాన్ని, జీవితాలని, సంస్కృతిని, కళల్ని సూక్ష్మంగా గమనించి కావ్యాలలో పొందుపరచిన మహాకవి. పాల్కురికి సోమనాథుడు, హరిహరుడు ఇంచుమించు ఒకే కాలానికి చెందినవారే (13వ శ.). ఇద్దరికీ తమిళ నాయన్మారులు, శేక్కిళార్ స్ఫూర్తినిచ్చారు. మరో విషయంలో కూడా ఇద్దరికీ బాగా పోలిక ఉంది. ఇద్దరూ జీవనచరిత్రలు రాయడానికి అనువైన మాధ్యమంగా రగడని, ద్విపదని ఎంపిక చేసుకున్నారు. ఇద్దరికీ బసవేశ్వరుడి మీద అపారమైన గౌరవం ఉంది. కాని బసవనిలాగా, ఇతర వచనకారులలాగా వేదప్రామాణ్యాన్ని తిరస్కరించ లేదు. పాల్కురికి సోమనాథుడు తన భాషాభిమానాన్ని చాటుకుంటూ ఇలా అన్నాడు :

"ఉరుతర గద్యపద్యోక్తులకంటె
సరసమై పరగిన జానుదెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
కూర్చెద ద్విపదలు కోర్కిదైవార
తెలుగు మాటలనంగవలదు వేదముల
కొలదియ కాజూడుడిల నెట్టులనిన"[3]

ఇది కథలో భాగంగా చెప్పింది కాదు. కవి అభిప్రాయం. హరిహరునిలో కూడా ఇలాంటి భావనలే ఉన్నాయి. బసవాదులలాగా ఆ కవి వేదప్రామాణ్యాన్ని సారాసగటున తిరస్కరించలేదు.

**దళితుల ప్రసక్తి**

భక్తిలో మతానికి ప్రమేయం ఉంటుంది కాని కులానికి, వృత్తులకు కాదు. భక్తిలో స్త్రీపురుషులు పాలుపంచుకున్నారు. అవ్వైయార్, అక్కమహాదేవి, తాళ్ళపాక తిమ్మక్క, మీరాబాయిలాంటి భక్తనారీమణు లెంతోమంది ఉన్నారు. బసవేశ్వరుని శైవమతోద్యమంలో అన్ని కులాలకి, స్త్రీలకి చోటుంది. హరిహరుడు, పాల్కురికి సోమనాథుడు చిత్రించిన జీవితచరిత్రల్లో వివిధకులాలకి చెందినవారున్నారు. దళితుల ప్రసక్తి ఉన్న సందర్భాలని పరిశీలిస్తే ఆనాటి సమాజంలో దళితులనిగూర్చి అగ్రకులాల భావనలెలా ఉండేవో తెలుస్తుంది.

హరిహరుని రగడల్లో మూడు రకాల కథలున్నాయి. పురాతన రగడలనే పేరుతో తమిళ నాయన్మారుల జీవితచరిత్రలున్నాయి. వీటిలో కొన్ని పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో, పండితారాధ్యచరిత్రలో కూడా కనిపిస్తాయి. హరిహరుని రగడల్లో, పాల్కురికి సోమనాథుని రచనల్లో కనిపించే మరికొందరు భక్తులు కన్నడదేశానికి చెందినవారు. వారిలో కొందరు తెలుగునాట ఉన్నవా రనుకోవచ్చు. కొందరు తెలుగు భక్తులు కూడా వారిలో ఉన్నారు. ఇకపోతే హరిహరుని రగడల్లో కొన్ని బాణుడు మొదలైన భక్తులకు సంబంధించినవి.

హరిహరుని రగడల్లో, పాల్కురికి సోమనాథుని రచనల్లో వివిధ కులాలకు చెందిన భక్తుల కథలున్నాయి. వారిలో కొంతమంది దళితులు కూడా ఉన్నారు. వారి కథలు కాక కొన్నిటిలో దళితులని గూర్చి ఇతరులు ఏమనుకుంటున్నారనే విషయం కూడా అక్కడక్కడ కనిపిస్తుంది. హరిహరుడు రచించిన **బాహూర బొమ్మితందెయ రగళె** అనే కథలో దళితులకి సమాజంలో ఉండే స్థానాన్ని గురించి, అస్పృశ్యతని గురించి తెలిపే సందర్భాలున్నాయి.

బొమ్మయ్య గొప్ప శివభక్తుడు. అతని దృష్టి ఎప్పుడూ శివుని మీదనే ఉండేది. ఆ శివభక్తుడు **"కలి మలిన కులాన్ని బాధ పెట్టడమే నియమంగా పెట్టుకున్నాడు"** ('కలిమలిన కులవనందందిగె శోషిసుతె, ఇదు నియమవాగిప్పుదా పరమభక్తంగె'). ఈ కథలో బొమ్మతందె జైనులతో తగాదాలు పెట్టుకుంటాడు. హరిహరుని రగడలలో చాలాచోట్ల శైవులకు, జైనులకు ఘర్షణ జరిగినట్లుగా, జైనులమీద శైవులదే పైచేయి అన్నట్లుగా చిత్రితమై ఉంది. **'కలి మలిన కులం'** అన్నప్పుడు కవి దళితులనిగురించి చెప్తున్నాడా లేక జైనులను దళితులతో పోలుస్తున్నాడా అనేది స్పష్టంగా లేదు. కాని ఇతర కథలలో హరిహరుడు దళితులని అగ్రకులాల వారు ఎలా అసహ్యించుకొనేవారు అనే విషయాన్ని కథలో భాగంగా చిత్రించాడు.

భోగణ్ణన రగళె అనేది శివభక్తుడైన భోగయ్య కథ. ఇది పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో కూడా ఉంది. ఈ భక్తుడు కెంబావి అనే ఊళ్ళో ఉండేవాడు. అతను జంగమప్రియుడు, నిర్దోషి, నిష్కామి. అన్నివిధాలా శివపదయుగమే శరణమని నమ్మినవాడు. ఇక్కడ హరిహరుడు ఒక విషయం చెప్తాడు: **"శివభక్తులలో జాతిని పాటించరు, శివభక్తులు భేదాన్ని కల్పించరు"**[5] దీన్నే నిజం చెయ్యడానికి శివుడు దళితుని వేషంలో వచ్చాడు. భోగణ్ణ అతనికి సర్వమర్యాదలు చేశాడు. దీన్ని అక్కడి బ్రాహ్మణులు ఓర్వలేకపోయారు. రాజు దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నారు. పంచముడికి భోగణ్ణ మర్యాద చేసి పరమాపరాధం చేశాడని విన్నవించుకున్నారు. **'దీనివల్ల కులనాశం జరిగింది. భోగణ్ణను పిలిపించి విచారించండి'** అని ఒత్తిడి చేశారు. రాజు భోగణ్ణను పిలిపించి విచారించాడు. భోగణ్ణ ఇలా అన్నాడు : **"నేనేమైనా శివభక్తుడు కాని పంచముడిని గౌరవించానా? శివభక్తుడిని గౌరవించాను, అది తప్పా?"** దీనివల్ల ఒక విషయం స్పష్టమవుతుంది. పంచముడైనా సరే, శివభక్తుడయితే అతడిని గౌరవించవలిసిందే. కాకుంటే పంచముడు అస్పృశ్యుడే. పాల్కురికి సోమనాథుని బసవపురాణములో భోగయ్య కెంబాగిలో ఉన్నాడు. ఆయనపై కరుణించి, పరీక్షింపదలచి శివుడు **"పెరవాని క్రియ నొక్క పెయ్య శవంబు మ్రోచికొనుచు"** వచ్చాడు. ఇక్కడ పంచముడిని **'పెరవాడు'** అనడం గమనించాలి. కన్నడంలో ఇదే సందర్భంలో పంచముడి రూపంలో వచ్చాడు అనడానికి హరిహరుడు **'హొరియ వేష'** (పెద్ద వేషం) అన్నాడు. సోమనాథుని భోగయ్య కథలో శివుడు చండాలుని రూపంలో వచ్చి **"చచ్చిన పెయ్య మాంసము నారగింప నిచ్చు"** అన్నాడు (పు. 184). భోగయ్య వండిన విధానం ఇలా ఉంది :

**"క్షారామ్లలవణయుక్తముగ మాంసంబు**
**సారంబుగా వండి చయ్యన మరియు**
**శాకముల్గావించి సంధిల్ల పెక్కు**
**పాకంబు లొడగూర్చి భద్రమూర్తికిని"**

ఈ విషయాలు హరిహరుని రగడలో లేవు. తెలుగులో కొన్ని భిన్నంగా ఉన్నాయి. భోగయ్య మాంసాహారం వండి ఆరగించడానికి పెడుతూ ఉంటే ఆ అగ్రహారంలోని బ్రాహ్మణులంతా ఇలా చేశారట:

**"గుండులు బడియలు గొని పారిపారి**
**యొండొరు కడవంగనుద్వృత్తినరిగి**
**నరుకుడు తలతల్పులురుకుడు గుడిసె**
**పెరుకుడు భోగయ్య బరుపుడు వెదకి**
**పట్టుడు తల వచ్చి బడియల పగుల**
**గొట్టుడు మాదిగకొయ్య బోనీక"**

పాల్కురికి సోమనాథుడు ఇంకా కొన్ని కథలలో దళితులను గురించిన అభిప్రాయల్ని వ్యక్తం చేశాడు. శ్వపచయ్య గారి కథలో ఒక బ్రాహ్మణుడు ఆకాశమార్గంలో వెళ్తూ శ్వపచయ్య అనే శివభక్తుడు వంట వండుతుండగా చూచాడు. ఆ బ్రాహ్మణుని కర్మపు దృష్టి పడగూడదని శ్వపచుడు తాను వండుతున్న మాంసాహారాన్ని చెప్పుతో మూశాడు. ఆ శివభక్తుని చూచి నవ్వినందుకు బ్రాహ్మణుడు తన మంత్రశక్తిని కోల్పోయాడు. ఇందులో శివభక్తుడైతే కులం లెక్కలోకి

రాదనే విషయాన్ని సోమనాథుడు స్పష్టం చేశాడు.

**"శ్వపచుడైనను లింగసహితుడైయున్న**
**నుపమింప సద్బ్రాహ్మణోత్తముడు**
**త్రిపురారి గొల్వని ద్విజముఖ్యుడైన**
**శ్వపచాధములకంటె జాలంగ కీడు"**

గుడ్డవ్వ కథలో కూడా పాల్కురికి సోమనాథుడు శివభక్తులకు కులభేదం లేదనే విషయాన్ని స్పష్టం చేశాడు. గుడ్డవ్వ అనే పెద్ద భక్తురాలు పురవీథిలో ప్రవేశించకూడదని బ్రాహ్మణులు ఆమెను నిందించారు. కాని ఆమె భక్తికి మెచ్చి శివుడు ఆమెపై కరుణ చూపాడు. ఆ సందర్భంలో సోమనాథుడు **"ముదిత గుడ్డవ్వ కీర్తి లోకముల నంకింపంగబడియె"** అని చెప్తూ నిటలాక్షుభక్తులను కులహీనులనరాదంటాడు. ఇంకా ఇలా అంటాడు:

**"కని ప్రతిష్ఠాపూర్వకంబైన పిదప**
**చెనసి లింగమకాక శిల యనజనునె**
**యతిశయలింగదీక్షితుడైనయట్టి**
**ప్రతి నంత్యజుండని మతిజూడదగునె."**

శివనాగుమయ్య కథ కూడ ఇలాంటిదే. ఒకనాడు భూసురులంతా రాజు దగ్గరికి వెళ్ళి బసవేశ్వరుని మీద నిందలు వేస్తూ మాట్లాడారు. నేరుగా తమ మనసులో ఉన్న మాటని వెళ్ళగ్రక్కారు :

**"కథలేల కళ్యాణకటకమంతయును**
**బ్రథితంబు మాలలపాలయ్యెనింక**
**నెక్కడి వర్ణంబు లెక్కడి నీతు**
**లెక్కడి ధర్మంబు లిట్లేల చెల్లు"**

కులసంకరంవల్ల అనర్థాలు జరుగుతాయని రాజు అష్టాదశ వర్ణాలున్నాయని, వాటిని కాపాడడం తన ధర్మమని, ఇలాంటి పనుల వల్ల వర్షాలు కురవవని చెప్తాడు.

ఇలాంటి సందర్భాలు అటు హరిహరనాథునిలోను, ఇటు పాల్కురికి సోమనాథునిలోను చాలాచోట్ల కనిపిస్తాయి. శివకవియుగంలో ఇలాంటివి సర్వసామాన్యమే. వేదప్రామాణ్యాన్ని అంగీకరించినట్లే కనిపించినా ఈ ఇద్దరు కవులు సందర్భం వచ్చినప్పుడు వేద విహితమైన బ్రాహ్మణ్యాన్ని తీవ్రంగా నిరసిస్తారు. ముఖ్యంగా శివభక్తులకు కులం లేదని, దళితుల్ని కూడా ఇతరులతో సమానంగా పరిగణించి గౌరవించాలని సూచిస్తారు. ఈ విషయంలో ఈ ఇద్దరు కవుల మధ్య ఎన్నో పోలికలు కనిపిస్తాయి.

**టిప్పణి :**

1. ఈ విషయాన్నిగురించి ప్రఖ్యాత పండితులు, పరిశోధకులు జీరెడ్డి చెన్నారెడ్డి గారు పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టం పొందారు.
2. ఆర్వీయస్. సుందరం, కన్నడ సాహిత్య చరిత్ర, పు. 3.
3. బసవపురాణము, పు. 4.
4. హరిహరన రగళెగళు, పు. 255.
5. అదే, పు. 273.

**ఆధారగ్రంథాలు**


కన్నడ సాహిత్య చరిత్ర, ఆర్వీయస్ సుందరం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1977.

బసవపురాణము, పాల్కురికి సోమనాథకవి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2002.

బసవపురాణము (వచనము), అక్కిరాజు రమాపతిరావు, సుపథ ప్రచురణలు, హైదరాబాద్, 2005.

హరిహరన రగళెగళు, విశ్వకన్నడ సమ్మేళన సాహిత్యమాలె, బెంగళూరు, 2011.


## ముగింపు లేని వాక్యం!!

ఇవాలంతా ఆ మట్టి రంగమ్మాయి గురించే రాయాలనుంది.
రేపైతే మళ్ళీ గాజు కళ్ళ పిల్లను గూర్చి రాసుకోవాలి.

ఎక్కడో ఓ చోట
రోజూ నాకు ముక్కలవుతున్న
ఆడపిల్లల మనసులు ఎదురవుతూనే ఉంటాయి.

ఆ అమ్మాయిల రక్తపు చారికలు
గొంతుపై గోర్ల బరకలు
నా పగటి కలల్ని కూడా ఆక్రమించుకుంటాయి.

వాటిని రాసే పనిలో నేను అలా కూర్చుంటానో లేదో
అనామక చేయేదో నా చనుమొనలను మీటుతూ ఉంటుంది.

ఇక ఆ మట్టి రంగు అమ్మాయిని,
గాజు కళ్ళ పిల్లను నేనే అవుతాను
వాక్యం అలా కొనసాగుతూనే వుంటుంది !!


**శ్రీనిధి విప్లవశ్రీ**
**ఫోన్ : 6302500028**

# మరమ్మత్...



ఇప్పుడంటే మా యింట్లో
కుర్చీలొచ్చినై
అవి లేకున్నా
అప్పట్లో ఫరక్ అన్పించలేదు
కింద కూర్చొనే రాసుకునేవాణ్ని
మోచేయి నేలకానించి
ఆరునెలల పాటు
వేమన గ్రంథం రాశాను
కాకపోతే చెయ్యి కాస్త రిపేరు కొచ్చింది

విద్యార్థి జీవితంలో
ఎవరో ఇచ్చి గిఫ్టు ఈ వాచి
ఇప్పటికీ టిక్కుటిక్కులకు డోకా లేదు
పలు దేశాలు తిరిగాను గాని
సమయ నిబద్ధత దెబ్బ తినలేదు
కాకపోతే కాస్త రిపేరు కొచ్చింది

యాభై సంవత్సరాల నాటి సైకిల్
ఆసుపోసిన దారాలను కలిపితే
వేలాది మైళ్లు
నా జీవనయాత్రలో
దానిది విలువైన పాత్ర
కాకపోతే కాస్త కాస్త రిపేరు కొస్తుంది

క్లాస్‌రూమ్‌లో నిలబడి
ఎన్నివేల గంటలో
పాఠాలు బోధించాను
పిక్కల్లో వెరికోసులు తేలాయి గాని
ఆ పాఠాలు ఎందరినో
శిఖరాలకు చేర్చాయి
కాకపోతే కాళ్లు కాస్త కాస్త రిపేరుకొచ్చాయి

రిపేర్ల వల్ల ఎప్పుడూ
బతుకు నాణ్యతకు
భంగం వాటిల్ల లేదు
పర్యవసానం
ఒక ఔపయోగిక గానంగానే వెలిగిపోయింది

పాత వస్తువులను పారేసి
కొత్తవి కొనాలంటారు మనవాళ్లు
అమ్మో అదెట్లా!
అవి నా జ్ఞాపకాల ఖజానా!
వాటిని వదుల్తానా

— డా. ఎన్. గోపి —
ఫోన్ : 939 102 8496

# పెళ్ళంటే నాటకం కాదు

పెళ్లంటే మెడలో తాళి
నుదుటన తిలకం మాత్రమే కాదు
అగ్నిసాక్షిగా
సప్తపది మాత్రమే కాదు

స్వచ్ఛమైన ప్రేమతో ప్రేమించడం.
ప్రేమంటే మనసుతో ప్రేమించాలి
నాటకంతో కాదు


పెళ్ళంటే అందరి ముందు బాగునట్టు నటించడం కాదు
నటనలేని ప్రేమతో జీవించడం.

ఇంటి పనుల్లో పడి
చెప్పిన పని చేయలేదని తిట్టడం కాదు
కాల యముడిలా నా మాట శాసనం అంటూ
వేధించడం కాదు
వేధింపులు లేని జీవితాన్ని
ఆస్వాదిస్తూ ఒకరికొకరు సర్దుకుపోవడం.

ఎక్కువ తక్కువ అంటూ అహంతో కూడుకున్నది కాదు
అహం లేకుండా అహంకారాన్ని పక్కకి పెట్టి
ఒకరి అడుగులో ఒకరై నడిచి
పార్వతీ పరమేశ్వరుల్లా అన్యోన్యంగా ఉండటం.

ఒకరిపై ఒకరు అధికారాన్ని చలాయించుకోవడం కాదు
ఒకరికొకరు తక్కువ చేసి మాట్లాడుకోవడం కాదు
ఒకరి ముందు ఒకరు తక్కువ కాకుండా గౌరవించుకోవడం.

పెళ్లంటే మంట కాదు
నూరేళ్ళపంట.




పెద్దపల్లి తేజస్విని
ఫోన్ : 960 332 9474

# తిలక్ అభిరుచులు - అలవాట్లు

**ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు,** విశ్రాంత ఆచార్యులు ఫోన్ : 99454 22742

**"ఏపుగా పెరిగిన చెట్టు మీద ఎర్రని పువ్వొకటి విరిసి**
**ఎండలో మెరుస్తూ ఇదే నిజం ఇదే నిజం అని నవ్వుతూ**
**అంతలో రాలిపోయింది.... !**
**వింతగా స్మృతిలో మాత్రం మిగిలింది...!! "** (– 'కిటికీ', భారతి, ఏప్రిల్ 1965.)

**1. నా పరిచయ ప్రారంభం**

కీ॥శే॥ దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు నాకు అత్యంత సన్నిహితులు. 1955 నుండి 1961 వరకూ ఆరు సంవత్సరాల పాటు నేను వారితో కూడా కూడా తిరిగినవాణ్ణి. రోజూ ఇరవై నాలుగు గంటల్లో ఇరవై గంటలు వారి యింటి దగ్గరే గడిపేవాణ్ణి. తిలక్ గారిదీ నాదీ ఒకే ఊరు (పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు) కావడం వల్ల ఈ సన్నిహితత్వం పెంపొందిందని భావించడానికి వీల్లేదు. 1955 వరకూ తిలక్‌గారు తణుకులో ఉంటున్న సంగతే నాకు తెలియదు. వారితో నా పరిచయ ప్రారంభం చాలా విచిత్రంగా జరిగింది.

1955లో నేను భీమవరం కళాశాలలో తెలుగు అభిమాన విషయంగా బి.ఏ. చదువుతున్నాను. ఆ సంవత్సరం జూన్ నెల 'భారతి'లో మొదటి పుటలో 'ఆర్తగీతం' అనే గేయం పడింది. కళాశాల గ్రంథాలయంలో మిత్రులతో మాట్లాడుతూ యథాలాపంగా దాన్ని చూశాను. వెంటనే నన్ను ఆకర్షించింది. మరోమారు చదివాను. హృదయాన్ని ఊపివేసింది. వ్రాసుకోవాలనుకున్నాను. దగ్గర ఏమీ కనబడలేదు. "History of Telugu literature" నోటుబుక్కు ఉంది. అందులో వ్రాసేసుకున్నాను. బి.ఏ. క్లాసులో మిత్రులందరికీ చదివి వినిపించాను. ప్రాచీన సాహిత్య ప్రియుడు, శుద్ధ గ్రాంథికవాది అయిన ఒక్క మిత్రుడు తప్ప అందరూ మెచ్చుకున్నారు. ('స్తన్య సన్నిధి' అనే ప్రయోగం తప్పన్నాడు ఆ గ్రాంథికవాది గుడ్లురిమి చూస్తూ. "నీవీ మోక్షణ వేళాయాం వస్త్రమూల్య విచారకాః" ఏం చేస్తాం మరి!). కళాశాల వదలిన తర్వాత గదికి వెళ్లి కంఠతా పట్టాను ఆ గేయాన్ని. ఆంధ్రాభ్యుదయోత్సవాలలో కళాశాల వేదికనుండి చదివాను. అందరి ప్రశంసలనూ అందుకుంది **'ఆర్తగీతం'**. కాని ఇంత మంచి గేయాన్ని వ్రాసిన కవి ఎవరో మనకు పరిచయం లేదు కదా! అని బాధపడ్డాను. **'బాలగంగాధర తిలక్'** అనేది గుప్త నామధేయం అనుకొన్నాను. 'తిలక్' అంటే స్వాతంత్ర్య సమరయోధు డైన మహారాష్ట్ర తిలక్కే కాని, తెలుగులో ఎవరున్నా రనుకుంటాము? కనపడిన మిత్రులందరి దగ్గరా ఆర్తగీతాన్ని ప్రశంసించడం మొదలుపెట్టాను.

ఇంతలో దసరా సెలవులు వచ్చాయి. నేను భీమవరం నుండి తణుకు వచ్చాను. శ్రీపాద కృష్ణమూర్తి అనే మిత్రుడు మా యింటికి వచ్చాడు. అతనికి తెలుగు సాహిత్యమంటే వల్లమాలిన అభిమానం. ఏదో సందర్భంలో అతనితో **"జూన్ నెల భారతిలో 'ఆర్తగీత'మనే గేయం వచ్చింది చూశావా? ఎవరో 'బాలగంగాధర తిలక్' అట. చాలా అద్భుతంగా వ్రాశాడోయ్!"** అన్నాను. **"ఎవరో అంటా వేమిటి? తిలక్ ఎవరో నీకు తెలియదా? మన ఊరివాడే! టౌనుహాలు ప్రక్కనున్న తెల్లడాబా! రేపు నాతో రా పరిచయం చేస్తాను."** అన్నాడు. కృష్ణమూర్తి.



నేను మహా సంతోషపడ్డాను. తిలక్‌గారిని గురించి చాలా విషయాలు చెప్పాడు కృష్ణమూర్తి. తాను వాళ్ళింట్లో పిల్లలకు ప్రయివేట్లు చెపుతున్నాననీ, ప్రాచీన సాహిత్య పద్ధతులపై తనకున్న అభిప్రాయాలను తిలక్ ఎలా మార్చివేసిందీ, అన్నీ చెప్పాడు. తాను తిలక్ రచనలపై వ్రాసిన వ్యాసాన్ని చదివి వినిపిస్తానన్నాడు. మాయింటి దగ్గర ఉన్న సపోటాతోటలోనికి వెళ్ళాం ఇద్దరమూ. వేసవి కాలాన్ని గురించి తిలక్ వ్రాసిన గేయంలోని కొన్ని పంక్తులు కృష్ణమూర్తి తన వ్యాసంలో 'కోట్' చేశాడు. అందులో –

**"కాలం కదలదు – గుహలో**
**పులి పంజా విప్పదు – చేపకు**
**గాలం తగలదు –**
**… … … … …**
**ఎండుటాకులు సుడిగాలికి తిరిగెను**
**గిర్రున – వడగొట్టిన భిక్షుకి అరచెను**
**వెర్రిగ –**
**పంకా కింద శ్రీమంతుడు**
**ప్రాణం విడిచెను – గుండెక్రింద నెత్తురు**
**నడచెను…………"**

అనే పంక్తులూ, 'అద్దంలో జిన్నా' అనే రచనా ప్రశంసా నన్ను అమితంగా ఆకర్షించాయి. అవి పూర్తిగా చదవాలనుకున్నాను. (కృష్ణమూర్తి 'శ్యామకృష్ణ' అన్న కలం పేరుతో ఈ వ్యాసాన్ని 1956 జూన్ నెల భారతలో ప్రకటించాడు).

ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూశాను. మర్నాడు ఏడు గంటలకు రెడీ అయ్యాను. ఎంతసేపు ఎదురు చూసినా కృష్ణమూర్తి రాలేదు. ఇంక ఆగలేక నేనే కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళాను. ఇద్దరం కలిసి టౌనుహాలు ప్రక్కనున్న తిలక్ గారి యింటికి వెళ్ళాము.

ప్రాచీన పద్ధతిలో కట్టిన పెద్దదాబా, చుట్టూ ప్రహరీగోడ, పెద్ద చెక్క తలుపుల గేటు. ఆ గేటుపై **'బృందావనము'** అని వ్రాసి ఉంది. ఆ గేటు వచ్చే పోయేవారితో ఎప్పుడూ తెరచబడే ఉంటుంది. గేటుదాటి లోపలికి వెళ్ళగానే కటకటాలతో పెద్దహాలు, ఆ హాలుకు ఎడమచేతి వైపున్న మూడు గదులలో తిలక్‌గారి కాపురం. కుడిచేతి వైపున్న ఒకే ఒక్క గదిలో పుస్తకాల బీరువాలు రెండు, నాలుగు కుర్చీలు ఉన్నాయి. ఇదే తిలక్‌గారి డ్రాయింగు రూము. హాలుకు మధ్యనుండి తిన్నగా లోపల మరో ఇంట్లోకి మార్గం ఉంది. ఆ యింటిలో తిలక్‌గారి తల్లి, (అప్పటికి) అవివాహితులైన ముగ్గురు తమ్ములు ఉంటున్నారు. నేను, కృష్ణమూర్తి కలిసి డ్రాయింగ్ రూములోకి వెళ్ళాము........

తిలక్ అంటే ఎవరో ముసలివారు, సగం పళ్ళు ఊడిపోయి, నెరిసిన తలతో చాదస్తంగా మాట్లాడుతూ ఉంటాడనుకొన్నాను. కాని, అలా జరుగ లేదు. తెల్లటి గ్లాస్కోపంచ, తెల్లటిషర్టు, పచ్చదబ్బపండు లాంటి శరీరచ్ఛాయ, మొగలిరేకులాంటి మనిషి. పడక కుర్చీలో, మెత్తటిదిండు వెనకాల వేసుకొని, నోటిలో వక్క నములుతూ, కుడిచేతి చూపుడు వ్రేలితోనూ బొటన వ్రేలితోనూ పొడుము పట్టు పట్టుకొని, సన్నని పెదవులతో చిరునవ్వు నవ్వుతూ, ఒక అతిసుందరమైన వ్యక్తి మమ్మల్ని ఆహ్వానించాడు. నమస్కరించి కూర్చున్నాను. చిన్న చిన్న ఉంగరాలు తిరిగిన నల్లజుట్టు. కొనదేరినముక్కు. సోగకళ్లు, సువర్ణ సవర్ణ శరీరచ్ఛాయి. ముప్ఫై సంవత్సరాలు దాటిన వయస్సు! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. **'ఇప్పుడే ఇంత అందంగా ఉన్నాడే ఈయన, యౌవనంలో ఇంకా ఎంత అందంగా ఉండేవాడో!'** అనిపించింది నాకు.

**"ఇతనేనా నీ బి.ఏ. ఫ్రెండు?"** అని అడిగారు తిలక్ కృష్ణమూర్తి వైపు తిరిగి.

**"అవును, మిమ్మల్ని చూద్దామని వచ్చాడు"** అన్నాడు కృష్ణమూర్తి. మల్లెపూలు విచ్చినట్లు మెల్లగా నవ్వారు తిలక్‌గారు.

**"మీ ఆర్తగీతం చాలా బాగుందండీ! మా కాలేజీలో అనేకసార్లు చదివాను"** అన్నాను నేను.

కలకలా నవ్వారు తిలక్‌గారు. **"ఏదీ ఓ సారి చదువు"** అన్నారు.

**"కూర్చుని చదవలేను. నిలబడి చదువుతాను"** అన్నాను.

తిలక్ పకపకా నవ్వి, **'ఆల్‌రైట్! అలాగే కానీ'** అన్నారు.

నేను లేచి నిలబడి, గేయమంతా గంభీరంగా చదివాను.

**"బాగుంది, ఇంకా కొంచెం పాజ్ ఇచ్చి చదివితే మరీ బాగుంటుంది. దీనిని కాకినాడలో ఒకతను ఏకపాత్రాభినయం చేశాడట"** అన్నారాయన.

**"దీని నెప్పుడు వ్రాశారండీ?"** అని ప్రశ్నించాను నేను.

**"ఒకరోజు రాత్రి 8 గంటలవేళ మాయింటికి ఒక ముష్టి అమ్మి వచ్చింది. చిరిగిన బట్టలతో చంకన పిల్లవాణ్ణి పెట్టుకొని, అన్నం అడుక్కునేందుకు వచ్చింది. ఆ రాత్రి ఈ గేయం వ్రాశాను. ఇటువంటి పేదల్ని తలచుకొంటే ఒక్కొక్క రాత్రి నాకు నిద్రపట్టదు."** అన్నారు. ఆగర్భ శ్రీమంతుడు ఇలా మాట్లాడుతుంటే నేను నిశ్చేష్టుడనై అలా ఉండి పోయాను.......

**"నేను చూశాను నిజంగా మూర్తీ భవత్ దైన్యాన్ని, హైన్యాన్ని,**
**క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛత్ శవాకార వికారుల్ని;**
**ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకుపశ్రుతి?**
**ఏ బుద్ధదేవుని జన్మభూమికి గర్వస్మృతి?**
**... ... ... ... ... ... ... ... ... ...**
**ఒక్క నిరుపేద ఉన్నంతవరకు;**
**ఒక్క మలినాశ్రుబిందు వొరగినంత వరకు;**
**ఒక ప్రేవు ఆకలి కనలినంతవరకు**
**ఒక శుష్కస్తనసన్నిధిని క్షుధార్తి నేడ్చు పసిపాప ఉన్నంతవరకు;**
**ఒక తల్లి నీరవాక్రోశరవమ్ము విన్నంతవరకు!**
**ఒక క్షతదుఖితహృదయ మూరడిల్లినంతవరకు**
**నాకు శాంతి కలుగదింక నేస్తం, నేను నిగర్విన్నైనాను;**
**ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను...."**

ఇటువంటి కవిత్వం ప్రపంచంలో aristocratic family లో పుట్టిన ఏ కవీ వ్రాయలేదు! ఒక అరగంటసేపు వారితో సంభాషించి, ఇంటికి వెళ్ళిపోయాను. "Be coming to me. You are are always welcome" అన్నారు. నేను వెళ్ళిపోతుంటే ఎంతో ఆప్యాయంగా. గేటుదాకా నడిచివచ్చి మమ్మల్ని సాగనంపారు. సంతోషం నిండిన హృదయంతో ఇంటికి వెళ్ళాను.

ఇలా జరిగింది మా ప్రథమ పరిచయం. అప్పటినుండి అంటే 1955 సెప్టెంబరు నుండి, 1961 జూన్‌లో నేను తిరుపతి వెళ్ళే వరకూ, ఆరు సంవత్సరాలపాటు తిలక్‌గారితో అత్యంత సన్నిహితంగా మసిలాను. ఒక్కరోజు నన్ను చూడకపోతే ఉండలేక పోయేవారు! నేనూ అంతే! అందుచేతనే వారి అభిరుచులనూ, అలవాట్లనూ, వారు నాతో అతిరహస్యంగా ముచ్చటించిన విషయాలు కూడా ఏమీ దాపరికం లేకుండా బయట పెడుతున్నాను.... సహృదయంతో స్వీకరించవలసిందిగా పాఠకులను కోరుతున్నాను. కవిగా తిలక్‌ను చూపించటం కన్నా, మామూలు మనిషిగా తిలక్‌ను చూపించటానికే ఎక్కువ ప్రయత్నం చేశాను ఈ వ్యాసంలో.

**2. జననం – జనకుని ప్రభావం**

చనిపోయేనాటికి (1966 జూన్ 30వ తేది నాటికి) బాలగంగాధర తిలక్‌గారికి 44 సంవత్సరాలు నిండి 45వ సంవత్సరం నడుస్తోంది. 1955లో నాకు పరిచయమైనప్పుడు **"నీ వయస్సెంత?" అని నన్ను అడిగారు. ఇరవై సంవత్సరాలని చెప్పాను"** (నేను 1935లో పుట్టాను). **"నేను నీ కన్నా పద్నాలుగేళ్ళు పెద్దవాణ్ణి. నా వయస్సు 34 సంవత్సరాలు"** అన్నారు తిలక్. 1921 ఆగస్టు నెలలో పుట్టారు తిలక్ (తేదీ ఏమిటో తెలియడంలేదు). వీరి స్వగ్రామం పశ్చిమ గోదావరిజిల్లా 'మండపాక' గ్రామం. ఇది తణుకు పట్టణానికి నైరృతిమూలలో రెండుమైళ్ళ దూరంలో ఉంది. తిలక్‌గారు పుట్టింది ఆ గ్రామంలోనే! తరువాత వీరి తండ్రిగారు (దేవరకొండ సత్యనారాయణమూర్తిగారు) పిల్లల చదువులకూ, కోర్టు వ్యవహారాలకు అనువుగా ఉంటుందని తణుకులో ఇల్లు కట్టుకున్నారు.

దేవరకొండవారిది పశ్చిమ గోదావరి జిల్లాలో పేరుమోసిన వెలనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబం. సిరి సంపదలతో తులతూగే కుటుంబం. సాధారణంగా సిరి ఉన్నవారికి సంతానం ఉండదు. కాని, దేవరకొండవారి వంశం ఈ సూత్రానికి అపవాదం. తిలక్‌గారి తల్లిదండ్రులు : రామసోదెమ్మ–సత్యనారాయణమూర్తి. తిలక్‌గారు ఏడుగురు అన్నదమ్ములతోనూ, ఐదుగురు అప్పచెల్లెండ్రతోనూ కళకళలాడే కుటుంబంలో జన్మించారు. అన్నదమ్ములలో ఈయన రెండవ వారు. మొత్తం సంతానంలో ఆరవవారు.* సోదరులందరూ విజ్ఞానవంతులూ, వినయశీలురూ!

వీరి తండ్రి సత్యనారాయణమూర్తిగారు తెలుగులో మంచి పండితులు. రాజకీయాలన్నా, స్వాతంత్ర్య సమరమన్నా చెవికోసికొనే వారు. లోకమాన్య బాలగంగాధర తిలక్ అప్పుడు భారత స్వాతంత్ర్య సమరాన్ని నడుపుతున్నాడు. సత్యనారాయణ మూర్తిగారికి తిలక్ అంటే పంచప్రాణాలూను. అందుచేతనే తన రెండవ కుమారుడు పుట్టగానే "బాలగంగాధర తిలక్" అని ఆ మహానాయకుని పేరు పెట్టి తన దేశభక్తిని వెల్లడించుకున్నారు. కాని ఈ పుత్రుడు రాజకీయాల జోలికి పోకుండా, కవితాకన్యను వరించి, వరింపజేసుకొన్నాడు మన అదృష్టం కొద్దీ! తణుకు హైస్కూలుల్లో స్కూలుఫైనల్ పాసయ్యాక మద్రాసువెళ్ళి, ఇంటర్మీడియేట్ చదివారు. కాని అనారోగ్య కారణాలవల్ల దాన్ని పూర్తిచేయకుండానే ఇంటికి తిరిగి వచ్చేశారు. తరువాత విశాఖపట్నం మిసెస్ ఏ.వి.యన్. కాలేజీలో చేరారు ఇంటర్లో. కాని ఆరోగ్యం సరిగాలేక అక్కడా చదువు పూర్తిచేయలేక పోయారు. తిరిగి తణుకు వచ్చేసి హాయిగా చదువుకుంటూ, కవిత్వం వ్రాసుకుంటూ కూర్చున్నారు.

కవి తిలక్‌నకు తండ్రిగారంటే చాలా అభిమానం. తనకు కవిత్వాభినివేశం తండ్రివద్దనుంచే సంక్రమించిందనే వారు. నా దగ్గర తరచుగా తండ్రిగారి ప్రశంస తెస్తూ ఉండేవారు. (హాల్లో ఎదురుగా తండ్రిగారిది నిలువెత్తు ఆయిల్ పెయింటింగ్ ఉండేది. తిలక్‌గారిది అంతా తండ్రిగారి పోలికే!).

**"మా నాన్న భారతంలో పద్యాలు గడగడా అప్పజెప్పేవాడు. ఆయనకు పాలిటిక్స్ అంటే మహాయిష్టం. అందులోనూ గాంధీకన్నా తిలక్ అంటే మరీ యిష్టం. ఆ పేరే నాకూ పెట్టాడు. నేను మంచి కవిని అవుతానని మా నాన్న అప్పుడప్పుడు అంటూ ఉండేవాడు. నేను పుస్తకాల విషయంలో ఎంత డబ్బు ఖర్చుచేసినా ఏమి అనేవాడు కాదు. నే నొకసారి బొంబాయి వెళ్ళి ఆరువందల రూపాయల పుస్తకాలకు అడ్డరు ఇచ్చి, తణుకు వచ్చేశాను. నాలుగు రోజుల్లో నా పేర పార్సెల్ వచ్చింది. నన్ను ఏమీ అనలేదు మా నాన్న. 'ఈ పుస్తకాలన్నీ నీకు అవసరమా?' అని మాత్రం అడిగాడు. నేను 'ఔను' అన్నాను. అంతే! ఇంకేమీ మాటాడకుండా ఆ వి.పి.పి.ని మా నాన్న విడిపించి నాకు ఇచ్చాడు."** అని చెబుతూ ఉండేవారు నాతో.

తిలక్‌గారి మూడవ తమ్ముడు కథారచయిత అయిన గంగాధర రామారావుగారి వ్యాసాన్నిబట్టి తిలక్‌గారి అనారోగ్యానికి మూలకారణం వీరి తండ్రిగారి హఠాన్మరణం అని తెలుస్తోంది:–

**"1944 జూన్‌లో మా నాన్నగారు పుష్కరస్నానానికి కానూరు అగ్రహారం వెళ్ళారు. అక్కడే గుండెపోటు వచ్చి, గోదావరి ఒడ్డునే మరణించారు. అప్పటినుంచి తిలక్ ఆరోగ్యం క్షీణించింది. అతనికి ఒక రకమైన ప్రాణభయం ఆవరించింది. అతడు చిన్నప్పటినుంచి జీర్ణసంబంధమైన సమస్యతో బాధపడేవాడు. దానివలన అప్పుడప్పుడు గుండెదడ వచ్చేది. అదే యిప్పుడు(1944లో) వస్తే హార్ట్ ఎటాక్ అని భయం పెంచుకున్నాడు. ఈ అనవసర ఆందోళన ఒక మానసిక సమస్యగా క్రుంగదీసింది. డాక్టర్ల చుట్టూ తిరిగి వందలకి వందలు ఖర్చుచేశాడు. విశాఖ పట్టణం, మద్రాసులతో ఉన్న ఎక్స్‌పర్ట్ దాక్టర్లు చూసి 'నీ గుండె రాయిలా ఉంది' అని భరోసా యిచ్చారు. అయినా తిలక్ ధైర్యం తెచ్చుకోలేకపోయాడు. దీనికి తోడు ఆర్థికసమస్యలూ చుట్టుముట్టాయి"** (–"మా అన్నయ్య తిలక్", తిలక్ సాహితీ సమాలోచనమ్, 2008, పుట–51)

ఈ గంగాధర రామారావుగారు వ్రాసిన దానినిబట్టి చూస్తే తిలక్‌గారికి గుండెజబ్బు లేదనీ, ఉన్నదని ఊహించుకొని భయపడ్డారని మనం భావించవలసి వస్తుంది. నేనొకసారి డా॥ రాచకొండ నరసింహశర్మ, M.D. (ప్రముఖ రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి తమ్ముడు, కవి, అనువాదకుడు) తో తిలక్‌గారి వ్యాధిని గురించి చర్చించాను. వారు తిలక్‌గారికి వచ్చిన వ్యాధిపేరు "Hypo- chondriasis" అనీ, లేని జబ్బులు ఉన్నట్లుగా భావించుకొని బాధపడటం అనీ అన్నారు. కాని 45 సంవత్సరాలు కూడా నిండకుండానే తిలక్ చనిపోవడంవల్ల వారికి గుండెజబ్బు ఉన్నదనే మనం తీర్మానించుకోవలసివుంటుంది. తిలక్ కూడా **"బాధాగళము"** అనే ఖండికలో **"గుండియపోటుతో బ్రతుకు కోసలు**

**వంకరలయ్యే"** అని వ్రాసుకున్నారు కదా! అయినా, తిలక్ ఆధివ్యాధులను గురించి ఏదీ నిశ్చయంగా చెప్పలేకపోతున్నాను.

తిలక్ తమ్ముడుగారు వ్రాసిన దానినిబట్టి, తండ్రి సత్యనారాయణ మూర్తి గారంటే తిలక్‌గారికి చెప్పలేనంత ప్రేమ అనీ, వారి ఆకస్మిక మరణంతో తిలక్ upset అయ్యారనీ, దీనితో వారికి రకరకాల మానసిక రోగాలు, నరాల వ్యాధులు, గుండెపోటు వచ్చాయని మనం అనుకోడానికి అవకాశం ఉంది.

వీరి నాన్నగారు దివంగతులయ్యాక ఏడుగురు అన్నదమ్ములూ ఆస్తిపాస్తులు పంచుకున్నారు. (ఒక్కొక్కరు యాభై ఎకరాల మాగాణి పొలమూ, యాభైవేల రూపాయల రొక్కం పంచుకొన్నారని వీరి సోదరులు గంగాధర రామారావుగారు నాతో చెప్పిన జ్ఞాపకం.) కాని, భూముల విషయం, వడ్డీవ్యాపారం, పెండ్లి పేరంటాల ఆధ్వర్యం అంతా వీరి అన్న "పెద్ద అన్నప్ప" గారే నిర్వహించుకుంటూ వచ్చారు. (వీరు మంచి వ్యవహారజ్ఞులు. వీరు తణుకులోనే ప్రత్యేకంగా ఒక మేడలో ఉండేవారు.)

బాల్యంలో ఒకసారి తిలక్‌గారికి విపరీతంగా జబ్బు చేసిందట. ఎన్ని మందు లిచ్చినా తగ్గలేదు. మండపాకకు ఆరుమైళ్ళ దూరంలో ఉన్న "రేలంగి" అనే గ్రామంలో ఎవరో మంత్రజలం, విభూతి యిస్తారనీ, ఆ జలం త్రాగించి విభూతి నొసట పెడితే జ్వరం తగ్గిపోతుందనీ చెప్పారు ఒకరు. అర్ధరాత్రివేళ ఎలా వస్తుంది ఆ మంత్రజలం? తెల్లవారేవరకూ ఆగితే, పిల్లవాడు బ్రతికేలా లేడు. తల్లిదండ్రుల కేమీ తోచలేదు. వారి వద్దనున్న ఒక రైతు **"నేను వెడతానండీ వంతులుగారూ"** అని సత్యనారాయణగారితో చెప్పి, చిన్న లాంతరు తీసికొని, ఆరుమైళ్ళూ నడిచి వెళ్ళి, ఆ విభూతి, మంత్రజలం తెచ్చాడట. ఆ రైతు సేవాధర్మాన్నీ, విశ్వాసాన్నీ తిలక్‌గారు పదే పదే తలచుకొనేవారు. **"మనిషికి విశ్వాసం. పరోపకారబుద్ధి వుండాలి. ఇవి లేనివాడు మానవుడే కాదు"** అని అంటూ ఉండేవారు. ఈ సత్యాన్ని **"నల్లజర్ల రోడ్డు"** అనే కథలో నిరూపించారు. (సశేషం)

# పెద్ద ఒడి

ఆమె ముందు నుండి నడిచిపోతున్నప్పుడు
మనం దూదిపింజల్లా తేలిపోతాం
ప్రవేశం లేకున్నా పరిసరాల్లో సేదదీరుతాం
అందరూ చొచ్చుకుపోవాలనుకున్నా
ఆమె అంతరాల్లోకి ప్రవేశాలు పరిమితం

చుక్కలను సిగలో చెక్కిన శిల్పం
చందమామను 'అరా' చేసుకొని
ప్రభాతాలకు సంధ్యా శోభ తెచ్చిన
ఒక దేవకన్య భువికి దిగి పీఠభూమికి మురిసి
శాశ్వతంగా నిలబడిపోయింది

ఆమెను చూసిన ప్రతి లేడిపిల్లా గంతులేస్తది
అక్కడ నడిచిన ప్రతి నెమలీ నాట్యమాడుతది
పల్లె మందారాలన్నీ ఆమె ఒడిలో ఆడాలని
కనిపించని ప్రవేశదారాన్ని పట్టుకొని
ఒదుపుగా గళహారానికి చేరుకుంటె



ఆమె వాకిట్లో అడుగుపెడితే
భవిష్యత్తు మహాసౌధానికి
తొలిమెట్టు దొరికినట్లే
అక్కడ మన పాదం పడగానే
అకస్మాత్తుగా దేవకన్య కాస్తా
రాజమాతగా మారిపోతది
పరిణతి పెరిగిన కొద్దీ
ఆమె పల్లె తల్లిలా దగ్గర తీస్తది
కాలానుగుణంగా
ప్రజాభీష్టకేతనాల నెగరేస్తది
ధ్రువపత్రాలతో పాటే
జీవితాంతం దాచుకోదగిన
నిజాయితీ దైవత్వాన్ని నూరిపోస్తది
చెదరని ఆత్మవిశ్వాసాన్ని చేతుల్నిండా బహుకరిస్తది
రాయిలో పురుడు పోసుకున్న
శిల్పమనుకుంటం కానీ
ఆమె శిలలో పొదిగిన
పరిణతాత్మ

**డా. ఏనుగు నరసింహా రెడ్డి**
ఫోన్ : 897 886 9183

# తెలుగు సాహిత్యంపై రైతాంగ ఉద్యమాల ప్రభావం

**చింతరెడ్డి భాస్కర రెడ్డి,** మిర్యాలగూడ ఫోన్ : 9701 295 200

భారతదేశంలో ప్రధాన వృత్తి వ్యవసాయం. మన రాష్ట్రంలో కృష్ణా, గోదావరి వంటి అతి పెద్ద నదులు ప్రవహిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదించిన అపార సంపదతో ప్రతిపల్లెను సస్యశ్యామలం చేయవచ్చు కానీ గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వల్ల దేశ ప్రగతి రథచక్రాలైన అన్నదాతలు స్వాతంత్ర్యానికంటే ముందు అనంతరం భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేయవలసి వచ్చింది. ఈ దశలో తెలుగు సాహిత్యంపై రైతాంగ ఉద్యమాల ప్రభావంపడింది. కాబట్టి రైతాంగ పోరాటాల నేపథ్యంలో రైతన్నలను చైతన్యవంతం చేయడానికి ఎందరో కవులు, రచయితలు తమ కలం గళం విప్పి కథలు, కావ్యాలు, నవలలు, నాటకాలు, పద్యాలు, పాటలు రాసి ఉద్యమానికి ఊపిరిపోశారు.

స్వాతంత్ర్యానికంటే ముందు పటేల్, పట్వారీ, భూస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. ఆ సమయంలో రైతులు తమ నాగళ్లతో ముందుగా దొరల భూములు దున్నేవారు. స్త్రీలు ఉచితంగా నాట్లు వేసేవారు వీటితో పాటు కలుపు తీయడం, కోత కోయడం లాంటి పనులు కూడా ఉచితంగా చేసేవారు. పేదలతో బలవంతంగా దౌర్జన్యంగా ఉచితంగా పనిచేయించుకునే వెట్టిచాకిరీ విధానం హైదరాబాద్ సంస్థానంలో ఉండేది. కొందరు భూస్వాముల దుర్మార్గాలకు వ్యతిరేకంగా ప్రజలు, తెలంగాణ సాయుధ పోరాటం, నక్సలిజం, రైతాంగ ఉద్యమాలు ప్రారంభించారు అవి ఆయా ప్రాంతాల రైతాంగాన్ని ఉత్సాహ పరిచేవి. జగిత్యాల తాలూకా మద్దనూరు గ్రామంలో భూస్వామి రాజేశ్వరరావు ప్రజలచే అన్ని రకాల వెట్టిచాకిరీ పనులు చేయించేవాడు. దీనికి వ్యతిరేకంగా గ్రామ ప్రజలు చీమల బారులా కదిలి దొర పై తిరుగుబాటు చేశారు. ఎర్రజెండా వారు తోరణాలు కట్టి దొరలకు వ్యతిరేకంగా బహిరంగ సభలు నిర్వహించేవారు ఈ సభలకు మారుమూల గ్రామాల ప్రజలు ఓ చేతిలో సద్దిమూట, మరో చేతిలో కర్ర, భుజాన గొంగడి పెట్టుకొని పది పదిహేను మైళ్ల దూరంనుండి కదిలి వచ్చి **"దున్నే వానికే భూమి" "భూస్వాముల దౌర్జన్యాలు నశించాలి"** అనే నినాదాలతో సభలు మారు మోగేవి. సూర్యాపేట సమీపంలోని ఎర్రపాడు దొర జన్నారెడ్డి ప్రతాప రెడ్డికి వ్యతరేకంగా బండి యాదగిరి రాసిన పాట...

**"బండెనక బండి కట్టి ....... పదహారు బండ్లు కట్టి ...... ఏ బండ్లో పోతవు కొడుకో...... కొడుకో నా జన్నారెడ్డి ప్రతాప రెడ్డి"** ఈ పాటను మా భూమి సినిమాలో నైజాముకు అన్వయిస్తూ మార్పు చేసి **"బండెనక బండి కట్టి ....... పదహారు బండ్లు కట్టి ...... ఏ బండ్లో పోతవు కొడుకో.... నైజాము సర్కరోడా ..... గోలకొండకోట కింద గోరీ కడతాం"** అనే బాణీలో పాటను నడిపించారు. ఆనాటి కాలంలో ప్రతి పిల్లవాడి నోటిలో సైతం ఈ పాటనే వినిపించింది అంటే ఈ పాట ఎంత ప్రజాదారణ పొందినదో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన తీరును అర్థం చేసుకోవచ్చు. వెట్టి చాకిరి సందర్భంగా చిన్నపిల్లలు సైతం దొరల పశువుల దొడ్డికి కాపరిగా ఉన్న సంఘటనను చూసి చలించిన సుద్దాల హనుమంతు –

**"పల్లెటూరి పిల్లగాడా పసుల గాసే మొనగాడా ... పాలు మరచి ఎన్నాళ్ళయిందో..... పాలబుగ్గల జీతగాడా.... కొలువు కుదిరి ఎన్నాళ్ళయిందో ....."** అంటూ చక్కని పాటను రాశారు. ఈ పాటను బట్టి నాటికాలంలో పసి పిల్లలు సైతం దొరలకు బానిసలుగా ఊడిగం చేసేవారని అర్థమవుతుంది. ఆసిఫాబాద్‌లో కరీంనగర్ నుండి వచ్చిన వెలమ కులస్థులు ఆదివాసుల భూములు ఆక్రమించుకున్నారు. శివాయి జమాబంది పద్దతిలో భూములను సాగుచేస్తూ ప్రభుత్వానికి శిస్తు కట్టినప్పటికి పట్టా లేదన్న నెపంతో ఆదివాసుల భూములు గిరిజనేతరుల వలస పాలైనాయని హైమన్ డార్ఫ్ పేర్కొన్నాడు.

శ్రీకాకుళం విప్లవోద్యమం రాష్ట్రంలోని కవులను, రచయితలను, మేధావులను ఎంతో ప్రభావితం చేసింది. నక్సల్ బరీ, శ్రీకాకుళం ఉద్యమాలను చైనా అధికారిక పత్రిక **"వసంతకాల మేఘగర్జన"** (స్ప్రింగ్ థండర్)గా ప్రకటించడం ఆ రోజుల్లో సంచలనం సృష్టించింది. 1970 జూలై 4న విప్లవ రచయితల సంఘం ఏర్పడినది. శ్రీశ్రీ, చెరబండరాజు, వరవరరావు ప్రముఖ విప్లవ రచయితలు తమ రచనలతో ప్రజలను చైతన్యవంతం చేశారు. చెరబండరాజు **"నన్నెక్కనివ్వండి బోను"** తో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. **"సృజన"** సాహిత్య పత్రికను నిర్వహిస్తున్న ప్రముఖ విప్లవ కవి పెండ్యాల వరవరరావు ఉద్యమ ఉధృతి కోసం అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. 1972 ఆగస్టులో కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో **"పిలుపు"** పత్రిక ప్రారంభించారు. 1972లో ఆగస్టు నుండి 1975 జూన్ మధ్య కాలంలో నవోదయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జి. సత్యనారాయణ రెడ్డి (కన్వీనర్), అక్కినేని కుటుంబరావు, సత్యరాం, కుసుమకుమారి తదితరులు **"భూమికోసం"** నాటిక నిర్వహించారు. ఈ నాటిక భూస్వామ్య దోపిడీ రూపాలను బట్టబయలు చేస్తూ సంఘాలను పెట్టుకొని పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చింది. భూమిని సాగు చేసేవాడు అనే అర్థంలో **"రయ్యత్"** అనే ఉర్దూ పత్రికను 1927లో మందుముల నర్సింగరావు ప్రారంభించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రచురిస్తున్నదని ఈ పత్రికను నిజాం ప్రభుత్వం నిషేధించడం జరిగింది.

1977 ఫిబ్రవరిలో సి.ఒ.సి ప్రాంతీయ సదస్సు నాగపూర్‌లో జరిగింది. ఈ సదస్సులోనే కరీంనగర్, ఆదిలాబాద్‌లో రైతాంగ పోరాటాలకు భూమిక సిద్దమైంది. 1977 జూలై – ఆగస్టు నుండి

ప్రజా సంఘాల బహిరంగ కార్యక్రమాలు మొదలైనాయి. రైతు కూలీల చైతన్యాన్ని చూసి భయపడ్డ భూస్వాములు దీన్ని ఆదిలోనే అంతమొందించాలని నవంబర్‌లో రైతు కూలీ సంఘ నాయకులైన సిరిసిల్ల తాలూకా తిమ్మాపూర్ గ్రామంలో లక్ష్మీరాజ్యాన్ని, జగిత్యాల తాలూకా కన్నాపూర్ గ్రామంలో పోశెట్టిని దారుణంగా హత్య చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దేవులపల్లి వెంకటేశ్వరరావు **"తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర"**ను వివరించగా తర్వాత అక్షర రూపమిచ్చారు. తెలంగాణ విముక్తి పోరాట కథలు ప్రముఖ కథా విమర్శకుడు వాసిరెడ్డి నవీన్ సంపాదకత్వంలో వెలువడింది. దీనిలో వట్టికోట ఆళ్వారుస్వామి **"చిన్నప్పుడే"**, పొట్లపల్లి రామారావు **"న్యాయం కథలు"**, వేనేపల్లి ఆంజనేయులు **"పాడియావు"**, ఆవుల పిచ్చయ్య **"ఊరేగింపులు"**, వెంకటేశ్వర రావు **"అది పంట కాదా"**, దుర్గా ప్రసాదరావు **"పన్నులు ఇవ్వం"** కోదండ రామశాస్త్రి **"నవ జాగృతి"**, పి.వి. నరసింహారావు **"గొల్ల రామవ్వ"**, అట్లూరి పిచ్చేశ్వరారావు **"విముక్తి"**, బి. యన్. రెడ్డి **"ఆయువుపట్టు"** మొదలైన కథలు సంకలనంలో చోటుచేసుకున్నాయి.

ఆంధ్ర పాలకులు అనుసరించిన విధానాల వల్ల చెరువులు, బావులు ఎండిపోయి బీడు భూములుగా మారిన ఘట్టాన్ని గోరేటి వెంకన్న కలం గళం నుండి **"పల్లె కన్నీరు పెడుతుందో..... కనిపించని కుట్రల ... పల్లే బందీ అయి పోయిందో ..."** అనే పాట జాలువారింది. చెరువులపై వివక్ష, ప్రపంచ బ్యాంకు సంస్కరణలు తెలంగాణకు శాపంగా మారి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీసినవి. పల్లె దుస్థితిపై **'మిత్ర'** రాసిన పాట ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించివేసిది.

**పల్లె పల్లెన పల్లేరు మొలిసే**
**పాలమూరులోన ..... మన తెలంగాణలోన**
**పాత గోడలు పందిరి గుంజలు**
**సిన్నా బోయినాయి . ... ఇండ్లు దుమ్మురేగినాయి**

1990 జనవరి 12న హైదరాబాద్ లోని రాణాప్రతాప్ హాలులో విప్లవ రచయితల సంఘం ద్విదశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సదస్సులో విప్లవ రచయితల సంఘ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన కె.జి.సత్యమూర్తి పాల్గొన్నారు. వీరు **"శివసాగర్"** కలం పేరుతో గొప్ప విప్లవ రచనలు చేసి నూతన ఒరవడిని సృష్టించారు. వీరి ప్రముఖ గేయాలు **'ఉద్యమం నెలబాలుడు', 'నర్రెంక చెట్టు కింద నరుడో భాస్కరుడా!', 'చెల్లీ చంద్రమ్మ', 'తూర్పు పవనం వీచెను'.**

స్వాతంత్ర్యానంతరం ఆహారం, పప్పుధాన్యాలు, నూనెగింజలు, పత్తి తదితర 24 పంటలకు కేంద్రం ఏటా మద్దతు ధరలు ప్రకటిస్తుంది. అదే ధరలకు ప్రభుత్వాలు కొంత పంటను కొనుగోలు చేసేవి. ఇలా పంటలను కొని తిరిగి విక్రయించినందుకు నాఫెడ్ నష్టాలు చవిచూసింది. నాఫెడ్ ను లాభాల బాటలో నడపడానికి **"ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్"** (పీఎం ఆశ) పథకం కింద పంటలను కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానం ప్రారంభించింది. ఒక రాష్ట్రంలో పండిన పంట దిగుబడిలో 25 శాతం కొనాలనేది ఈ పథకంలోని నిబంధన. పీఎం ఆశ పథకం అమలులోనికి వచ్చాక నాఫెడ్ లాభాల బాటలో నడుస్తుంది. ప్రతి రాష్ట్రంలో **'రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య'** (మార్క్‌ఫెడ్), పౌర సరఫరాల సంస్థలు ఉన్నాయి. పంట కొనుగోలు చేసిన 72 గంటల్లో రైతు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేయాలనేది కేంద్ర నిబంధన. కానీ నెల రోజులైనా డబ్బులు జమ కాక పోవడంతో రైతులు అప్పటికప్పుడు డబ్బులు ఇచ్చే వ్యాపారులకు తక్కువ ధరలకే అమ్ముకొని నష్టపోతున్నారు. ఆ వ్యాపారులు అదే పంటను తిరిగి ప్రభుత్వ సంస్థలకు అమ్ముకొని మద్దతు ధరలు పొంది లాభాలు పొందుతున్నారు. మార్క్‌ఫెడ్ లక్ష్యాల అమలులో సఫలమౌతున్నా, ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన నష్టాలు చవిచూస్తున్నాయి. వాటిని సాకుగా చూపి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త సాగు చట్టాలను చేసింది. వాటి రద్దుకై ఢిల్లీలో తీవ్రమైన చలిని కూడా లెక్కచేయకుండా రైతులు శాంతి యుతంగా ఉద్యమిస్తున్నారు. చలికి వర్షంతోడై అన్నదాతలను భయపెడుతున్నా **"ఈ శీతాకాలంలో పొలంలో పని చేసినప్పుడు వాతావరణం ఇంతకన్న దారుణంగా ఉంటుంది. ఈ చలి వర్షం ఏ పాటిది"** అని ఉద్యమ రైతు హర్జీత్ సింగ్ జోహాల్ అన్నారు. రైతులు అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు పడకుండా ఉండటానికి "ఢిల్లీ సిక్కు గురుద్వారా కమిటీ" మరిన్ని ఏర్పాట్లు చేసింది. అన్నదాతలు చేస్తున్న ఉద్యమం బ్రిటీష్ పాలనలో రైతులు చేసిన చంపారన్ సత్యాగ్రహం లాంటిదేనని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

జనవరి 6 నుండి 20 వరకు 15 రోజులు **"దేశ్ జాగృతి అభియాన్"** కార్యక్రమం నిర్వహించారు. 18 న మహిళా దినోత్సవం, 23 న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆజాద్ హింద్ కిసాన్ దివస్ నిర్వహించారు. 26 న రాజ్ పథ్ లో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ఉద్యమానికి అమెరికాలోని విస్కాన్ సీన్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాబిన్ జె. వోస్ మద్దతు తెలిపారు. ప్రస్తుతం సినీరంగం రైతు సమస్యలపై అనేక చిత్రాలు చిత్రీకరిస్తున్నాయి. మాభూమి, శ్రీకారం, మహర్షి, భూమి, మొదలయిన సినిమాలు రైతు సమస్యలను వాటికి పరిష్కార మార్గాలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాయి.

ప్రపంచంలో భారత్ ఆహార ఉత్పత్తిలో మొదటి దేశం. రైతుల స్థితిలో బీద దేశం. ఈ స్థితికి గల కారణాలు విశ్లేషించుకోవాలి. రైతులకు ఆధునిక యంత్రాలతో సాగుచేసే విధానం పంటల మార్పిడిపై అవగాహన కలిగించి దిగుబడి పెరుగుదలకు కృషిచేస్తూ ప్రతి మండలానికి గిడ్డంగులు ఏర్పాటు చేసి పంట కోతకంటే ముందే మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కవులు కళాకారులు తమ కలం గళం ద్వారా వాణిని తమదైన బాణీలో వినిపిస్తున్నారు.

# అడ్లూరి అయోధ్యరామయ్య కథల్లో జాతీయోద్యమం

**ఘనపురం సుదర్శన్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9000 470 542


సామ్రాజ్యవాద వలస దారుల పాలనలో భారతదేశం బానిస బ్రతుకును భరించలేక స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ పోరాటాన్ని కొనసాగించింది. ఈ పోరాటం విభిన్న ఉద్యమాల కలయిక, విభిన్న వ్యూహాల సమాహారం. సమస్త భారతదేశమంతా స్వేచ్ఛ కోసం, బానిస బంధనాల విముక్తి కోసం స్తబ్దత లేని సమరాన్ని సాగించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఏదో ఒక మూలన, ఏదో ఒక ఆకాంక్షతో ఎప్పుడూ ఉద్యమంతో కుతకుత లాడేది. ఆ అలుపెరగని ఉద్యమం జాతీయోద్యమంగా రూపం మార్చుకొని దేశ ప్రజలందరినీ ఏక తాటిపై నడిపించింది. అటువంటి భీకరమైన జాతీయోద్యమం అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోకి కూడా ప్రవేశించింది.

మత పక్షపాత ధోరణిని కొనసాగించే నిజాం ప్రభుత్వానికి, సామ్రాజ్యవాద మిషతో అధికారం చేజిక్కించుకునే బ్రిటిషు ప్రభుత్వానికి అననుకూలంగా హైదరాబాదులో జాతీయోద్యమం సాగింది. దేశంలోని అన్ని రాష్ట్రాలలో, సంస్థానాలలో జరిగిన ఉద్యమం ఒక ఎత్తు అయితే హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన ఉద్యమం మరో ఎత్తు. అందుకే ఇక్కడ జరిగిన జాతీయోద్యమ రూపం అయిన సాయుధ పోరాటాన్ని భారత స్వాతంత్ర్యోద్యమ తుది ఘట్టమని పిలుస్తారు.

మానవ జీవన సంఘర్షణలో మనిషికి కావాల్సిన ముఖ్యమైన తప్పనిసరియైన హక్కు స్వేచ్ఛా జీవనం. ఈ హక్కు కోసమే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు ఉద్యమాన్ని జరిపి స్వతంత్ర దేశాలుగా పేరు పొందాయి. భారత దేశంలో అంతర్భాగమైన హైదరాబాద్ రాష్ట్రం అత్యంత దుర్భరమైన జీవనాన్ని ఇక్కడి ప్రజలకు అందించింది. ఆ దుర్భరమైన జీవితాన్ని భరించలేక దాస్య బ్రతుకును అనుభవిస్తున్న స్వేచ్ఛా కాంక్ష గల హైదరాబాద్ ప్రజలు ఏకమయ్యారు. స్వాతంత్ర్యం కోసం పోరాడారు. ఎందరో యోధానుయోధులు వలస వాద, నిరంకుశ ప్రభుత్వాలకు అమరులయ్యారు. మరెందరో వీరులు జైలు పాలయ్యారు. ఇంకెందరో ఉద్యమకారులు కుటుంబాలను సైతం త్యజించారు. అలాంటి తీవ్రమైన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న జాతీయ వాది, స్వాతంత్ర్య సమర యోధుడు అడ్లూరి అయోధ్య రామయ్య.

కవిత్వం మీద, గేయాల మీద ఉన్న ఆసక్తితో సాహిత్యం రాసి సాహిత్యం ద్వారా జాతీయోద్యమాన్ని ప్రజలలోకి తీసుకెళ్లినందున తనను తాను రామకవిగా మార్చుకున్నాడు. చిన్నప్పుడే ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అక్కడి నుంచే తన స్వాతంత్ర్యోద్యమ ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో తాను చవిచూసినా, తనకు ఎదురైన అనేక అనుభవాలను తన కథల్లో నిక్షిప్తం చేశాడు. ప్రత్యక్షంగా ఉద్యమంలో భాగస్వామియై తాను రాసిన సాహిత్యం ద్వారా సామాన్య ప్రజలను సైతం ఆకర్షితులను చేశాడు. అలా ఆయన రాసిన సాహిత్యంలో 'తెలంగాణ మంటల్లో' అనే పేరుతో వచ్చిన కథలు అత్యంత ప్రధానమైనవి. ఈ కథా సంపుటిలో ఆరు జాతీయోద్యమ కథలు చోటుచేసుకున్నాయి.

ఇందులో మొదటి కథ బాంబుల భయం. వరంగల్లు ప్రాంతంలో ఒక తాలుకాలో స్థానికంగా తమకు తాము స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకునేందుకు సిద్ధ పడతారు. ఈ విషయం తెలుసుకున్న నిజాం ప్రభుత్వం తన క్రూర రజాకార్లను క్యాంపు పేరుతో సిరిపురం అనే గ్రామానికి పంపిస్తుంది. అక్కడ జరుగుతున్న స్వాతంత్ర్య ఉద్యమాన్ని, కాంక్షను అంతం చేయాలని రజాకార్ల సమూహం ఊరిని చేరేందుకు సమీపిస్తుంది. అప్పటికే విషయం తెలుసుకున్న గ్రామ నాయకులు, కార్యకర్తలు అంతా ఏకమై వాళ్లపై దాడి చేయుటకు చర్చించుకుంటారు. గ్రామంలోకి రజాకార్ల గుంపు వస్తే సందేశం తెలపడానికి ఒక మహిళ ఉద్యమకారిణిని పొలిమేరలో నియమిస్తారు. అట్లా రజాకార్ల రాక కనపడగానే ఆ మహిళ భీకరంగా పోరాడి వాళ్లను ఊళ్ళోకి రానీయకుండా అడ్డుకట్టవేస్తుంది. దీంతో రజాకార్లు ఇంకెప్పుడు ఈ ఊరికి వెళ్ళొద్దనుకుంటు పారిపోతారు.





రెండోదైన కాలాన్ని తేవాలి కథ భారతదేశ స్వాతంత్ర్య ప్రదానోత్సవానికి ముందు జరిగిన వృత్తాంతాన్ని గురించి తెల్పుతుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకునే హిందూ, ముస్లిం విద్యార్థులు మత మౌఢ్యం పేరుతో గొడవకు దిగుతారు. భారత స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు రోజుల ముందు ఢిల్లీలో వీధి వీధి అంతా త్రివర్ణ పతాకాలతో వెలుగుపోతుందని భావించే హిందూ విద్యార్థులకు తోటి విద్యార్థులతో చేదు అనుభవం ఎదురవుతోంది. భారతదేశం, హైదరాబాద్ రాష్ట్రం స్వాతంత్ర్యాన్ని పొందడం ఇష్టం లేని ముస్లిం విద్యార్థులు కావాలని గొడవ చేస్తారు. ఆగస్టు 13, 1947 రోజున దేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నదని సంతోషించిన యువకులు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల భవనంపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి నైజాం ప్రభుత్వ అధికారంలో అమరులయ్యే దృశ్యాన్ని ఈ కథ ఆవిష్కరిస్తుంది

తల్లి ప్రేమ అనే కథ, స్వాతంత్ర్య జాతీయ పతాకం తల్లీ కొడుకులను ఎట్లా కలిపిందో చెప్పిన చిన్న కథ. దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమంలోకి వెళ్తానంటే తల్లి ఒప్పుకోదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే ఆనందంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తాడు. అంతటితో ఆగకుండా భారతదేశానికే స్వాతంత్ర్యం వస్తే సరిపోదు. హైదరాబాద్ రాష్ట్రం కూడా స్వతంత్ర రాష్ట్రం కావాలని నిజాం నవాబు ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఉత్సాహంగా మూడు రంగుల జెండాను తన ఇంటిపై ఎగురవేస్తాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వం అరెస్టు చేసి నిర్బంధిస్తుంది. దేశం కోసం పోరాడిన కొడుకు జైలులో ఉంటే కొడుకుపై ప్రేమతో ఒంటరిగా ఉండలేని తల్లి స్టేటు కాంగ్రెసు ఆదేశంతో జెండా వందనం చేసి జైలు పాలయిన దృశ్యం ఈ కథలో చోటుచేసుకుంది.

చీకటి రాజ్యం అనే కథ హైదరాబాద్ రాష్ట్రంలో బాధ్యతాయుత ప్రభుత్వం కోసం పోరాటం చేసిన ఒక గ్రామ స్వయం సేవకుల గురించి వారి పరాక్రమాన్ని గురించి తెలిపింది. హైదరాబాద్ రాజ్యానికి స్వాతంత్ర్యం కావాలని అందుకు పోరాటం చేసిన స్వయం సేవకులు నిజాం సైనికులపై దాడి చేసి ఎదురిస్తారు. అందుకు ప్రతిదాడిగా రజాకార్లు వచ్చి ఆ గ్రామాన్ని నాశనం చేస్తుంటే ప్రాణ భయానికి తట్టుకోలేక స్వయం సేవకులు అంతా భారత స్వాతంత్ర్య ప్రాంతమైన యూనియనుకు వెళ్తారు.

జనానా రజాకార్ కథ ఒక జాతీయవాది తన పాట ద్వారా ప్రజలను చైతన్యం చేసిన ఉదంతాన్ని వివరిస్తుంది. నర్సింహారావు జాతీయోద్యమ గీతాల గాయకుడు. కవులు రాసిన గీతాలను పాడుతూ ప్రజలలో దేశం పట్ల సదభిప్రాయం కలిగిస్తాడు. అట్లా ఒకనాడు ఇతని పాటను విన్న సలీమా అనే మరో గాయనీ మైమరిచిపోతుంది. ఆ క్షణమే అతని మీద మనసు పారేసుకుంటుంది. తీరా కాలం మారాక సలీమా రజాకార్లలో కలుస్తుంది. ప్రజలను ఉత్తేజం చేస్తున్నాడని ప్రభుత్వం నర్సింహారావును అరెస్టు చేసి ఒక గదిలో బంధిస్తుంది. ఇలా బంధించిన వారికి కాపలా ఉండే స్త్రీయే ఈ సలీమా. ఈ ఇద్దరికి ముందే పరిచయం ఉన్నందున ఇక్కడి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించి పారిపోతారు. అప్పుడు నర్సింహారావు జాతీయోద్యమాన్ని తన పాటతో ప్రచారం చేస్తే, సలీమా పవిత్రమైన రాట్నాన్ని చేతబట్టి నూలు వడికి జాతీయోద్యమానికి తన సహకారాన్ని అందిస్తుంది.

తరువాతిదైన అమరలోక యాత్రికులు కథ, కాంగ్రెసు వాళ్ళు కమ్యూనిస్టులు కలిసి చేసిన జాతీయోద్యమాన్ని తెల్పుతుంది. అత్రాపుబల్దా (రంగారెడ్డి జిల్లా) జిల్లా సరిహద్దు గ్రామంలో ఉన్న కాంగ్రెస్ వారు క్యాంపు ఏర్పాటు చేసి పోరాడుతుంటారు. ఒక్కోరోజు ఒక్కో గ్రామం తిరుగుతూ ఉద్యమం చేస్తుండగా వారి కంట కమ్యూనిస్టులు పడతారు. అప్పటికే కమ్యూనిస్టులు ఉద్యమం చేస్తుండడంతో ఇద్దరు కలిసి రజాకార్లపై విరుచుకుపడతారు. హింసాహింసాల సిద్ధాంతాలను నమ్ముకొని పోరాటం చేస్తున్న విభిన్న వర్గాల ఉద్యమ ధ్యేయాన్ని ఈ కథ వివరిస్తుంది.

హైదరాబాదులో జరిగిన జాతీయోద్యమం విభిన్న పార్శ్వాలతో కూడినది. ఈ జాతీయోద్యమాన్ని బ్రిటీషా%శీ%ధ ప్రాంతంలో జరిగిన ఉద్యమంతో పోలిస్తే ఇక్కడ కూడా అంతే ధీటుగా జరిగింది. అయితే అక్కడ జరిగిన జాతీయోద్యమంలో అహింసాయుత మూలాలు ఎక్కువగా ఉంటే అదే హైదరాబాదులో జరిగిన జాతీయోద్యమంలో కాంగ్రెసు ఆశయాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు సమానంగా ఉన్నాయి. కాకపోతే సాయుధ పోరాటాన్ని కాంగ్రెసు, కమ్యూనిస్టులు ఉమ్మడిగా ప్రారంభించినా చివరికి వరకు కొనసాగింది మాత్రం కమ్యూనిస్టులే. అందుకే సాయుధ పోరాటం అనగానే కమ్యూనిస్టులే గుర్తుకు వస్తారు. ఈ విషయాన్ని నాటి ఉద్యమకారులైన రచయితలు వాళ్ళ కథలలో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఉద్యమ మూలాలు, ఆచరణ సిద్ధాంతాలు వేర్వేరైనా సాధించుకున్న లక్ష్యం మాత్రం స్వాతంత్ర్యమే. అదే హైదరాబాద్ స్వాతంత్ర్యం.

నివాళి

# నిశ్శబ్ద అక్షర యోధుడు – వెలపాటి రామరెడ్డి

డా. రాపోలు సత్యనారాయణ, ఫోన్ : 9440 163 211



వెలపాటి రామ రెడ్డి మెదడులో ఆకస్మిక రక్తస్రావం జరిగి 2021 మే 26 బుధవారం సాయంత్రం 4 గంటలకు హనుమకొండ లోని ఆయన స్వగృహంలో కన్ను మూసిందు. అక్షరమే ఆయుధంగా చేపట్టి పోరాడిన తెలంగాణ యోధుడు రామరెడ్డి. తెలంగాణ తొలి మలి పోరులలో క్రియాశీలంగా పాల్గొన్న రామరెడ్డి స్వగ్రామం జనగామ జిల్లా కొడకండ్ల మండలం "రేగుల". చిలుకమ్మ, కేశవ రెడ్డి దంపతులకు 1932 నవంబర్ 4 న జన్మించిందు. 1948 రజాకార్ల దుశ్చర్యలకు ప్రత్యక్ష సాక్షి. సాయుధ పోరు అవాంతరాలు ఎదుర్కొని చదువుకొన్నడు. 1954లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా ఉద్యోగంలో చేరిందు. ఉద్యోగంలో ఉన్నా 1969 తెలంగాణ ఉద్యమానికి గళం కలిపిందు. ఉద్యోగం దొరికిందని చదువులకు సెలవు పలుకలేదు. తన చదువు ఉర్దూ మీడియంలో ప్రారంభమైనా, ఇంగ్లిష్ భాష ప్రాధాన్యతను గుర్తించిందు. సాధన చేసి ఇంగ్లిష్ బోధకునిగా మారిందు. ఆయన ఇంగ్లీష్ ఉచ్చారణ వినసొంపుగా ఉండేది. బిఏ ఇంగ్లీష్, ఎంఏ ఇంగ్లీష్, బిఎడ్ తో పాటు, బెంగళూరు రీజినల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ లో సర్టిఫికేట్, హైదరాబాద్ సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ లో పిజి డిప్లొమా దాకా ఆపలేదు. అంచెలంచెలుగా పదోన్నతులు పొంది వడ్డేపల్లి పింగిళి మహిళా కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ గా 1990లో పదవీవిరమణ పొందిందు. తరువాత సాహిత్యం తనకు ఏకైక వ్యాపకం అయింది. వరంగల్ ఆకాశవాణి, స్థానిక సాహిత్య సంస్థల కార్యక్రమాలు సత్కాలక్షేపం. సరోజిని నాయుడు, జాన్ కీట్స్, కమలా దాస్, ఎమిలీ డికెన్సన్, రాబర్ట్ ఫ్రాస్ట్, జాన్ డాన్ లను తెలుగులో పరిచయం చేసిందు. వచనం వ్రాసినా, పద్యానికి ఆయుష్షు ఎక్కువని గ్రహించి దాన్ని అభ్యాసం చేసిందు. తెలంగాణ క్షేత్రంలో క్రమంగా స్వరాష్ట్ర ఆకాంక్ష బలపడుతున్న దశ. సరిగ్గ ఈ సందర్భాన్ని కవిత్వంలోకి ఒంపుకొన్న కవి వెలపాటి రామరెడ్డి. ఉద్యమ వేయి గొంతులలో బలమైన గొంతు రామరెడ్డి.

తెలంగాణ, వీర తెలంగాణ, తెలంగాణ పద్య మంజరి, తెలంగాణ నడుస్తున్న చరిత్ర, తెలంగాణ సాయుధ పోరాటం, నవ శకం : తెలంగాణ శకం, తెలంగాణ శకారంభం, స్వేచ్ఛా విహంగాలు రామరెడ్డి లేఖిని నుంచి వెలువడిన తెలంగాణ భావ తరంగాలు. తెలంగాణ సాయుధ పోరాటం 1948 ని తెలుగు అకాడెమి ప్రచురించింది. పోటీ పరీక్షలకు మార్గదర్శి ఈ గ్రంథం. రాష్ట్ర ఆవిర్భావంతో తెలంగాణ శకం ప్రారంభమైందని చారిత్రక ప్రకటన చేసినవాడు రామరెడ్డి. సిద్ధించిన రాష్ట్రగూటిని స్వేచ్ఛా విహంగాల వలెపునర్నిర్మించి తీర్చుకొందమనిన స్వాప్నికుడు.

రామరెడ్డి కవిత్వంలోతెలంగాణ పద సౌరభం ఆకట్టుకొంటది. సరళత్వం ఆయన సహజ శైలి. రైతు, సామాన్యుడు, వివక్ష, ఆత్మ గౌరవం, మహనీయులు తను కవిత్వంలో స్పృశించే అంశాలు. వెనుకటి తరం వారు నాటిన విత్తనాలే నేటి మధుర ఫలాలు. కాబట్టి వెనుకటి తరాన్ని స్మరించు కొనటానికి "చారిత్రక పురుషులు" వ్రాసిందు. సొంత ఊరును మరువక "రేగుల గ్రామ చరిత్ర" వ్రాసిందు. రామ రెడ్డి రచనలు "తెలంగాణ" ఏడవ తరగతి, "మన శిల్పారామం రామప్ప" ఇంటర్మీడియెట్ తెలుగు వాచకాలలో పాఠ్యాంశాలుగా రూపొందినయి. రామ రెడ్డి కావ్యం "తెలంగాణ" పై పులి సుబ్బారావు అనే పరిశోధకుడు కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం ఫిల్ చేసిందు. మరిన్ని పరిశోధనలు జరుగవలసి ఉన్నది. కీర్తికాంక్ష లేని రామ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం 2017 రాష్ట్రావతరణ వేడుకలలో విశిష్ట సాహితీవేత్త పురస్కారం ప్రదానం చేసి చిరకీర్తిని కలిగించింది. రామ రెడ్డి వ్యక్తిత్వం, కవిత్వం రెండూ భావి తరాలకు ఆదర్శం!

**(డా. రామరెడ్డి గారి ఎన్నో పద్యకవితలు, వ్యాసాలు మూసీ పత్రిక ప్రచురించింది. వారికి మూసీ హృదయపూర్వక నివాళులు అర్పిస్తుంది.)**

# మూసీ పదవినోదం - 30

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మ | 3 | 4 ఉ | | ము | X | X | 11 |
| 2 | యి | | యి | | 13 జా | 12 | ల్లి |
| ను | X | 5 ను | | గు | | బ్బ | |
| 6 భా | 7 | X | X | 9 | ర | | X |
| 10 | ప | | 15 శ | X | 17 | చె | |
| లు | | X | వ | 16 | డు | | X |
| X | 14 కు | | ల | | X | 18 నే | |
| 8 అ | | సు | | క్క | | ల | X |

**ఆధారాలు (అడ్డం)**

1. మఖ కార్తెలోని ఉరుముకు పుంలింగంగా మార్చిన తెలంగాణ జానపద పలుకుబడి (5)
2. వెలుగు నీడలు చిత్రంలోని ప్రసిద్ధ గీతపు మొదటి పదాలు (8)
5. చొంగలు లేదా నోటివెంట వచ్చే నురుగులను కోస్తా ప్రాంతంలో ఇలా అంటారు (5)
6. తప్పు చేసి దిద్దుకొనుట కంటె తప్పు చేయకుండుటయే మేలు అను అర్థంలోని సామెతలో మొదటి భాగం (7)
10. పది సంఖ్యకు దగ్గర అనే అర్థంలోని పదం. మొదటి ఉకారాన్ని అలవాటుగా తెలుగువాడి ఉచ్చారణలో వకారం మింగివేసింది (4)
14. 1. కలువ 2. ముత్యము 3. రేగుబండు ఈ మూడింటిని ఈ ఒకే పదంతో చెప్పవచ్చు (4)
17. "విప్పాలా" పద్ధతిలో మాట్లాడాలా అనటానికి ఈ మూడు అక్షరాలు తికమకతో (3)
18. ఇది ఎవరో తెలుసుకొమ్మన్నారు రమణ మహర్షి (2)

**ఆధారాలు (నిలువు)**


1. గొప్ప ఆశయము కల వీరు త్యాగరాజు కీర్తనలో ప్రసిద్ధులు (6)
3. తెలంగాణా ప్రాంతంలో వెదురుబొంగు అంటె గోదావరి ప్రాంతంలో ఈ రెండు అక్షరాల పదాన్ని లక్ష్యము అంటారు. (2)
4. కరోనా పుట్టినిల్లు చైనాలోని ఈ నగరమని ఒక వార్త (3)
7. బౌద్ధ మతస్థుడు (5)
6. గూఢచారి గ్రహం బోల్తా పడింది (4)
11. గొందులని రాయలసీమ మాండలికం. వీధులని కళింగ మాండలికం. అదే అర్థం గల పదం తెలంగాణ మాండలికంలో (3)
12. పులి అరపులతో దద్దరిల్లే నేల (7)
13. గంధపు పొడిని ఒకరిమీద నొకరు చల్లుకొని వసంతములాడుట (5)
15. వివిధ వర్ణాలతో... అనటానికి చివర దీర్ఘంల తీయలేదు (4)
16. – ఇప్పుడా చెప్పటం ( ఇంతకుముందే చెప్పాలి (3)

**(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)**

నిర్వహణ
**డా. తాడేపల్లి పతంజలి**
ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.
ఫోన్ : 98666 91587

## సత్సంగం

### భయాన్ని వదిలించుకోవడం ఎట్లా?



భయమంటే ఏమిటి? అదీ ఒక భావమే. ఆత్మకి భిన్నంగా ఏదైనా ఉంటే, భయముంటుంది. ఆత్మకి భిన్నంగా దేన్నినైనా చూచేదెవరు? మొదట అహంకారముదయించి, తనకి బయట ఉన్నట్లు వస్తుజాలాన్ని చూస్తుంది. అహంకారముదయించకపోతే, ఉండేదల్లా ఆత్మే – అప్పుడు, బాహ్యంగా ఏమీ ఉండదు. తనకి బయట ఏవో ఉన్నాయంటే, లోపల ద్రష్ట ఎవరో ఉన్నట్లే అర్థం. ఆ లోపలి వానిని అన్వేషిస్తే సందేహమూ, భయమూ పోతాయి. భయమే కాదు, అహంకారాన్ని చుట్టుకొని ఉన్న అన్ని భావవాలూ దానితోపాటే పోతాయి.

మృత్యుభయం – ఆ భయం నీకెప్పుడు కలుగుతుంది? నీవు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీకు శరీరధ్యాస ఉండదు. అప్పుడా భయముంటుందా? నీవు పూర్తిగా మేల్కొని, నీ శరీరాన్ని, ప్రపంచాన్ని చూస్తున్నప్పుడే ఆ భయముంటుంది. కలలు లేని నిద్రలో వలె నీవు వీటిని చూడకుండా, కేవలం ఆత్మగానే ఉన్నప్పుడు ఏ భయమూ నిన్ను సోకలేదు.

ఏదో పోతుందన్న భావమే భయాన్ని కలిగిస్తుంది. ఆ పోయేదేమిటి? అని విచారిస్తే అది నీ శరీరం కాదనీ, అందులో పనిచేసే మనస్సనీ తేలుతుంది. తనకి ఎల్లప్పుడు ఎరుక ఉండేట్లయితే, ఈ రోగపీడితమైన శరీరాన్ని, దానివల్ల కలిగే ఇబ్బందినీ వదిలించుకోవడానికి అందరూ సిద్ధమే. పోతుందని అతను భయపడేది ఈ ఎరుకని, ఈ చైతన్యాన్ని. జీవించి ఉండటమంటే, సదా ఎరుక కలిగి ఉండటమే. అదే వారి ఆత్మ. ఇదంటేనే అందరికీ ప్రీతి. అటువంటప్పుడు ఈ దేహంలో ఉంటూనే ఆ శుద్ధచైతన్యాన్నే పట్టుకొని ఎందుకుండకూడదు? అన్ని భయాలనీ ఎందుకు వదిలించకూడదు?

# పాదముద్రలు (తెలంగాణ కథకుల పరిచయం)

డా॥ బి.వి.ఎన్.స్వామి, ఫోన్ : 924 781 7732



**"అమ్మ చనిపోయింది అమ్మ చావుతో ఇంటికి ఓ కూలి రావడం ఆగిపోయింది. రెండుపూటల తిండిపోయి ఒక్కపూటకు తగ్గింది. కారంపొడి, పచ్చిపులుసు ప్రధాన ఆహారంగా పూరింది. నేనొక్కడ్నే కాదు నా చుట్టు వున్నవాళ్ళ పరిస్థితి దాదాపు అంతే. ముంజలు, తాటిపండ్లు, సీతాఫలాలు, చింతచిగురు ఆ రోజుల్లో అందుబాటులో ఉండే ఆహారం. పేదరికం బాధలు ఇంతా అంతా కావు. వాటికిచ్చిన రూపమే నా కథలు. వాటికి తోడు కుల అవమానం కుంగదీసేది. నాకు చదువు అన్నం పెట్టింది. ఆలోచన రచయితను చేసింది. నేనురాసిన అన్ని కథల వెనక నేను చూసిన వాస్తవాలున్నాయి."**
– బోయజంగయ్య

జీవితం నుండి రూపొందిన రచయిత బోయ జంగయ్య. తెలంగాణ దళితులది మొదటగా ఆకలి పోరాటం. దాన్ని ఎదిరించి తనకు తాను ఒక జీవికను ఏర్పరచుకొనే క్రమంలో అనివార్యమైన సహజ అడ్డంకులుగా కులం నీడలు నిలిచాయి. అందుకే వీరి కథల్లో కఠిన జీవన వాస్తవికత తండ్లాడుతుంది. తనదైన ఒక ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరచుకునే సమయంలో అంబేద్కర్‌ను చదివాడు. అందువల్లే సమాజం మార్పును కోరుతూ కథలు రాసాడు. కాళోజీ గారన్నట్లు **"ఆలోచనలు కలిగించే కవితలు రాసిన జంగయ్య అద్భుతమైన కథలు రాసాడు. గొర్రెలు, దున్న, ఎచ్చరిక, తెలంగాణ వెతలు అన్నీ సామాన్యుల గురించి రాసినవే. అసలు మనిషికి కష్టాలు ఎందుకు వస్తాయి? వాటికి కారకులు ఎవరు? అని ఆలోచించ మంటాడు. కష్టాలకు కారణాలు వెతకమంటాడు. ప్రశ్నించ మంటాడు. హెచ్చరించమంటాడు? ఎదురించమంటాడు?"** తెలంగాణలో దళిత అస్తిత్వ స్పృహకు ఆలంబనగా నిలిచేవి జంగయ్య కథలు. అట్లని వీరి కథల్లో సిద్ధాంత చర్చ ఉండదు. నిత్యజీవిత సమస్యలను పట్టించుకుంటూ దళిత స్పృహతో వివేచిస్తారు. ఇందుకు 'దొరసాని' కథ సాక్ష్యంగా నిలుస్తుంది. ఉన్నత అధికారిగా ఎదిగిన దళితుడు తన కుటుంబానికీ, కులానికి ఎలా పరాయివాడై పోయాడో ఈ కథ చెబుతుంది. కష్టాలు, కన్నీళ్ళు పేదరికం, కుల అణచివేత పెట్టే మానసిక హింస, నిరాశ, ఆత్మన్యూనత, బాగా తెలిసినవాడు కనుక అనుభవం నుంచి వచ్చిన తెలివిడితో తన కథల్లో వాటికి కావల్సిన పరిష్కారాన్ని చూపించాడు. ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసే వైపు తన గొంతును కథల్లో పలికించాడు. తెలంగాణ గ్రామీణ జీవితం నేపథ్యంగా గలవాడు కనుక, పల్లెల్లోని సంబంధాలు, అంతరాలు అన్ని కథల్లో కనిపిస్తాయి. కింది కులపు పనివాడి చేతిలో తయారై దేవతావిగ్రహం, బ్రాహ్మణ పూజారి చేతిలో పూజలందుకుంటూ, పనివాడికి దూరమైన వైనాన్ని **"బొమ్మలు"** కథలో చూడవచ్చు. **"పాము"** కథ దళిత యువకులకు, భూస్వామ్య మహిళకు మధ్య సంబంధాల్ని చిత్రిస్తూ అన్యాయమై పోయిన యువకుల విషయాల్ని చెబుతుంది. మరమరాలు, మరుగుమందు, చీమలు మొదలగు కథలు వీరి హృదయాన్ని ఆవిష్కరిస్తాయి. సన్నివేశచిత్రణ, సంఘటన ప్రాధాన్యతలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు.

తెలంగాణ కథకుల్లో సామాజిక తత్వవేత్తగా పేరుపొందిన బి.యస్.రాములు బహుముఖాలుగా కథా రచన చేసారు. స్వయంగా విప్లవకార్యాచరణ లో మునిగి తేలిన సమయాన **"అడవిలో వెన్నెల"** లాంటి కథలు రాసాడు. రైతాంగ వాతావరణాన్ని, పోరాటస్ఫూర్తిని చిత్రించిన **"పాలు"** కథలు ఆణిముత్యాలవంటివి. ఆ తరువాత దళిత బహుజన తాత్వికతను ఒంటపట్టించుకొని స్మృతి, దక్షయజ్ఞం, రియల్ ఎస్టేట్ లాంటి కథలను రాసారు. ప్రపంచీకరణను సమర్థిస్తూ రాసిన "కామన్ వెల్త్" కథ వీరి తార్కిక శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. మానవ సంబంధా లను, కౌటుంబిక వరసల ప్రాతిపదికన చిత్రిస్తూ రాసిన కథలు ఎన్నో ఉన్నవి. "తల్లి పాలు", "వరసలు" మొదలగునవే కాక ప్రేమ విషయాల్ని ప్రతిపాదిస్తూ రాసిన కథలు కూడా ఉన్నవి. తను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించి దాని వ్యాప్తి కోసం కథలు రచించి ప్రచారం కూడా చేసారు. ఎప్పటికప్పుడు తన నమ్మకాల్ని పుటం పెట్టుకుంటూ అవసరమైతే నమ్మిన సిద్ధాంతాల్ని సరిచేసుకుంటూ, కొత్త దృక్పథాన్ని సంతరించుకొని ముందుకు సాగాడు. అందుకే వీరి కథల్లో అనేక భావజాలాలు కనిపిస్తాయి. చాలా వరకు ఓడిన జీవిత బాధల పల్లవులను ఏకరువు పెట్టే కథలు వస్తుంటయి. అదే సమయంలో బి.ఎస్.రాములు గెలుచుకున్న జీవితాల చిత్రణ చేస్తుంటాడు. కులవృత్తులు కునారిల్లుతున్నయని వాపోయే సమయంలో



ఆధునిక జీవితం అందుకోవడానికి ప్రయత్నించమంటాడు. దళిత బహుజన జీవితాలలో విద్య వెలుగులు నింపిందనే విషయాన్ని కథల ద్వారా నిరూపిస్తారు. సహజాతాలు, స్మృతి, వైరుధ్యాలు, తల్లిపాలు పిల్లడు, మెరుగు, తెల్లబట్ట, మాయ, చెలిమ మొదలగు అనేక కథల్లో స్త్రీని అనేక కోణాల్లో చిత్రించాడు. పాతచీర, వరుసలు, వేదపలి, తులసి, వరలక్ష్మి, సహజీవనం, అయిదవవాడు లాంటి కథలు రాములుగారి దృష్టి వైవిధ్యానికి తార్కాణాలుగా నిలుస్తాయి. కథలు రాయడమే కాదు, కథల బడి (కథా సాహిత్యాలంకార శాస్త్రము) అనే పుస్తకం వెలువరించారు. చేయితిరిగిన కథా రచయిత కనుక, వస్తువును బట్టి శిల్పాన్ని, సంభాషణల్ని బట్టి భాషను ఎన్నుకున్నాడు. వీరి కథలు సామాజిక వ్యాఖ్యానాలు.

తెలంగాణ కథా సాహిత్యంలో సుమారు వేయికి పైగా కథలు రాసిన కథకుడు కాలువ మల్లయ్య. అతడొక కథోత్పత్తి కేంద్రం. స్వాతంత్ర్యానంతర కాలం నుండి నేటి వరకు తెలంగాణాలో వచ్చిన పరిణామాల్ని వీరి కథల ద్వారా తెలుసుకోవచ్చు. అస్తిత్వవాద దృష్టితో దళిత, స్త్రీ, బహుజన వాద కథల్ని పండించారు. నక్సల్బరీ వసంత మేఘ గర్జన ధ్వనుల స్ఫూర్తితో విప్లవ కథ సృజించారు. మాసపతవాద దృష్టితో మధ్యతరగతి జీవితాల్ని బేరీజు వేశారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల కలిగే మార్పుల్ని కథీకరించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్ని సిరాగా మార్చి కథలు రాసారు. బొగ్గుబాయి ఉద్యోగుల్ని, పర్యారవణంపై ఆర్తిని, తెలుగు భాషోద్యమాల్ని వస్తువుగా మార్చి కథలు రాసారు. మౌఖిక కథన రీతి, తెలంగాణ జీవద్భాష వీరి కథలకు రెండుకళ్ళలాంటివి. ఆంధ్రుల వ్యాపారగుణం, తెలంగాణ ఆత్మీయతలను తెలుపుతూ రాసిన ''కరువు'' కథ ప్రాంతీయ



స్పృహను కలిగిస్తుంది. బహుజన జీవితాల్లోని విషాదాన్ని "దొరసాని చీర" లో చూడవచ్చు. వృత్తిపరమైన వీరి కథల్లో బహుజనవాద ధోరణి కనిపిస్తుంది. స్త్రీవాదానికి ఆమోదం చేకూర్చేవిధంగా తీర్చిదిద్దిన కథ "గలుమ". ఒక దళిత స్త్రీ జీవన చిత్రణ "ఎంగిలిచేత్తో", ఒకదళితుడి సంవేదన "నెత్తటి ప్రశ్న". సమాజం వేసిన సంకెల, ఒకే కులానికి చెందిన స్త్రీ పురుషులకు ఎలాంటి ఫలితాల్ని రుచి చూపిస్తుందో కథల ద్వారా తెలిపారు. ఇందుకు కఠోరమైన సామాజిక నిష్ఠ ఉండాలి. సామాజిక వాస్తవికతను దర్శించగలగాలి. "సంస్కారం" అనే కథలో దళిత స్త్రీని, అగ్రకుల పురుషుడు ఏ విధంగా మోసం చేస్తుండో చిత్రించారు. కమ్మరి, కుమ్మరి, గౌండ్ల, చాకలి, గొల్ల, మాదిగ సమస్త కులాలతో స్వయం సమృద్ధమైన పల్లె, రోడ్డు రావడంతో కుదేలైన తీరును "పేగు కాలుతున్న వాసన" గా పసిగట్టారు. గ్లోబలైజేషన్ గురించి చెప్పే క్రమంలో "గ్లోబలి" రాయడం ఈయనకే చెల్లింది. అందుకే ఈయన రాయకుండా వదిలింది లేదు అనడం. "వాన రావాలె" అనే పర్యావరణ స్పృహ కథ ఒక వైపు, "టాకింగ్ డాల్" అనే పిల్లల నేపథ్య కథ మరోవైపు, మధ్యలో తీరొక్క కథల కదంబం. విప్లవకథకు "ఆంబోతు" మానవ సంబంధాల కథకు "జీవచ్ఛవం"ను ఉదాహరణలుగా చెప్పవచ్చు. కులస్పృహ లేని వర్గస్పృహ, వర్గస్పృహ లేని కుల స్పృహ ఫలితాలనివ్వవు" అనే తాత్వికతతో రాసిన కథ "తెల్లదుప్పటి" సంస్కృతి చిత్రణ కథలు రాస్తూ మందెచ్చుల వాళ్ళ గురించి, గంగాదేవి గురించి, కాటమరాజు, మల్లన్న ఇలా అనేక విషయాల్ని అందించాడు. అనేక కథల్ని పండించిన వీరు పాత్రోచిత భాషను, పూర్తి మాండలికాన్ని పూర్తి ప్రామాణిక భాషను కథల్లో ప్రదర్శించి అది తనశైలిగా నిరూపించుకున్నారు. కథల్లో మధ్య మధ్యన వ్యాఖ్యానం కూడా జోడిస్తారు.

విస్తృతమైన జీవితాల్ని వస్తువుగా స్వీకరించిన కారణంగా అనేక మూలమలుపులు, వర్ణనలు, ముగింపులు కథల్లో సాక్షాత్కరిస్తాయి. అది ఈయన శిల్ప నిర్మాణం. తెలంగాణ గుర్తుంచుకోదగిన కథకులు వీరు. తెలంగాణది ఒడవని ముచ్చట. దాన్ని చిత్రించిన కథది కూడా తెగని ముచ్చట. ఇక్కడి జీవితాలను వాస్తవిక దృష్టితో విశ్లేషించి, అవి అట్లా ఎందుకున్నాయో చిత్రించిన కథకులు అనేకులు. ఎప్పటికప్పుడు వస్తున్న వాదాలతో వాటి పరిధుల్లో జీవితాలకు పరిష్కారం వెతికిన కథకులు ఎందరో ఉన్నారు. ఎలాంటి సిద్ధాంతాల ప్రభావాలకు లోనుకాకుండా, జీవిత పరిస్థితులను చిత్రించినవారు కొందరు. సిద్ధాంతాల వెలుగులో, జీవన సంఘర్షణలను చిత్రిస్తూ, పరిష్కారాలను చూపెట్టినవారు ఉన్నారు. భాషాభిమానంతో మాండలికాలకు చోటిస్తూ, పల్లెనుడికారాలను ప్రయోగిస్తూ రాసినవా రున్నార. అలవోకగా, అత్యధిక కథలను రాసి ప్రత్యేకతను సంతరించుకున్నవారున్నారు . ఒకే ఒక కథ. ఆ మాటకొస్తే చాలా తక్కువ కథలు రాసి సమకాలికులలో స్థానం దక్కించుకున్నవారున్నారు. కథలో ప్రామాణిక భాషకు పెద్దపీట వేసి, అందమైన వాక్యాన్ని అందించి సవారున్నారు. జీవితంలోని సంక్లిష్టతను, అసంబద్ధతను యథాతథంగా కథలోకి తెచ్చి పాషాణం పాకం పండిన వారున్నారు. నాటకీయతను ప్రధానం చేసుకొని అలతి అలతి పదాలతో కథనాన్ని నడిపి, వర్ణనల్ని ముగింపుల్ని ఆశ్రయించి కథను మలచిన వారున్నారు. కేవలం శైలీ, శిల్పాలకు ప్రాధాన్యతనిచ్చి, ప్రయోగవాద ధోరణిలతో రాసిన వారు ఒక వైపు ఉంటే, వస్తువుకే పెద్దపీట వేసి రాస్తున్న కథకులున్నారు. శైలి పేరుతో భాషతో ప్రయోగాలు చేస్తూ బహుళ భాషా పదాలను కథల్లో వాడుతున్నారు. ఇలా వస్తు, శిల్ప సమన్వయం సాధించిన కథకులు కూడా ఉన్నారు. తెలంగాణ కథా వేదికపై అనేక ధోరణులు కనపడుతున్నాయి. వీరంతా ఇష్టంతో కథాసృజన చేస్తున్నవారే. తెలంగాణ కథావేదికపై కాలక్షేప కథలు చిన్నబోయి ఉన్నవి. వాటి స్థానం అంతే, ఎందుకంటే ఇక్కడి కథకులు, తమ జీవితాలను కథలుగా చిత్రించారు. భవిష్యత్తరాలు ఈ కథల ద్వారా తెలంగాణ చరిత్రను రాసేవిధంగా కథను తీర్చిదిద్దారు. కనుకనే తెలంగాణ కథ ఒక చారిత్రక వసరు.

గ్రంథాంతరంగం
03

# నేటి కాలపు కవిత్వము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

(మే సంచిక తరువాయి)

ఉమాకాంతం పండితులు 'వ్యతిక్రమాధికరణం' అధ్యాయంలో భావకవులు సంస్కృతం మీద అధికారం - పట్టు సాధించకుండా ప్రయోగించడం వల్ల **"శబ్ద రూపవ వినాశం అర్థ వినాశాలు"** సంభావించాయని అన్నారు. (పేజి. 132) భావకవుల కృతుల్లో భాషానభిజ్ఞత తరచుగా కనపడుతుందని చెప్పారు. ఛందో వ్యతిక్రమం, యతిభంగం, వళిప్రాసల నిర్బద్ధ మైత్రులు, అధిక విశేషణ గణం - ఈ కారణాల వల్ల నేటికాలపు కవిత్వం దూషితమవుతున్నదన్నారు. (పుట. 130-143).

అక్కిరాజు గారు **'భావ కావ్యాధికరణం'**లో **"భగవంతుడి మీద, గురువుల మీద, తండ్రి మీద, మిత్రుడి మీదా వుండే ప్రేమకు భావమని పేరు. అది వ్యక్తమయ్యే కావ్యం భావాత్మక కావ్యం, భావ కావ్యం, భావ ధ్వని అని వ్యపదేశం పొందుతున్నది"** (పుట. 148) అని భావకవిత్వానికి ఇచ్చిన నిర్వచనం. ఇది విచిత్రంగా లేదూ?

విద్యాశేఖరులు **'శృంగారాధికరణం'**లో ప్రేమ, కామాలకున్న వ్యత్యాసాన్ని వివరించారు. **"కేవల కాముకుల్లోను, ప్రాకృతుల్లోనూ రూప ప్రేమే ప్రధానమవుతున్నది... యీ ప్రాకృతికమైన కామ ప్రేమ పశుప్రేమ. వీటినన్నిటిని దాటి ప్రేమ గుణాల మీద ఆధారపడ్డప్పుడే పవిత్రమై, లోకాభ్యుదయానికి హేతువగుతున్నది. రూపం మీద ఆధారపడ్డ ప్రేమ విషయలోలత్వానికి మాత్రం హేతువగుతున్నది".** (పుట. 186).

ఉమాకాంతులవారు భావకవిత్వంలోనూ, ఎంకిపాటల్లోనూ, నారాయణమ్మా నాయుడుబావా పాటల్లోనూ, ఇతరత్రా వ్యక్తమైన శృంగారాన్ని మెచ్చుకోకపోగా నిరసించారు కూడా. మొత్తం మీద విద్యాశేఖరులవారికి నేటికాలపు కవిత్వం (భావకవిత్వం) ఇంపితం కాలేదనే చెప్పొచ్చు. ఆయన ఈ అధ్యాయంలో రెండు, మూడుచోట్ల వత్తాసు పలికినది ఈ శృంగారానికే - **"అధములైన చిల్లర మనుష్యుల కంటె, ధర్మ సంబంధం గల పరిణతులు కావ్య శృంగారానికి యెక్కువ వుచితులని, జడప్రకృతి, మనోజ్ఞత్వం, సాధారణుల ప్రేమ మౌగ్ధ్యం భారతీయ కావ్యాల్లో అంగంగా వుండి ఔచిత్య విలసితాలవుతున్నవని సాహిత్యవేత్తల అభిప్రాయం"**. (పుట. 206).


అక్కిరాజువారు భావకవిత్వంలోని వ్యక్తిగత ప్రేమ, విరహాల్ని నానా కారనాలుగా ఈసడించినా, ఎంకి పాటలు, యెంకయ్య చంద్రమ్మ పాటల్ని కొంతవరకు మెచ్చుకున్నారు.

**"దూరాన నా రాజు కేరాయిడౌనో**
**ఈరోజు నా రాత లేరాల పాలో**
**సీమ సిటుకనగానె సెదరిపోతది మనసు**
**..................................**
**మనసులో నా బొమ్మ మసకమసకేంది**
**దూరాన నా రాజు కేరాయిడౌనో"** **(ఎంకి పాటలు)**

\+ \+ \+

**"ముండ్లలో నేడబోతావే చంద్రమ్మ**
**ముందు గోదావరున్నాదే చంద్రమ్మ**
**గోవింద యని నీవు గోదావరిలో బడి**
**దేవతల్లో గలిసినావా చంద్రమ్మ**
**నేనింక బతికె వున్నానా చంద్రమ్మ" (యెంకయ్య చంద్రమ్మ పాట)**

(పుట. 307,308).


ప్రథమ ముద్రణ ముఖపత్రం లోపలి పుట నమూనా
పండిత శ్రీ ఉమాకాన్త విద్యాశేఖరుల
కృతులు
వాఙ్మయపరిశిష్టభాష్యం
నేటి కాలపు కవిత్వం.
ప్రకాశకులు:
వావిళ్ల, రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.
చెన్నపురి.
శ్రీరామ ముద్రాక్షరశాలయందు
ముద్రితము.
1928
All Rights Reserved.] [వెల రూ. 2-8-0.

పై పాటల్లోని ఎంకి విరహం, యెంకయ్య వియోగవేదనను పంతులుగారు మెచ్చుకొన్నారు. కరుణాది భావ వ్యంజనకు ఉత్తమ నాయకుల ఆవశ్యకత లేదని సాధారణ ప్రజల భావాలు కూడా ఆర్ద్రత కలిగించగలవని పంతులుగారు భావించి గౌరవించడం ఆశ్చర్యకరమే.

విద్యాశేఖరులు అక్కిరాజు ఉమాకాంతం పంతులుగారు భావ కవిత్వంగా చెలామణి అవుతున్న సమకాలీన తెలుగు కవిత్వాన్ని 'భావ కవిత్వ'మని అంగీకరించలేదు. వారి దృష్టిలో అది గౌరవప్రదమైనది కాదని మనకు చాలా స్పష్టంగా తెలుస్తున్నది. పంతులుగారు భావకవిత్వం సంప్రదాయంలో పేరెన్నిక గన్న రాయప్రోలు, కృష్ణశాస్త్రి, వేంకట పార్వతీశ్వరులు మొదలైన వారి కావ్యాల్ని సునిశితంగా పరిశీలించారు. అంతేకాదు ఆనాడు వివిధ పత్రికల్లో కవితలు రాసిన భోగరాజు నారాయణమూర్తి, సి.ఎన్.జయరావు, పం. రామచంద్ర రావు మొదలైనవారి రచనల్ని లోతుగా చదివి, వాటిలోని దోషాల్ని పేర్కొన్నారు. నాకు తెలిసినంతవరకు భావకవిత్వంపై ప్రత్యేకంగా పరిశోధనా గ్రంథాలు రాసిన విద్వాంసులు కూడా ఉమాకాంతం గారంత విస్తృతాధ్యయనం కాని లోతైన పరిశోధన కాని చేసినట్లు లేదు.

అక్కిరాజుగారు సంస్కృత కావ్య నాటకాల్నీ, ప్రాచీన తెలుగు కావ్యాల్ని తలస్పర్శిగా పరిశీలించడంతో పాటు సమకాలీన తెలుగు కావ్యాల్నీ, కథల్నీ నవలల్నీ, ఇతర గద్యగ్రంథాల్నీ క్షుణ్ణంగా చదివారు; సునిశితంగా విశ్లేషించారు.

అక్కిరాజు గారి **'నేటికాలపు కవిత్వం'** (1928) వెలువడగానే భావకవులు కొందరు బిత్తరపోతే, ఇంకొందరు చేతులు పిసుక్కొంటే, మరికొందరు మౌనముద్ర వహించారు. కొంతమంది భావకవులు చెన్నపురిలోని అక్కిరాజు వారి దర్శనం చేసుకొని, మాట్లాడేందుకు ధైర్యం చాలక నమస్కరించి తిరిగి వచ్చారట. మొత్తం మీద ఉమాకాంతం గారి విమర్శనాస్త్రాలకు భావకవులు పంచబంగాళమై పొయ్యారు. 1928 తర్వాత కూడా అక్కడ్కడ పత్రికల్లో భావకవితలు తొంగిచూశాయే కాని, కళాకాంతులు కోల్పోయాయని చెప్పక తప్పదు.

అక్కిరాజు వారు 'నేటికాలపు కవిత్వం'లో వెల్లడించిన తీవ్రమైన, తీక్షణమైన బాణ ప్రయోగాలకు సమకాలీన కవికుమారులు, విమర్శకులు మిన్నకుండిపోవడం ఆయన ప్రతిభకు జయకేతన మెత్తినట్లయింది. కాని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'నేటికాలపు కవిత్వం'ను 1994లో పునర్ముద్రించడంతో తెలుగు విమర్శకుల చూపు దీనివైపు ప్రసరించింది. 'నేటికాలపు కవిత్వం' అచ్చయిన రోజుల్లో దాని ప్రఖరతకు వెలవెల పోయారే కాని దానివైపు సూటిగా చూసే ధైర్యవంతులు కాని, దాని విరుద్ధంగా మాట్లాడే ధీమంతులు కాని లేకపొయ్యారు. కాని ఉమాకాంతం గారి విమర్శనా విధానంలోని కొన్ని విశిష్ట గుణాల్ని మెచ్చుకోగలిగే సమీక్షకులు పుట్టుకు రావడానికి ఆరు దశాబ్దాల సుదీర్ఘకాలం అవసరమైంది.

తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన ఈ పుస్తకానికి పీఠిక రాసిన చేకూరి రామారావును అక్కిరాజువారి అమోఘమైన పాండిత్యం, అసమాన వాద పటిమ, అవిచ్ఛిన్న సారస్వత వ్యాసంగం ఆకట్టు కొన్నాయి. (చేరా పీఠికలు (పుట.113). పైగా చేరా దృష్టిని ఉమాకాంతంగారి **"శైలి, సూటిదనం, సారళ్యం"** లాంటి సుగుణాలు అయస్కాంతంలా ఆకర్షించాయి.

అక్కిరాజుగారి జీవిత విశేషాల్ని వెలికి తీసి, ఆయన వ్యావహారిక భాషలో రాసిన కథల్నీ, గ్రాంథికభాసలో రాసిన నైషధీయ తత్త్వ జిజ్ఞాస వగైరా కృతుల్ని పరిశీలించి అద్వితీయమైన కృషి చేసినవారు వీరు. ఉమాకాంతంగారు 'నేటికాలపు కవిత్వం' గురించి విరుచుకుపడిన నేపథ్యాన్ని వారిలా వివరించారు. **"ఈ విమర్శ గ్రంథంలో నాడు ప్రసిద్ధులైన కవి పండిత విమర్శకుల రచనలన్నీ సమీక్షితమైనవి. మొగమాటం లేకుండా తాము అనుచితమనుకొన్న అభిప్రాయాలన్నీ తీవ్రంగా నిరసించారు విద్యాశేఖరులు. భావకవిత్వాన్ని ఆయన సహించి ఉపేక్షించేవారేమో కాని అది తెలుగు సాహిత్యంలో నూతన యుగ స్థాపనమనీ, సంస్కృత దాస్యం నుంచి తెలుగు సాహిత్యం విముక్తమైన సాహిత్య చారిత్రక సన్నివేశమనీ, కవులకు స్వేచ్ఛ ఉండాలనీ, కవులు సర్వతంత్ర స్వతంత్రులనీ భావకవిత్వాన్ని మెచ్చుకొనేవారు, పీఠికలు రచించినవారూ అనడంతో ఆయన తటస్థంగా ఉండలేక పోయినారు. నన్నయ, తిక్కనలనే తప్పు పట్టిన ఉమాకాంతంగారు సమకాలీన కవుల తాననుకొన్న వెర్రిపోకళ్ళను విమర్శించకుండా ఊరుకుంటారా?"** (పల్నాటి వీరచరిత్ర పీఠిక – ఉమాకాంత విద్యాశేఖరుల విమర్శ సిద్ధాంతాలు, పుట.6).

అక్కిరాజుగారి గ్రంథాన్ని పునర్మూల్యాంకనం చేస్తూ ఆచార్య కోవెల సంపత్కుమాచార్య ఇలా బేరీజు వేశారు. **"భారతీయ భాష్య రచనా విధానంతో సరయిన పరిచయం ఉంటే ఉమాకాంతంగారి రచనాశైలిలోని సౌలభ్యమూ, నిష్ఠురత్వమూ, తార్కిక ప్రౌఢి వంటివి అవగతమవుతాయి. ఒక విషయాన్ని ప్రతిపాదించి, దానికి ప్రతికూలాంశాలను గూడా చెప్పి వాటికి సమాధానంగా పరిష్కారం సూచించి తాను మొదట ప్రతిపాదించిన అంశాన్ని సిద్ధాంతీకరించటం ఈ భాష్య విధానంలోని విశేషం. అయితే ఆయన ప్రవేశపెట్టిన ఈ విలక్షణమయిన భాష్య పద్ధతిని ఆ తరువాత ఎవరూ అందుకోక పోవటం లేదా అందుకోలేకపోవటం వల్ల ఆయన విధానం అద్వితీయంగానే ఉండిపోయింది".** (గ్రంథాలయ సర్వస్వం – శత వసంత సాహితీ మంజీరాలు – నాల్గవ భాగం, పుట. 10). నిజమే మరి. ఉమాకాంతంగారి సూక్ష్మ పరిశీలన, నిర్భీకమైన అభిప్రాయ ప్రకటన, స్పష్టత ఎవరందుకున్నారు. మరి ఏ రాచమల్లు రామచంద్రా రెడ్డి గారి వంటి ఉద్దండులో తప్ప?

'నేటి కాలపు కవిత్వం'ను సరిగ్గా అంచనా వేసిన మరో విమర్శక వరేణ్యులు ఆచార్య కేతవరపు రామకోటిశాస్త్రిగారు. ఆయన **'విమర్శన విద్యాశేఖరులు'** అనే వ్యాసంలో తెలుగు సాహిత్య విమర్శకు కట్టమంచి – అక్కిరాజు గార్లందించిన పాథేయాన్ని ఇలా ఉల్లేఖించారు. **"రెడ్డిగారి విమర్శన తీవ్రతకు సాంప్రదాయిక విద్వాంసులు గజగజలాడినట్లు కంటె విద్యాశేరుల విమర్శన భాష్య ధోరణి యను బ్రహ్మాస్త్రమునకు ఆధునిక కవులు పిచ్చుకలట్లు విలవిలలాడిరి. నవ్య సాహిత్య విమర్శనమునకు రామలింగారెడ్డిగారు ప్రారంభకులు కాగా, ఉమా**

**కాంత విద్యాశేఖరులు దాని సంప్రదాయ బలమునకు దోహదము చేసి ఒక గణనీయమైన మలుపును తెచ్చిన మనీషి"** (దృష్టి – దృశ్యం, పుట. 70,71)

ఈవిధంగా కొందరు సంప్రదాయ విమర్శకులు, ఆధునిక సమీక్షకులు ఉమాకాంతంగారి విమర్శలోని మేలిగుణాల్ని, స్పష్టత, ధీరతతో కూడుకొన్న విలక్షణ వ్యావహారిక భాషాశైలి, తర్కబద్ధ భాష్య విధానం వీటిని మనసారా మెచ్చుకొన్నారు. కాని ఉమాకాంతంగారి సమకాలీన విమర్శకులైన కట్టమంచి, వేదం వేంకటరాయశాస్త్రి, శివశంకర శాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన భావకవులు విద్యాశేఖరులను ప్రశంసింపలేకపోయారు. అయితే వీళ్లందరూ వారి పాండితీ ప్రకర్షను, తార్కిక ప్రబుద్ధతా కౌశలాన్ని, అంతరంగాల్లోనే అభినందించి వుంటారని వూహించుకోవచ్చును.

ఇంతకీ అక్కిరాజు గారు తెలుగు విమర్శను ఏవిధంగా సంపన్నం చేశారు అని ప్రశ్నించుకొంటే ఈవిధంగా చెప్పవచ్చును. ప్రాచీన సంస్కృతాంధ్రాంగ్ల విమర్శనా ధురీణులైన ఉమాకాంతంగారు సమకాలీన తెలుగు కవిత్వాన్ని, భావకవిత్వమనే పేరుతో ఏమాత్రమూ అంగీకరించకుండా నేటికాలపు కవిత్వం అని పిలుస్తూ దాని అంతరంగ మథనం చేశారు. నేటి భాకవిత్వం విద్వాంసులకు, విమర్శకులకూ తెలియని భావకవితా కుమారులెందరి కవితల్నో పరిశీలించి మన ముందుంచారు. సమకాలీన తెలుగు కవుల్ని ఇంత విస్తారంగా, లోతుగా పరిశీలించిన విమర్శక మహాభాగులున్నారంటారా? కె.వి. రమణారెడ్డి గారున్నారు కదా? అక్కిరాజుగారు నేటికాలపు కవుల్లో, భావకవుల్లో నచ్చిన వాళ్లలో ఎంకిపాటల నండూరివారు సర్వ ప్రథములు. ఉమాకాంతంగారికి భావకవులు తమను తాము పొగడుకోవడం, పీఠికాకర్తలతో పొగడించుకోవడం సుతరాము నచ్చక, వాళ్లపై ఆగ్నేయాస్త్రాలు సంధించారనక తప్పదు. అద్భుతమైన ప్రజ్ఞానపాటవాలు కల ఉమాకాంతంగారికి భావకవిత్వం నచ్చకున్నా, ఆ యుగంలో రాయప్రోలు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి వంటివారు రాసిన రాష్ట్రప్రేమ, తెనుగు భాషా ప్రీతి, దేశప్రేమకు సంబంధించిన కవితల్లో ఎలాంటి సౌందర్యం, వైశిష్ట్యాలు గోచరించనే లేదా? ఇదో యక్షప్రశ్న!.

భారతీయ కావ్యశాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆంగ్ల కావ్యనాటక నవలల్ని లోతుగా తరచి చూపిన ఉమాకాంత విద్యాశేఖరులు, 'విశ్వశ్రేయః కావ్యమ్' అని నమ్మిన విద్వర్వర్యులు. పాత్రల్ని ఉత్తమ, అధమ, కోటికి చెందినవిగా భావించడానికి అనుసరించన విధానమెలాంటిది?

**"కావ్యం యొక్క క్షుద్రత్వం పాత్రలను బట్టి కూడా నిర్ణయించ వచ్చును. ఇట్లు అధమపాత్ర నిష్టమైన శృంగారానికి రసాభాసమని సాహిత్యవేత్తలు పేరు పెట్టినారు. వారి సంజ్ఞ ప్రకారం యిది రసాభాస కావ్యమవుతుంది. రసాభాస కావ్యమనే పేరు ఈ చిల్లర పాత్రల**



అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు

**శృంగార కావ్యాలకు మీకు నమ్మకమైతే దాన్నే స్వీకరించవచ్చును, నేను వీటిని క్షుద్ర కావ్యాలంటున్నాను"** (నేటికాలపు కవిత్వం పు.ట 210,211).

తెలుగు సాహిత్యానికి ఆటపట్టు, పట్టుకొమ్మ అయిన ఆ చెన్నపురి నగరంలో 'బస్తీమే సవాల్' అంటూ తొడలు తట్టి హుంకరించిన విద్యాశేఖర అక్కిరాజు ఉమాకాంతం పంతులుగారిని ఆ కాలంలో ఎదుర్కొనగలిగిన కవి సింహాలు, పండిత వృషభాలు, విద్వన్మత్తేభాలు కానరాకపోవడమే ఆశ్చర్యం.

ఆధార గ్రంథాలు : 1. నేటి కాలపు కవిత్వం – శ్రీ ఉమాకాంత విద్యాశేఖరులు, వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు.

2. చేరా పీఠికలు – చేరా సాహితీ మిత్రులు, రాజమండ్రి, 1994.

3. పల్నాటి వీర చరిత్ర – పండిత ఉమాకాన్త విద్యాశేఖరులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1997.


4. గ్రంథాలయ సర్వస్వం, మాసపత్రిక. సం. రావి శారద, విజయవాడ (జులై 2001)

5. దృష్టి – దృశ్యం – కేతవరపు రామకోటి శాస్త్రి, జిజ్ఞాస ప్రచురణలు, వరంగల్లు – 2005.

# వృద్ధురాలు



తూరుపు దిక్కుకు
తుళ్ళి పడింది
నలుపు మేఘాలు విచ్చుకుని
చినుకుల జాతరకు
కాలం కళ్ళు తెరిచింది
కూలుతున్న గడ్డివామి ఆకారం
కోయబడ్డ వరి మడి బోసితనం
తొంబైయేళ్ళ ముసలి అవ్వ దీన దృశ్యం
వెండిరంగుతో నిండిపోయిన
తలవెంట్రుకలు
ఎండిపోయిన బావులంటి
లోతైన రెండు చెంపగుంటలు
వేలాడే ఒడలు
వంగిన నడుము
కమిలిన కన్నులు
భాష తెలియని ఆకలితో
ఆమె కడుపు
బుగ్గలాగ ఉబ్బి
సొరంగంలా లోతుకు
పీక్కుపోతుంది
చినుకుకై వేచే
సుప్త అచేతనమైన బీడులాంటి
పెదాలపై నవ్వు కరువై
ఎంతకాలమైందో...!
మెరిసే పసిడిముద్దలా ఉన్న
నాటి యవ్వనమేనును ఎంత దాచుకుందో...
ఇప్పుడు అంత బైట పడేస్తుంది
దేశం కన్నది తనను కడపటి బిడ్డలా,
చతుర్వర్ణ వ్యవస్థ రాకాసి త్రాచై
పాల భీతను కాటేసింది
మట్టి పురుగై బ్రతికిన ఛాయలు
తన చుట్టే తిరుగుతున్నాయి
ఎన్నో పుట్ల ధాన్యరాశులకు
ప్రాణం పోసినట్లు
ప్రాణంగా పెట్టుకున్న ఆత్మాభిమానం మాత్రం
ఆ కళ్ళలో లీలగా కనిపిస్తుంది



వెలివాడ వ్యథలు
కరువు కాటకపు కన్నీళ్ళు
పొయ్యికెక్కని పాత్రలో
ఇంకినట్టున్నాయి
ఐటెక్కు యుగపు అభివృద్ధి
ఆమె కూర్చున్ననేలపై
మెత్తని సీటునిచ్చిందా...?
అరిపోయే ప్రాణదీపానికి
కరములేమైనా అడ్డు పెట్టిందా?
ఈ చిత్రానికి
ఏ కాలం కరిగింది
ఏ యుగం మర్లబడింది
ముసలి అవ్వ మాత్రం
చివరగా ఓ మూలుగు మూలిగింది



**డా. కందుల శ్రీను**
ఫోన్ : 9652674834

# కరిగే మేఘం [కథానిక]

**డా. బి. నాగశేషు,** ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు. ఫోన్ : 998 550 9053

ఎంత సరదాజీవితం గడిపేదాన్ని ఈ మధ్యే కదా ఇలా ఎందుకు జరుగుతూంది. కనీసం ఒకగంటసేపు కుదురుగా నిద్రపోలేకున్నాను, కాదు కాదు నిద్ర పట్టడంలేదు ఏమయ్యింది నాకు? అని కాలేజ్ కి వెళ్లేదారంతా ఆలోచన బాణాలను తనకు తానే సంధించుకొంటూ వెలుతూ ఉంది, నేనేనా ఇలా ఉంటున్నది అని ఒకవైపు బాధ, నిట్టూర్పు.

మేఘన అందమైన భోళా ఆడపిల్ల తను పుట్టింది చెన్నై నగరంలో, బాల్యమంతా బెంగళూరులో గడిచింది ఆ తరువాత అనంతపురానికి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. తండ్రి శ్రీమన్నారాయణగుప్త , తల్లి సుధా స్రవంతి, వీరికి ఇద్దరూ కూతుళ్ళే, పెద్దపాప మేఘన, చిన్నపాప లత, ఇద్దరు కూతుళ్లతో ఆ ఇల్లు ఒక నందనవనంగా ఉంటుంది.

శ్రీమన్నారాయణకు వ్యాపారం బాగా తెలుసు, అందువల్ల అతను ఏ ఊర్లో నివాసం ఉన్నా ఏదో ఒక చిన్నవ్యాపారం చేసుకొంటూ తన సంసారాన్ని పొందికగా, ఒద్దికగా నడుపుతుంటాడు. పేదరికం లేదుకానీ, అలా అని కోరిన కోరికలన్నీ తీరేంత షావుకారుతనమూ లేదు, ఎప్పుడూ పెద్దగా బాధపడిన సందర్భాలు కూడా తక్కువే. పెద్దపాపకు కన్నడం, తమిళం భాషలు బాగా వచ్చు, పిల్లలిద్దరినీ పైసల బడిలోనే చదివిస్తున్నాడు. నిత్యం తన కూతుళ్లను తనే టి.వి.ఎస్ బండిమీద బడిదగ్గర దింపి తనే ఇంటికి తీసుకొచ్చేవాడు శ్రీమన్నారాయణ. తండ్రికి మేఘన అంటే చాలా ప్రాణం, కాదు అంతకుమించి, కూతురు గురించి బడిపంతులుగారు గానీ లేదా తోటి మిత్రులుకానీ నీ కూతురు చాలా బాగా చదువుతుంది అంటే ఇక ఆ తండ్రి తనభవిష్యత్‌ను ఆ పాపలో చూసుకొనేవాడు. చిన్నపాప కూడా చదువులో బాగానే చురుగ్గా ఉంది అయితే పెద్దపాప అంత హుషారు, కలుపుగోలుతనం చిన్నమ్మాయిలో తక్కువ.

మేఘన తన తల్లితండ్రుల కష్టం చూసి అందులో నేను కూడా భాగస్వామిని కావాలి అనుకొనేది, అనుకొన్నట్టుగానే బడి అయిపోగానే తన తండ్రి పాతూరులో అంగడి పెట్టుకొన్నారు, నేరుగా తండ్రి నడిపే కొట్టుదగ్గరికొచ్చి తండ్రికి ముద్దుముద్దుగా మాటలు చెబుతూ తండ్రిని కూర్చోబెట్టి తనే వ్యాపారం చేసేది.

సుధాస్రవంతికి భర్తకు, పిల్లలకు వండిపెట్టడం, పూజలు చేసుకోవడం తప్పితే వేరేలోకంలోకి ఆమె ప్రవేశించదు, సాయంత్రం అవ్వగానే నలుగురూ కూర్చొని సినిమా కబుర్లో, బంధువుల గురించో, దేవాలయాల గురించో చర్చింటుకొంటూ గడుపుతారు, రాత్రి భోజనసమయంలో తండ్రి కూతుళ్లకు ముద్దలు కలిపి నోట్లో పెట్టడం వారు గోము చెయ్యడం తల్లి చిన్న చిన్న మందలింపులతో రాత్రి భోజనాలు ముగుస్తాయి.

మేఘన, లత వార్షిక పరీక్షలు అయిపోగానే సెలవులకు ఎక్కడా ఏ బంధువుల ఇండ్లకు వెళ్లేవారు కాదు, చుట్టాలు లేక కాదు, సెలవులు వచ్చాయంటే తండ్రి తరపున, తల్లి తరపున చుట్టాలతో శ్రీమన్నారాయణ ఇల్లు నిండిపోయేది, వారి ఆతిథ్యం అందరికీ నచ్చేది అందువల్ల రెక్కలు కట్టుకొని సిద్ధంగా ఉండేవారు ఎప్పుడు సెలవులొస్తాయా అని, ప్రతిసారీ ఇదే జరిగేది ఇక వీళ్లువెళ్లడం ఎక్కడుంటుంది. మేఘన పదవతరగతి పరీక్షలను రాస్తుండటంతో ప్రతిసంవత్సరం వచ్చే బంధువులు ఈ ఏడు ఎవరూ ఇంటికి రాలేదు, పరీక్షలు బాగా రాసింది మేఘన ఫలితాలకోసం ఇంటిల్లిపాది నిరీక్షణ.

శ్రీమన్నారాయణ కొట్టు రోజూలా కాకుండా ఆరోజు కాస్త తొందరగా మూసేసాడు, వస్తూ వస్తూ తియ్యటి తినుబండారాలు తీసుకొచ్చారు, ఇంటికొచ్చాక ఆ తియ్యని తినుబండారాలు తనే అందరికీ తినిపించాడు, తన వీధిలోని వారందరికీ స్వీట్లుపంచాడు, కూతురు పదవతరగతి ఉత్తీర్ణత సాధించిందనే సంగతిని ఇంటింటికీ చేర్చాడు.

అయితే ఉన్నత చదువులు చదివించాలంటే తన తండ్రికి అంత స్థోమత లేదే, వచ్చే ఆదాయంతో నేను, చెల్లి ఇద్దరూ చదువుకోవా లంటే అవుతుందా, తనలో తాను మథనపడింది మేఘన. కూతురిని ఏ కోర్సులోకి చేర్పించాలి, అనంతపురంలోనేనా, లేదా విజయవాడ, హైద్రాబాద్ లలో చేర్పించేదా, ఒక వేళ వేరేపట్టణంలో చేర్పిస్తే తను ఉండగలదా, తనుండగలదేమో కానీ నేను తనను వదిలి ఉండ గలనా? ఉన్నత చదువులు చదివిస్తే గొప్ప గొప్ప సంబంధాలు తీసుకొని రాగలనా? వాళ్లకు కట్నకానుకలు ఇవ్వగలనా? ఇలా రకరకాల ప్రశ్నలు శ్రీమన్నారాయణను చుట్టుముట్టి ఆ రాత్రికి కంటిమీద రెప్పవాలకుండా చేశాయి. అయితే కూతురు బాగా చదువుకుంటే తన కాళ్లమీద తాను నిలబడగలుగుతుందనే ఆశ శ్రీమన్నారాయణలో కలిగింది, భారం దేవుడిమీద వేశాడు.

తెల్లారగానే శ్రీమన్నారాయణ కొట్టు తెరవలేదు కూతురిని వెంటబెట్టుకొని గుత్తికి బయల్దేరాడు కూతురుకి ఏం అర్థం కాలేదు, గుత్తిలో ఇంటిదేవుడున్నాడు ఆయన అనుగ్రహం కోసం కూతురుని తీసుకెళ్లాడు. అక్కడ దైవదర్శనం చేసుకొని, ఎలాగో ఇంతదూరం వచ్చాముకదా అని శ్రీమన్నారాయణగారికి దూరపు బంధువైన గంగాధర్ గుప్త గారింటికి వెళ్లి తన బిడ్డ చదువులో ఫస్ట్ వచ్చిందని, అందుకే మా ఇంటిదేవుని దగ్గరికి వచ్చామనే సంగతిని తన ముందుంచాడు శ్రీమన్నారాయణ. అమ్మాయిని పైచదువులు చదివించు అని కేవలం ఉచితసలహాకే పరిమితం కాకుండా,

కొంతడబ్బుకూడా ఇచ్చాడు గంగాధర్ గుప్త. గంగాధర్ గుప్త ఆర్థికంగా బాగా నిలదొక్కుకొన్నోడు, ఇలాంటి సహాయాలు అప్పుడప్పుడు తనకు తోచినంత తనకులం వాళ్లకు చేస్తుంటాడు.

మేఘన ఇంటర్ విద్యను అనంతపురంలోనే పూర్తి చేసి, ఎమ్‌సెట్ పరీక్షలో అత్యధిక మార్కులు సంపాదించింది, కానీ కూతురుని ఇక చదువు ఆపించి పెళ్లి చేయాలనే బలమైన నిర్ణయానికి వచ్చేసాడు మేఘన తండ్రి. అదే విషయాన్ని కూతురుకి, భార్యకు తేల్చి చెప్పాడు. మేఘన స్నేహితులంతా ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిపోయారు, తనుకూడా ఇంజనీర్ అవ్వాలనేది ఆమె కల, అది జరగలేదు, తండ్రి ఒప్పుకోలేదు, కనీసం డిగ్రీ అయినా చేస్తాను నాన్నా అని బతిమి లాడింది, తగిన సంబంధాలుకూడా అప్పటికి రాకపోవడంతో సరే అని సెలవిచ్చాడు శ్రీమన్నరాయణ.

చదువుకోసం బిడ్డపడే ఆరాటాన్ని గమనించిన సుధాస్రవంతి కూతురు కోసం రంగంలోకి దిగింది. తానుచదువుకోలేదు కానీ, చదువు విలువ తెలిసిన వ్యక్తి, ఎప్పుడూ భర్త నిర్ణయాల్లో తల దూర్చని సుధ ఎందుకో కూతురి చదువు విషయంలో భర్త నిర్ణయాన్ని వ్యతిరేకించింది, తన చదువును ఆపొద్దని, అవసరమైతే నేను కూలికైనా వెళ్లి బిడ్డను చదివిస్తానని తేల్చి చెప్పింది భర్తతో. భార్యమాట కాదనలేక మారుమాటలేకుండా కూతురిని అతి కష్టం మీద డిగ్రీ సాంప్రదాయక కోర్సులో చేర్పించాడు. కూతురు చేస్తున్నది డిగ్రీ అనే విషయం తెలవకపోయినా మొత్తానికి ఏదో పెద్ద చదువే చదువుతోందని సంతోషపడింది తల్లి. తల్లి ఆశను మేఘన వమ్ము చేయలేదు, మేఘన డిగ్రీ ఫలితాల్లో కూడా కళాశాల ఫస్ట్ వచ్చింది.

తను అనుకొన్న టీచర్ కోర్సుకోసం బి.ఇడి. ఎంట్రెన్స్ పరీక్షరాసి ఆనందంగా ఇంటికొచ్చింది మేఘన, ఇంటిముందర కారు, కొన్ని బైక్‌లు నిలబెట్టారు, గుమ్మం ముందు వరుసగా పదుల సంఖ్యలో చెప్పులున్నాయి, విషయం ఏంటో తెలియలేదు. లోపలికెళ్లగానే తన తల్లి ఒక గదిలోకి తీసుకెళ్లి, వచ్చింది పెళ్లిచూపులకని అబ్బాయివారిది పెనుగొండ అని చెప్పి చీరకట్టుకొని వచ్చి కూర్చో అన్నది. తనకు పెళ్లి ఏ మాత్రం ఇష్టంలేదని, నేను చదువుకోవాలని ఏడ్చింది మేఘన, చెల్లి కూడా అక్కతో శ్రుతి కలిపింది, ఇది కేవలం చూపులేనని నువు చదువుకుందువు, నీ చదువుకేం ఇబ్బందిలేదు, కేవలం చూపులకోసం చీర కట్టుకొని రమ్మని తండ్రి బతిమాలాడు, కాదనలేక తల్లిదండ్రుల కోసం వాళ్లు చెప్పినట్లు చేసింది.

గండం గట్టెక్కింది, అనుకునేలోపే అమ్మాయి నచ్చిందని కబురొచ్చింది, పిల్లను చూడటానికి ఇంకోసారి వస్తున్నట్లు తెలియజేశారు అబ్బాయి తరపు పెద్దలు. శ్రీమన్నారాయణకు అబ్బాయి నచ్చాడు , ప్రైవేటుసంస్థలో పనిచేస్తున్నాడు ఆరుగురు అన్నదమ్ములలో ఈ అబ్బాయి ఆఖరివాడు, గుంపున్న సంపన్న కుటుంబం, పైగా కట్నకానుకలు ఆశించే స్థితిలో లేరని మధ్యవర్తి ద్వారా తెలిసింది.

కూతురి బరువును దించుకోవాలని తండ్రి ఎదురుచూస్తున్నాడు, కూతురేమో తన జీవితంతో పాటు తన ఇంటిని కూడా చక్కపరచాలని, ఇన్ని రోజులు నాన్న ఎంతో కష్టపడి నన్ను చదివించారు, ఆ శ్రమకు విలువలేకుండా పోతుందనే బాధ, తాను ఉద్యోగం సంపాదించి కాస్త నాన్నకు ఆర్థికంగా చేయూతనివ్వాలనేది మేఘన ఆలోచన.

అమ్మాయి నచ్చిందనే సమాచారం పంపిన విషయాన్ని ఇంట్లో వాళ్లతో పంచుకొన్నాడు తండ్రి, అంతే తన కళ్లముందు భవిష్యత్ కూలిపోతున్నదే, నేనేమి చేయలేనా, నాన్న ఇంకొక సంవత్సరం ఓపిక పట్టు అని మేఘన తండ్రిని ప్రాధేయపడింది వినలేదు. రోజూ రాత్రయితేనే చెప్పుకొనే కబుర్లు ఆరోజు పక్కకెళ్లిపోయాయి, అన్నం ముద్దలు కలిపి బిడ్డల నోట్లో పెట్టే తండ్రి లోపలి గదిలో ఎవరినీ పలకరించకుండా ఉండిపోయాడు. బలవంతంగా బలవ్వడానికి ఇష్టం లేని వండిన అన్నం కుండలోనే కునుకు తీస్తూ ఉంది. ఎవరి ఆలోచనలో వాళ్లు, నిద్ర కూడా వీళ్ల మథనం చూసి దూరంగా వెళ్లిపోయింది ఆ రాత్రి.

మగపెళ్లివారు చెప్పిన తేదీ గుర్తుకుతెచ్చుకొంటూ, తండ్రిపడే వేదనను అర్థం చేసుకున్నది మేఘన, పెళ్లికి ఒప్పేసుకోవడమా, బిఇడి కోర్సులో చేరడమా? ఏం చెయ్యాలో తెలియక రైలు పట్టాల కింద నలిగిన రూపాయి బిల్లలా నలిగిపోతోంది మేఘన.

కాలానికి కలతలు, మమతలు, అలకలు, అల్లకొల్లాలు, ఇష్టాలు, కష్టాలు ఏవీ పట్టవు కదా ఎవరికోసమో ఆగే స్వభావం కాలానికి ఉండదు కదా ! మగ పెళ్లివారు చెప్పిన తేదీ రానే వచ్చింది. కూతురు ఎలా స్పందిస్తుందో అనే ఆందోళన తండ్రికి లోలోపల ఉంది. సుధ బిడ్డను సిద్ధం చేసి పెళ్లి వారిముందు తీసుకొచ్చి కూర్చోపెట్టింది, మేఘనను పెళ్లిచేసుకోవాలనే ఆశతో వచ్చిన అబ్బాయి, తోడుగా వచ్చినవారందరూ తేరిపారా అమ్మాయిని చూశారు, వాళ్లలో కొంతమంది పాతతరానికి చెందిన ఆడవాళ్లు ఉన్నారు, వాళ్లు అమ్మాయిని కాళ్లు కడుక్కొచ్చి అటు ఇటు తిరగమన్నారు, అడుగుల గురతులను చూసి అమ్మాయి జాతకాన్ని చూస్తున్నారు, తడి ఆరగానే మళ్లీ కడుక్కొని రమ్మన్నారు. అరచేతులు చూశారు, నుదురు చూశారు, పలువరుస చూశారు, ఒకటేమిటి నానా పరీక్షలు పెట్టారు, ఎద్దును కొనే రైతులా అన్నీ చూసారు, అన్నింటా పాస్ అయ్యింది మేఘన. అన్నీ మంచి శకునాలే అనిపించాయి అమ్మాయి అందరికీ నచ్చేసింది, మీరేమంటారని శ్రీమన్నారాయణను అక్కడే అడిగేశారు.

అమ్మాయి బి.ఇడి. చదవాలని ఆశగా ఉంది, ఆమెకు చదువంటే చాలా ప్రాణమని అమ్మాయి మనసులోని మాటను శ్రీమన్నారాయణ విషయాన్ని తెలియజేశాడు. అమ్మాయిని మేమే చదివిస్తాం, లేదా కోర్సు పూర్తయ్యేదాకా మీరు మాటిస్తే ఆగుతామన్నారు మగపెళ్లివారు. మాటలు లేవు కొన్ని క్షణాలు ఇంటిని మౌనం గాలిలా చుట్టేసింది. సరే ఏ విషయానికి కబురుచెయ్యండని వాళ్లు బయలుదేరారు.

మేఘన టీచర్ ట్రైనింగ్ కోర్సులో చేరిపోయింది, ఏడాది గడిచింది పరీక్షలు పూర్తిచేసిన మరుసటిరోజుకే పెళ్లిముహూర్తం పెట్టేశారు, సరిగ్గా అదేరోజు ప్రభుత్వం టీచర్ ఉద్యోగాల నోటిఫికేషన్ కూడా వెలువరించింది. మేఘన ఆశలు, ఆశయాలు కాలానికే అప్పగించేసింది, పెళ్లి మళ్లీ వాయిదా వేద్దామా అంటే అప్పటికే ఏడాది కాలంపాటు ఆగారు, ఇక ఆగమని కూడా అబ్బాయి తరపువారు తగువుకొస్తున్నారు. తండ్రికోరిక, తల్లి ఆవేదన మేఘన పరిస్థితి గానుగలో పెట్టిన చెరుకులా ఉంది. ఏ దేవుడైనా వచ్చి ఈపెళ్లి ఆపితే బాగుండని అందరికీ మొక్కింది, జోరువాన గాలికి నేల కూలుతున్న వృక్షంలా తన ప్రమేయం ఏమీలేకుండా, ఒక వస్తువులా పెళ్లిమండపం వైపు నడవాల్సి వచ్చింది మేఘన.

తనదికాని లోకంలోకి వచ్చి పడ్డట్లయింది మేఘనకు, క్రికెట్ స్టేడియంలో ఉన్నట్లు మెట్టినింట్లో ఒకటే జనం. అందరికంటే చిన్నకోడలు, ఎక్కడ కూర్చొంటే ఏమవుతుందో, లెగిస్తే ఏమవుతుందో అని బెరుకు ఉంది. నాన్నను చూడకుండా వారం రోజులు ఉండలేదు మేఘన. బి.ఇడి. కోసం హాస్టల్లో ఉన్నప్పుడు కూడా శనివారం రాత్రికి తనే ఇంటికి వచ్చేది లేదా తండ్రే కూతురు దగ్గరికి పోవాలి. వారానికి మించి ఎప్పుడూ ఇంతదాకా ఉన్నిందిలేదు పైగా కొత్త మనుషుల మధ్య మేఘన పరిస్థితి వేటగాడి వలలో చిక్కిన లేడిలా ఉంది.

సంవత్సరం గడిచింది ఇంతలోపే మేఘన కడుపు పండిందనే వార్త పుట్టింటికి చేరింది, పండుగలా ఇరువర్గాలు వేడుకను జరుపుకొన్నారు, అన్ని ఆచారాలతో మేఘనను పుట్టింటికి కాన్పుకు తీసుకెళ్లారు. చెల్లి కళాశాలకు, తండ్రి కొట్టుకు, అమ్మ ఇంటిపనుల్లో ఉంటోంది, భర్త ఉద్యోగంలో తీరికలేకుండా ఎప్పుడో ఒకసారి వచ్చి చూసివెళ్లేవాడు. ఇంట్లో ఖాళీగ కూర్చోలేక ఏదో ఒక వ్యాపకం పెట్టుకొనే మేఘన ఎమ్.ఎస్.సి. మాథమెటిక్స్ కోర్సులోచేరాలనే ఆశను ముందు నాన్నదగ్గర, ఆపై భర్త అనుమతి పొందింది, చదువు పాడు చేశాననే బాధ తండ్రికెలాగో ఇప్పటికే అర్థమైపోయింది ఎవ్వరూ అడుచెప్పలేదు.

తన కలలపంట అందరి ఆశలదీవిగా పాప పుట్టింది, పాపను చూడటానికి వచ్చిన తన స్నేహితులు డి.ఎస్.సి. పరీక్షకు ఇంకో వారమే సమయముందనే విషయాన్ని గుర్తుచేశారు. ఎం.ఎస్.సి., వార్షిక పరీక్షలు కూడా దగ్గర్లో ఉన్నాయి. చదువంటే ప్రాణమిచ్చే మేఘనకు ఇవేవి కష్టంగా అనిపించలేదు, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కాకుండా భర్త సహకారం కూడా తోడయ్యింది. ఇప్పుడు మేఘనకు మానసిక బలం పెరిగింది. ఎన్ని పరీక్షలనైనా ఎదుర్కొంటాననే స్థైర్యం తనలో నిండుగాఉంది. రెండు పరీక్షల్లో విజయాన్ని పొందినందుకు ప్రభుత్వ ఉద్యోగానికి ఈర్ష్య కలిగిందేమో, అందుకే ప్రభుత్వ ఉద్యోగం తప్పుకుంది మేఘన నుండి.



మెట్టినింటికి వెళ్లిన మేఘనకు తన అందాల ఆభరణమైన పాపతో సమయం తెలీటంలేదు, కాలం ఇప్పుడు వేగంగా కదులుతోంది పాప తోడుగాఉంది కదా సమయం తెలియడంలేదు.

పాపకు అక్షరాభ్యాసం చేశారు, బిడ్డ బడిలో చేరడంతో ఇంట్లో పగలంతా ఖాళీగా సమయం గడపడం ఇష్టంలేదు, అందునా అప్పటికే సంసారంలోని లుకలుకలు పొరలు తప్పి వాస్తవం కళ్ల ముందు కనిపిస్తుంది మేఘనకు, కళాశాలలో అధ్యాపకురాలిగా చేరింది మేఘన. వచ్చే జీతంతో చెల్లిని చదివిస్తూ తనకుటుంబంతో పాటు, అమ్మవాళ్లకు కూడా ఆర్థికంగా తోడుగా నిలబడింది మేఘన.

రోజులాగే కళాశాల తరగతిలో బోధిస్తున్న మేఘనకు ప్రిన్సిపాల్ తరగతిగది దగ్గరికొచ్చి మేఘనకు ఇంటినుంచి ఫోను వచ్చినసంగతిని చెప్పాడు. ఖంగారుగా రెట్టింపు వేగంతో ఇంటికి చేరుకొంది, భర్త అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. అన్నదమ్ములు, తోటికోడళ్ళు అందరూ భర్త చుట్టూ చేరారు కానీ ఎవరూ ఆయనను హాస్పిటల్‌కు తీసుకుపోవాలని కనీసం ఆలోచించనూ లేదు. విషయం తెలిసిపోయింది కుటుంబం రంగుతేలిపోయింది, మ్యాచ్ ముగిశాక ఇండ్లకు మళ్లే ప్రేక్షకుల్లా ఎవరిదారిన వాళ్లు వారి వారి గదుల్లోకి వెళ్లి తలుపులు బిగించుకొన్నారు. చెప్పుకోడానికి ఎవరున్నారు ఒక్కసారిగా నిలుచున్న చోటే భూకంపం వచ్చినట్లయింది మేఘనకు, అందరూ తనవారనుకొని భ్రమలో బతికిన మేఘనకు ఏమీ తోచలేదు, కనీసం వాళ్లను తిట్టుకోవాలనే ఆలోచన కూడా చేయలేదు. అమ్మానాన్నలు అనంతపురంలో ఉండేది రావడానికి కనీసం రెండు గంటలు సమయం పడుతుంది. దిక్కుతోచలేదు భర్తనోటమాట లేకుండా జడ వస్తువుగా పడివున్నాడు.

శక్తినంతటినీ కూడదీసుకొన్నది, పుట్టింటివారికి విషయాన్ని తెలిపి, పొదుపుచేసి దాచుకొన్న డబ్బును తీసుకొని పక్కఇండ్లవారి సహాయంతో భర్తను బెంగళూరుకు తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించింది, శ్రీమన్నారాయణ కూడా చేరుకొన్నాడు, పాపని నారాయణకు అప్పగించి భర్త దగ్గరే ఉంది. భర్త పనిచేసే సంస్థ యజమానికి

విషయం తెలియగానే తానే స్వయంగా వచ్చి వైద్యులతో మాట్లాడి, వైద్యానికయ్యే ఖర్చు నేనే మొత్తం భరిస్తానని మేఘనకు ధైర్యం చెప్పాడు. కనీసం తనకు తోడుగా ఎవ్వరూ లేని స్థితి, ఇంట్లో ఉండే జనం సంఖ్యకు మాత్రమే ఉన్నారని, సాయానికి పనికిరారని మేఘనకు అర్థం అయ్యింది. వైద్యులు పిలిచి మీ వారి ప్రాణానికి ఏం ప్రమాదం లేదని మందులు తీసుకురమ్మని మందులచీటీ ఇచ్చారు.

ఆత్రంగా మందులకోసం కింద ఫ్లోర్ కు వెలుతోంది లిఫ్ట్ ఖాళీగా లేనందువల్ల, ఆత్రంగా నడుచుకొంటూ కిందికి దిగివస్తూ ఉంది పట్టుజారి ఒక్కసారిగా వస్తువేదో మెట్లమీద నుంచి కిందకిజారిపడ్డట్లు శబ్దం, ఒక మలుపునుండి ఇంకో మలుపుమీద వచ్చి పడింది.

ఎక్కడా కనిపించేలా గాయాలు కాలేదు, మనసులో భర్త అనారోగ్యమే నిండిపోయింది. భర్త పరిస్థితి ముందు తన దెబ్బ ఏపాటిదని మొండిగా ఉండిపోయింది. అదే దెబ్బ తనకు జీవితాంతం నిద్రను దూరంచేస్తుందని మేఘనకు అప్పటికి తెలీదు. భర్తను ఆరోగ్యవంతునిగా తీసుకురాగలిగింది, అన్నదమ్ముల్లో ఆందోళన తమ్ముడు తిరిగొచ్చాడని, తిరిగొచ్చేలోపు ఉన్న ఇంటిని అమ్మేసి అన్నదమ్ములు భాగాలు కూడా పంచేసుకొన్నారు కానీ చిన్నతమ్ముడికి పైసా ముట్టలేదు చిన్న తమ్ముడు తిరిగిరాడనే ధీమా వారిది.

యథావిధిగా రోజువారి ఉద్యోగాల్లో ఇద్దరూ మునిగిపోయారు, పగలంతా ఇంటిపని ఉద్యోగబాధ్యతలు రెండింటినీ సమర్థవంతంగా నిర్వహిస్తోంది మేఘన. పగలంతా పనిచేసి రాత్రికి నిద్రపోయేది అన్ని ప్రాణులకు అలవాటు కానీ మేఘనకు నిద్రపట్టడం లేదు, కాదుకాదు నిద్రరావడంలేదు. ఒకరోజు, రెండురోజులుకాదు అలా నిద్రకోసం ఎదురుచూడాల్సివచ్చింది. ఎప్పుడో ఒక అరగంట నిద్రపోతే అదేగొప్ప. రాత్రికి పగటికి తేడా తెలీకుండా పోయింది భర్తకు ఈ విషయం తెలియడంతో కారణాలు ఆరా తీశాడు, జరిగింది చెప్పుకో లేదు. తరచూ ఇలా ఉండటంతో బెంగుళూరులో పెద్దాసుపత్రిలో చూపించారు, కంప్యూటర్ లు సైన్సు అబద్ధాలు చెప్పవు కదా, తనకు హాస్పిటల్లో తలకు తగిలిన దెబ్బకు రక్తం గూడుకట్టింది, విషయం చెప్పాల్సి వచ్చింది. మందులతో తగ్గితే ఫరవాలేదు లేదంటే ఆపరేషన్ చేయించాలి, అది కూడా ఫలితాన్ని ఇస్తుందో లేదో తెలియని స్థితి, అని వైద్యులు చెప్పేసరికి ఇద్దరికీ గుండెలు క్షణంపాటు ఆగినంత పనైపోయింది, తేరుకొని ధైర్యం తెచ్చుకొని ఇంటికి వెళ్లారు.

తనకు తగిలిన దెబ్బకు జవాబును కాలానికే వదిలేసి, చెల్లికి తన ఇష్టప్రకారం పెళ్లిజరిపించి నాన్న బాధ్యతను కూడా తనే మోసింది, రెండోఅల్లుడు ఇంజనీర్ మంచి సంపాదన, నివాసం బెంగళూరులోనే ఉంటాడు. మేఘన అమ్మానాన్నకు ఒక సొంతింటిని కట్టించి అందులో ఉంచింది, తనవాళ్లకెవరికైనా కష్టం వస్తే అన్నీ మేఘన దగ్గరుండి మరీ చూసుకుంటూ ఉంది. ఆఖరికి తనకు ఆపదలో నిలువని తన బావా, తోడికోడళ్ళకు కూడా.

మేఘన నిద్రపట్టకపోవడం ఊపిరితీసుకోవడమంత సహజ మైంది, కాలంగడిచే కొద్దీ మేఘన బలహీనపడుతూ ఉంది అనారోగ్యాలు చుట్టుముట్టేసితున్నాయి. ఇది చూడలేని భర్త ఆపరేషన్‌కు తీసుకెళ్ళాలని నిర్ణయించుకొన్నాడు.

ఆరోగ్యంగా గలగల మాట్లాడుతూ కళకళలాడే అమ్మకు ఇంత లోనే చిన్న అసౌకర్యం. నాన్ననుండి ఫోను అమ్మకు బాలేదని, ఆమెకు కలిగింది చిన్న అసౌకర్యం కాదని అది ప్రాణాంతకం అని హాస్పిటల్‌కి వెళ్లేదాకా ఎవ్వరికీతెలీదు. తన ఆపరేషన్ సంగతిని అక్కడే మరచిపోయింది అమ్మను బతికించుకోవాలని, వైద్యం చేయించింది.

మేఘనకు రాత్రంతా నిద్రపట్టక ఒకటే ఆలోచనలు మోగుతున్నాయి, అమ్మకు వండిపెట్టేవారు లేరు ఎలా చేసుకొంటారో ఏమో అని, అమ్మ ఎలాఉందో ఏమో అని ఒకతే దీక్షగా ఆలోచిస్తోంది. పడుకుంటే నిద్రపట్టదు, నిద్రపట్టక ఆకలిలేక మనిషి ఆరోగ్యంబాగా దెబ్బతిన్నది. ఇద్దరి సంపాదనా కూడా ఖర్చులకు పెట్టేశారు, కొద్దో గొప్పో ఉన్నది కూతురు చేతికొస్తూ ఉన్నది. అమ్మాయి ఉన్నతచదువులకు డబ్బవసరం చాలా ఉంటుంది. తన ఆపరేషన్ ఆలోచనను జీవితకాలంపాటు వాయిదా వేసుకొన్నారు భార్యాభర్తలిద్దరూ. అమ్మకు అనారోగ్యం, నాన్నకు వయసు మీద పడటం వాళ్ల కష్టాలను చూడలేక ఇద్దరినీ తన దగ్గరే పెట్టుకొని చూసుకోవడం, తన ఆలోచనలకు అనుగుణంగా భర్తకూడా సహకారం ఇవ్వడం నిజంగా మేఘనకు కొండంత బలం. పేరుకు మేఘనయే కానీ తాను కష్టాలకు కరిగిపోలేదు, భయపడలేదు.

కష్టాలన్నింటికీ తన ఇంట్లో స్వాగతతోరణాలు కట్టింది వాటన్నింటినీ చాలా సులభంగా స్వీకరించింది. తనకు ప్రతిరోజూ కాకపోయినా బాగా మనసుకు బాధ కలిగినప్పుడు ఆ రాత్రి నిద్రపడితే ఇలాంటి రెట్టింపు కష్టాలను ఉత్సాహంతో ఎదుర్కోగల సత్తా మేఘనలో పుష్కలంగా ఉన్నాయి. అయితే నిద్రను తానెంత దగ్గరికి ఆహ్వానిస్తున్నదో అంతే దూరంవెళుతోంది. నిద్రకోసం వాడని మందులేదు, వినని బూటకపు మాటలేదు, తినని ఆకులులేవు. వేయని యోగాసనం లేదు. అందరి కలతలను, కలహాలను, బడలికలను, బాధలను తానావహించి మరచిపోయేలా చేసే నిద్ర మేఘనను మాత్రం వదిలి అనాథగా మిగిలిపోయింది. నిద్రపోతే బాధలన్నీ మరచిపోవచ్చని కాదు వాటిని తట్టుకోవడానికి బలం కోసం నిద్రకావాలనీ, నిద్ర పోవాలనీ ఆరాటపడుతూనే ఉంది. ఇంతలో తను పనిచేసే కళాశాల వచ్చేసింది యథావిధిగా తను విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నది.



## సాధన పంచకమ్

**వేదో నిత్య మధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం**
**తేనే శస్య విధీయతా మపచితిః కామ్యే మతిస్త్యజ్యతామ్**
**పాపౌఘః పరిధూయతాం భవసుఖే దోషోఽను సంధీయతాం**
**ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్**

**8. నిగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్**

ఇంటి సంకెళ్ళనుండి విముక్తి పొందాలి. ఇంటినుండి బయట పడటం కాదు. ఇంటి సంకెళ్ళనుండి బయట పడాలి. మనిషిని బాధపెట్టేది ఇల్లు కాదు. ఈ 'ఇల్లునాది' అనే భావన లేదా 'మమత్వ బుద్ధి' మనిషిని బాధిస్తుంది. ఇక్కడ సంకెళ్ళు అంటే మమత్వం – నాది అనే భావనకు అర్థం చెప్పుకోవాలి. కావున పుట్టిన ప్రతి మనిషి ప్రపంచంలో ఉన్నవి మనకొరకే ఉన్నవి అని భావించాలి కానీ, అవన్నీ మనవే అని మాత్రం అనుకోవద్దు. మనకొరకు ఉన్నవే కాని, అవి మనవి మాత్రం కావు. కావేకావు అని ఎప్పటికప్పుడు తనలో అహంకార – మమకారములు పాతుకొని పోకుండా జాగ్రత్త పడాలి. అట్టి సాధన కొనసాగించాలి అని పై వాక్యానికి సారాంశం.

భగవద్గీత, పన్నెండవ అధ్యాయంలో భక్తుని లక్షణాలు వివరిస్తూ – అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియోనరః (12–19) అనగా నివసించే స్థానములయందు అంటే ఇంటియందు మమతాసక్తులు లేనట్టి స్థిరబుద్ధి గల స్థిత ప్రజ్ఞుడు అగు భక్తుడు నాకు ఇష్టమైనవాడు అని భగవంతుడు వివరించినాడు.

నాది, నేను అని అనుకుంటూ లేని దుఃఖాన్ని మూట కట్టుకుంటున్నాం. ప్రారబ్ధానుసారంగా మళ్ళీ ప్రపంచంలోకి వచ్చాము. గత జన్మలో తరించ లేకపోయాము. కనుక మళ్ళీ జన్మించాము. జన్మించాము కనుక జనన మరణాలు తప్పవు. అయితే ఇప్పుడు ఉత్తమమైన మానవజన్మ లభించింది. తరించడానికి ఇదొక సువర్ణావకాశం లభించింది. సద్వినయోగ పరచుకోవడం బుద్ధిమంతుల లక్షణం. పుట్టిన ప్రతి వ్యక్తి సాధకుడే. కనుక లక్ష్యాన్ని చేరుకోవడానికి సాధన చేస్తే సాధ్యం కానిది లేదు. కావున సత్సంగం ద్వారా, సత్పురుషుల సహవాసం ద్వారా, సద్గ్రంథ పఠనం ద్వారా సాధనను సుగమం చేసుకొంటూ సాధ్యాన్ని సాధించాలి. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళాలి. అహంకార – మమకారాదుల నుండి విడిపడిపోవాలి అని సాధన పంచకంలోని మొదటి శ్లోకం చివరి వాక్యం ఉపదేశిస్తుంది.

## మాండుక్యోపనిషత్తు

ఏడులోకములతని యందే
ఏడు యంగములనగ నొప్పెను;
పదియు తొమ్మిది సూక్ష్మ తత్త్వము
లతని ఆననమందె నిలిచెను 9

సృష్టికార్యం బంతయును పర
మేశ్వరునికే ప్రథమ పాదము
స్థితియు గల్గియు బరగుచుండ – ద్వి
తీయ పాదమ్మదియె స్వప్నము 10

తైజసునకు ద్వితీయ పాదము
స్వప్నమనియే తెలియవలయును
స్థితికి కారణమైన అంతః
ప్రజ్ఞ యాతని యందె యుండును 11

ఏడు లోకములన్ని తత్త్వము
లతను దేహము నందు దాల్చియు
సృష్టినే పోషించు అంతః
ప్రజ్ఞ లోపల బ్రహ్మముండును 12

జీవునకు స్వప్నంబు వంటిది
బ్రహ్మమునకును సృష్టి పోషణ
స్థితిలో అల్ప ప్రళయములకును
తావు గలదని తెలియ వలయును 13

జీవకోటి ఘటించు కర్మల
ఫలితములు పరమాత్మ యొసగును
సుఖము దుఃఖము గలుగుచుండును
స్థితిగ దీనిని యెంచవలయును 14

బ్రహ్మమొకడే సృష్టి రచనకు
మరియు లోక స్థితికి హేతువు
కనుకనే స్థితి బ్రహ్మమునకును
స్వప్నదశగా చెప్పబడినది 15

గాఢ నిద్రనుజేరి మనుజుడు
కలలు గూడా కనక యుండును
అది సుషుప్తి; తృతీయపాదం
బనగ నొప్పును బ్రహ్మమునకును 16

**జక్కని వెంకటరాజం**
సిరిసిల్ల, ఫోన్ : 9440021734

# పద్యమనోహరం - 21


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు,

వరంగల్, ఫోన్ : 994 901 3448


**"జలజల పూలు రాలినటు, చల్లని మెల్లని పిల్ల తెమ్మరల్**
**తెలతెల వారి వీచినటు, తీయని కమ్మని పాలమీగడల్**
**తొలితొలి తోడునిచ్చినటు, తోరపు సిగ్గున ముగ్ధ కందొవల్**
**వలపులు జిమ్మినట్లు చెలువమ్మొలికించు భవత్కవిత్వముల్"**

నవ్యాంధ్ర కవిత్వ ప్రపంచంలో విస్తృత ఖ్యాతినందుకొని 'అభినవ పోతన'గా కీర్తినందుకొన్న శ్రీమాన్ వానమామలై వరదాచార్యులవారు రచించిన 'పోతన చరిత్రము' అనే పన్నెండు ఆశ్వాసాల పద్యకావ్యం లోని ఈ పద్యం కవిత్వమనేది ఉండవలసిన విధానాన్ని గురించి తెలియజేస్తూ ఉంది.

సందర్భం పోతన కవిత్వాన్ని గురించినదే కావచ్చు కాని అసలు కవిత్వమనేది "జలజలా పూలు రాలినట్లు, ఉదయమే మెల్లని పిల్ల తెమ్మెరలు వీచినట్లు, అప్పుడే తోడుకున్నపాలపై ఏర్పడ్డ మీగడల కమ్మని రుచివలె, ముగ్ధయైన కంటిజంట నుండి మిక్కిలి సిగ్గుతో వెలువడ్డ ప్రేమైక దృష్టులవలె" కవిత్వము విశేషమైన అనుభూతులను రసికులైన పాఠకులకు అందించగలగాలన్న భావనను తెలియజేస్తున్న ఈ పద్యభావన కవిత్వ సాధకులకు గొప్పగా మార్గదర్శనం చేస్తున్నది.


వానమామలై వరదాచార్యులవారు ఒక్క పోతన చరిత్ర రచనతోనే తమ సాహిత్య యాత్రను ఆపలేదు. పద్యము, గేయము, నాటకము వంటి అనేక సాహిత్య ప్రక్రియలలో తమ సాహిత్య వ్యవసాయమును కొనసాగిస్తూనే వచ్చారు. వారి రచనా మాధుర్యం, వారి సామాజిక నిష్ఠ, వారి పాండిత్య ప్రతిభ మొదలైనవి స్పష్టంగా తెలుపుతున్న ఆహ్వానము, మణిమాల, పంచశతి, మాతృప్రేమ, జయధ్వజం వంటి రచనలు వారి సాహిత్య ప్రతిభా ప్రదర్శకాలు. సాధారణంగా చిరు రచనలతో తమ ప్రస్థానాన్ని ప్రారంభించి, చివరకు మహాకావ్యాలతో ముగించడమనే విషయం మనకు కవుల జీవితాల్లో కనిపిస్తుంది. కాని ఆచార్యులవారు మహాకావ్య నిర్మాణానంతరమే లఘుకృతులు సంతరించి తెలుగుభాషాయోషను అలంకరించడం విశేషం.

తమ 15 సంవత్సరాల ప్రాయంలో సుమారు 400 పాదాలున్న గీతమాలికతో ప్రారంభమైన వారి సాహితీ ప్రస్థానం అవిచ్ఛిన్నంగా కొనసాగి అనేక కృతుల్ని తెలుగువారికి అందించింది. విప్రలబ్ధ, జయధ్వజం వంటి గేయ సంపుటులు, వైశాలిని వంటి నాటకం, రైతుబిడ్డ వంటి బుఱ్ఱకథలు, సూక్తి వైజయంతి వంటి పలురచనలు వెలువడి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. అత్యంత ఆధునిక ప్రక్రియయైన వచన కవితారంగంలోనూ వారి కలం విజృంభించి సంఘ సంస్కరణ, శాంతిసాధన, దీన జనాభ్యుదయం వంటి ఉత్తమ లక్ష్యాలతో స్నేహశక్తి, రాజ్యశ్రీ, నాగార్జున సాగరం వంటి రచనలు తెలుగు సాహితీ ప్రపంచానికి అందించింది. గొల్లసుద్దులు, వంటి రచన జానపద కళారూపాలపై వారికున్న మక్కువను సూచిస్తుంది.

నవ్య సంప్రదాయ కవిత్వ రీతుల్లో తలమానికంగా నిలబడే రచనలైన శివభారతము, రాణా ప్రతాపచరిత్రము, ఆంధ్రపురాణము, రామాయణ కల్పవృక్షము మొదలైన రచనలతో సమానంగా మానమామలై వారి పోతన చరిత్రము కేవలం ఒక కవి చరిత్రనే గాక, కవిత్వ ధర్మాలకు నెలవైన రచనగా నిలిచిపోయింది. సందర్భం వచ్చినప్పుడంతా ఈ గ్రంథంలో ఆచార్యులవారు కవిత్వ లక్షణాల్ని గురించి, కవిత్వ ప్రయోజనాన్ని గుచించి, అది కలిగించే హృద్యమైన అనుభూతులను గురించి చెప్పే ప్రయత్నం ఒక లక్షణ శాస్త్రాన్ని అధ్యయనం చేసినట్లనిపిస్తుంది. అయితే శాస్త్రాల్లో చెప్పిన తీరులో గాక చెప్పాలనుకున్న విషయానికి కవిత్వ పరిమళాన్ని అద్ది చెప్పడం సహృదయులైన పాఠకుల హృదయంలో ముద్రవేసే విధంగా రచించడం వానమామలైవారి ప్రత్యేకత. చెప్పిన కావ్యమంతా ఒక మధుర కవి జీవితం గనుక, మధురమైన కవితారీతులను గురించి చెప్పగలిగే సందర్భాలు రావడం తప్పదు. దాన్ని శ్రీమాన్ వానమామలై వరదాచార్యుల వారు ఉపయోగించుకొని ఇటువంటి మనోహరమైన పద్యరత్నాలను అందించి అలరించారు.




# శిలాక్షరం




**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# వట్టికోట ఆళ్వారు స్వామి జీవితం - సాహిత్యం - సమగ్ర పరిశీలన

**గాదె చంద్రశేఖర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 814 256 0355

వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజలమనిషి. నివురుగప్పి నిప్పులా ఉన్న తెలంగాణ ప్రజలను తనకలంతో,గళంతో ఉగ్రూతలూగించిన గొప్ప దార్శనికుడు. తెలంగాణ రచయితల ఉద్యమంలోనూ, గ్రంథాలయోద్యమంలోనూ, దేశోద్ధారక గ్రంథమాల నెలకొల్పడంలోనూ ప్రముఖ పాత్ర వహించి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా నిజాం వ్యతిరేక సాయుధపోరాటంలో పాల్గొని ప్రజాపక్షాన నిలబడిన నిక్కార్సైన మట్టిమనిషి వట్టికోట ఆళ్వారుస్వామి. క్విట్ ఇండియా ఉద్యమం మొదలు నిజాంవ్యతిరేక పోరాటం వరకు నాలుగైదు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి తెలంగాణ కోసం పోరాడిన ప్రజలమనిషి వట్టికోట ఆళ్వారుస్వామి.

వట్టికోట ఆళ్వారుస్వామి నల్లగొండ జిల్లాలోని, నకిరెకల్‌కి సమీపాన గల శాలిగౌరారంమండలంలోని చెరువుమాధారం అనే గ్రామంలో 01 నవంబర్ 1915(రాక్షస నామ) సంవత్సరమున సింహాద్రమ్మ, రామచంద్రాచార్యుల దంపతులకు జన్మించాడు. వట్టికోట ఆళ్వారు స్వామి పుట్టేనాటికి తెలంగాణ మొత్తం కూడా నిజాం నవాబు ఏలుబడిలో సాగుతున్నది. ప్రజలంతా కూడా బానిసత్వంలో మగ్గుతున్న తరుణమది. తెలంగాణ ప్రజానీకం మొత్తం భాష స్వేచ్ఛ లేక, మత స్వేచ్ఛ లేక, మాతృభాషలో చదువుకునే స్వేచ్ఛలేక అల్లాడుతున్న కాలమది. అలాంటి కాలం బాల్యంలోనే వట్టికోట ఆళ్వారుస్వామిపై చెరగని ముద్రవేసింది. తన విద్యాభ్యాసం అంతా ఉర్దూ మీడియంలోనే జరిగింది. బాల్యంలో పాఠశాలలో ఎదురైన సంఘటనలు,నిత్యం సమాజంలో జరుగుతున్న , ఎదురవుతున్న కఠిన వాస్తవ పరిస్థితులు వట్టికోట ఆళ్వారుస్వామిని ఎంతో కలవరపాటుకు గురిచేశాయి. ఈ విపత్కర పరిణామాల నుండి, తెలంగాణ ప్రజలను చైతన్యవంతులుగా చేయడం కోసం తన చుట్టూ ఉన్న ప్రజలతో మమేకం అయి వారి కష్టాలను, బాధలను తొలగించాలనే దృఢ సంకల్పాన్ని ఏర్పరుచుకున్నాడు. దానికి పరిష్కార రూపంగా అప్పుడే పురుడు పోసుకుంటున్న ప్రజాఉద్యమంలో చేరి వారితో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకొని కార్యకర్తగా రూపొంది పరిణామ క్రమంలో గొప్ప ఉద్యమ నాయకుడిగా విరాజిల్లాడు.

ప్రజలను బానిసత్వం నుండి దూరంచేసి వారికి విముక్తిని ప్రసాదించుటకై తన కలాన్నే ఆయుధంగా చేసుకొని పోరాడి, తన గళాన్నే ఉద్యమ బావుటాగా ఎగరవేశాడు. ఆ విధంగా స్టేట్‌కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలతో సంబంధాలు ఏర్పరుచుకొని ఉద్యమాన్ని కొనసాగించాడు.



**అధ్యాయం2 – తెలంగాణలో నిజాం వ్యతిరేక పోరాటం :**

ఈ అధ్యాయంలో నిజాం కాలం నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో వివరించాను. వట్టికోట ఆళ్వారుస్వామి పుట్టేనాటికి తెలంగాణలో దారుణమైన వివక్ష, దోపిడి, పీడన కొనసాగుతున్న కాలమది. నిజాం నవాబు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతున్న తరుణమది. అట్లా నిజాం వ్యతిరేకత ప్రజలలో ఒక ఎదురు తిరగే నేపథ్యాన్ని సమకూర్చింది. నిజాం రాష్ట్రంలో ప్రజా చైతన్యం ఎలా విలాసిల్లిందో ఈ అధ్యాయంలో పొందుపరిచాను. ఆంధ్రజనసంఘం ఆవిర్భావంతో భాష స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం ప్రజలంతా ఉద్యమించి ఆంధ్రమహాసభను ఏర్పాటు చేసుకున్నారు.ఈ ఆంధ్రమహాసభ అందించిన అండదండలతో అతి కొద్దికాలంలోనే నిజాం వ్యతిరేక పోరాటం రూపొందింది. అలా తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం రూపొందడానికి గల అంశాలను ఇందులో చర్చించాను. మొత్తంగా తెలంగాణలో నిజాం వ్యతిరేకపోరాటం ఎట్లా కొనసాగింది. నేపథ్యం ఎట్లా మొదలయ్యింది. ఆకాలంనాటి మత, రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు ఎట్లా ఉన్నాయి. దానికి బుద్ధిజీవులు, మేధావులు, కవులు, కళాకారులు, సామాన్య ప్రజలు ఏ విధంగా ప్రతిఘటించారు అనే అంశాలను ఇందులో చర్చించాను.

**అధ్యాయం 3 – వట్టికోట ఆళ్వారుస్వామి ఉద్యమజీవితం :**

వట్టికోట ఆళ్వారుస్వామి మొదటి నుండి కూడా పేదల పక్షపాతి. వారికే జరిగే అన్యాయాల పై ఎంతటి ఉద్యమానికైనా వెరవకుండా ముందుండి నడిపేవాడు . స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమం, ఆంధ్రమహాసభ కార్యకలాపాలు ఆయన సమర్ధవంతంగా నిర్వహించాడు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ధైర్యంగా జైలుకెళ్ళాడు. వట్టికోట ఆళ్వారుస్వామిపై తొలినాళ్ళలో ఆర్యసమాజం ప్రభావం ఎక్కువగానే ఉంది. అటు తరువాత తెలంగాణలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకి ఆకర్షితుడయ్యి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత వట్టికోట ఆళ్వారుస్వామికి అట్టడుగు వర్గాలవారి కోసం పనిచేయాలనే ఒక ఉన్నతమైన మానవీయ విలువను కలిగించాయి. అప్పటినుండి వీరి ప్రభావంతో ప్రజా ఉద్యమాల్లోకి ప్రవేశించాడు. ఈ ఉద్యమాల చైతన్యంతోనే ఎన్నో సంఘాలను, సంస్థలను స్థాపించాడు. వివిధ దుకాణాల్లో పనిచేసే గుమస్తాలకు వారానికో సెలవు దినాన్ని ప్రకటించే విధంగా ఉద్యమాన్ని నడిపాడు. గుమస్తాలపై యజమాన్య అధికారాన్ని తొలగించాడు. పత్రికసేవలో కూడా పాలుపంచుకున్నాడు. దానిలో భాగంగానే గుమాస్తాల కోసం “గుమస్తా” అనే పత్రికను స్థాపించాడు. ఇంకా మరెన్నో పత్రిక సేవలో పాల్గోన్న అంశాల గురించి ఈ అధ్యాయంలో చర్చించాను.

వట్టికోట ఆళ్వారుస్వామి స్థాపించిన సంఘాలలో ముఖ్యమైనది దేశోద్ధారక గ్రంథమాల. ఈ దేశోద్ధారక గ్రంథమాలను 1938లో స్థాపించాడు. కాశీనాథుని నాగేశ్వరరావు పేరిట ఈ గ్రంథమాలను స్థాపించాడు. ఆ కాలంలో అప్పటికే నెలకొని ఉన్న గ్రంథమాలల గురించి నేటికి వాటి విశిష్టత గురించి ఈ అధ్యాయంలో చర్చించాను.

**అధ్యాయం 4 – వట్టికోట ఆళ్వారుస్వామి సాహిత్యంలో ప్రజాదృక్పథం – వస్తువైవిధ్యం :**

వట్టికోట ఆళ్వారుస్వామి కమ్యూనిస్టు పార్టీకి దగ్గరయ్యాక ప్రజా దృక్పథం అలవడింది అని చెప్పవచ్చు. సమసమాజం కోసం సంకెళ్ళు తెంచుకోవాలనే ఒక సదుద్దేశం ఏర్పడింది. ఇలా తెలంగాణలో బానిసత్వంలో మగ్గుతున్న ప్రజలను ఏ విధంగా చైతన్యం చేయాలో ఆలోచిస్తూనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. దానిలో భాగంగానే ఎన్నో కథలు, నాటికలు, వ్యాసాలురచించాడు. వట్టికోట ఆళ్వారు స్వామి జైలుశిక్ష అనుభవిస్తున్న సమయంలో అక్కడ చూసిన సంఘటనలను ఆధారంగా చేసుకొని జైలులోపల అనే కథాసంపుటిని వెలువరించాడు. దానిలోమొత్తం 6 కథలు ఉన్నాయి. ఈ కథలకు సంబంధించిన ఇతివృత్తాలను, పాత్రచిత్రణను ఈ అధ్యాయంలో పొందుపరిచాను. ఇవేకాకుండా మరికొన్ని కథల ఇతివృత్తాలను కూడా చేర్చడం జరిగింది. అంతేకాకుండా ఆ కాలంలో జరిగిన సంఘటన లను నాటికలుగా మలిచిన వైనాన్ని తెలియజేశాను. పై ప్రక్రియల ద్వారా వట్టికోట ఆళ్వారుస్వామి నిత్యం ప్రజలతో సంబంధాలనుకలిగి ఉన్నాడు. పోరాటాలతో సంబంధాలను కలిగి ఉన్నాడు. నిత్యం పోరాటాలు నడుపుతూ తెలంగాణ ప్రజలను చైతన్య వంతులుగా చేయడంలో వట్టికోట చూపించిన తీరుతెన్నుల గురించిఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

**అధ్యాయం5 – వట్టికోట ఆళ్వారుస్వామి నవలలు–వస్తుశిల్ప వైవిధ్యం :**

ఈ అధ్యాయంలో వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన ప్రజలమనిషి కాలంనాటి సమకాలీనపరిస్థితుల గురించి ప్రజలమనిషి నవల ఎందుకు రూపొందింది. ఆ కాలం నాటి పోరాటాలు ఎలా ఉన్నాయి. ఈ నవలకు ఇతివృత్తం ఏంటి వంటి అంశాల గురించి ఈ అధ్యాయంలో చర్చించాను. ఈ నవల వస్తువు అయిన భూమి సమస్య గురించి, ఆ కాలంలో దొరల ఆగడాల గురించి, దొరలకు ప్రజలు ఎదురుతిరిగిన సన్నివేశాల గురించి, అట్టడుగు వర్గాల ప్రజలు తమ భూములను దొరల నుండి ఏ విధంగా స్వాధీనం చేసుకున్నారు అనే అంశాల గురించి ఈ అధ్యాయంలో పేర్కొన్నాను. వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన మరో నవల గంగు. ఈ నవలలోని పాత్రచిత్రణ గురించి, స్త్రీలు చేసిన తిరుగుబాటు గురించి, ఈ నవల అసంపూర్తి అనడానికిగల కారణాల గురించి విశ్లేషించాను. ఇట్లా ఈ ఐదు అధ్యాయాలు వట్టికోట ఆళ్వారుస్వామి సాహిత్యాన్ని నాకు తెలిసినంతలో పరిమితంగానైనా చర్చించాను.

**ముగింపు :** ప్రజలకోసం పాటుపడిన వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజలమనిషిగా ఎదిగాడు. జీవించినది కొద్దికాలమే అయినప్పటికీ తన జీవితానుభవాలకు, సామాజిక దృక్పథానికి ప్రజాజీవితాలకు అక్షరరూపం కల్పించిన వారిగా చెప్పవచ్చును. నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వేచ్ఛకోసం, భుక్తికోసం విద్యావికాసం కోసం పోరాడిన వీర తెలంగాణ ఉత్తములలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒకరు. ఈయన 05 ఫిబ్రవరి 1961 (ప్లవ నామ) సంవత్సరంలో డిఫ్తీరియా వ్యాధితో చనిపోయినప్పటికీ తన రచన లతో, అతడు ప్రజలలో కలిగించిన స్ఫూర్తితో నిత్యం ప్రజలగుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటాడు.



మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# తెలుగు సాహిత్యంలో తెలంగాణ సంస్కృతి

**వై. సత్యనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 934 722 5379

**"తెలుగు సాహిత్యంలో తెలంగాణాసంస్కృతి"** అనే శీర్షిక ఇంగ్లీషు లోని "Telangana Culture inTelugu Literature" అనే దానికి సమానార్థకం. Telangana అనే శబ్దం ప్రాంతాన్ని తెలుపుతుంది. Culture అనే పదానికి సంస్కృతి అని అర్థం. ఈ పరిశోధన వ్యాసంలో తెలుగు సాహిత్యంలోని తెలంగాణ, సంస్కృతి ప్రత్యేకతను చర్చించడమే ముఖ్య ఉద్దేశం. 'తెలంగాణ' అంటే ప్రాంత ఉనికి, తెలంగాణ ప్రాంత స్పృహ వివరించడం. 'సంస్కృతి' అంటే జీవన సంస్కృతి, భాష సంస్కృతిని పరిశీలించడమే. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక అస్తిత్వం ఉంది. తెలంగాణ సంస్కృతిలో జీవన వైవిధ్యం ఉంది.

**'తెలుగు సాహిత్యంలో తెలంగాణాసంస్కృతి'** అంశాన్ని 8 అధ్యాయాలుగా విభజించుకున్నాను.

**తెలంగాణాసంస్కృతి – మొదటి అధ్యాయంలో** తెలంగాణ ప్రాంత భౌగోళిక నదులు, ఖనిజాలు, పంటలు పేర్కొన్నాను. తెలంగాణలోని రాజకీయ నాయకులు ప్రత్యేకరాష్ట్ర ఏర్పాటుకు చేసిన కృషిని వివరించాను. సాంస్కృతిక, చారిత్రక నిర్మాణాలలోని ప్రత్యేక విషయాలు, తెలంగాణ భాషా వైవిధ్యాన్ని చూపించాను. తెలంగాణలో వచ్చిన వివిధ ఉద్యమ ప్రభావాలను చర్చించాను. తెలంగాణా ఆంధ్రోద్యమంలోని సాంస్కృతిక విషయాలు, తెలంగాణ ఉద్యమ సందర్భంలో స్పందించిన కవిగాయకుల గురించి పేర్కొన్నాను. ప్రత్యేక తెలంగాణోద్యమం నేపథ్యాన్ని వివరించాను. తెలంగాణోద్యమంలో విద్యార్థులూ, ఉద్యోగులూ, ప్రజలూ, పత్రికలూ ప్రసార సాధనాల పాత్రను వివరించాను.

ఇక సంస్కృతి అంటే ఏమిటి? సంస్కృతి లక్షణాలు, సంస్కృతి నిర్వచనాలను పేర్కొన్నాను. సింధు సంస్కృతి, వైదిక సంస్కృతి, ఇతిహాస సంస్కృతి వంటి వివిధ కాలాల సంస్కృతిని తెలిపాను. భారతీయ మత సంస్కృతిలో భాగంగా హిందు సంస్కృతి, జైన సంస్కృతి, బౌద్ధ సంస్కృతి, క్రైస్తవ సంస్కృతి, ఇస్లాం సంస్కృతి, సిక్కు మతం వంటి సంస్కృతి ప్రత్యేకతలు చెప్పాను. సంస్కృతితో అనుబంధమైన సంస్కృతి – చరిత్ర, నాగరికత వంటి విషయాలను పోల్చాను. భారతీయ సంస్కృతి – పాశ్చాత్య ప్రభావం, తెలంగాణ ప్రాంత వైవిధ్యంలో జాతరలు, భాషా, గ్రామీణ, నగర సంస్కృతి ప్రత్యేకతలు చర్చించాను.

**రెండవ అధ్యాయం తెలంగాణ సాహిత్య నేపథ్యంలో** తెలంగాణను పాలించిన రాజవంశాల కాలంలోనిసాహిత్య పోషణ వివరించాను. అంటే శాతవాహనుల కాలం నుంచి అసఫ్ జాహీల వరకు సాహిత్య నేపథ్యం పేర్కొన్నాను. సంస్థానాలు సాహిత్యం పోషించిన తీరు చర్చించాను. శాసనాలలో లభించిన సాహిత్య ఆధారాలను చెప్పాను. తెలంగాణ ప్రాంతం నుంచి వెలువడిన తొలి రచనలు, వైవిధ్య రచనల గురించి తెలిపాను.

తెలంగాణ ప్రాంతంలో పత్రికలు చేసిన సాహిత్య సేవను పేర్కొని, తెలంగాణ ప్రాంతంలో సాహిత్య సంస్థలు చేస్తున్న వైవిధ్య సాహిత్య సేవను వివరించాను. ఆనాటి సాహిత్య సంస్థల నుంచి ఈనాటి **'మూసీ సాహిత్య ధార'** వరకు విశ్లేషించాను. తెలంగాణలో తొలినాళ్లలో ఏర్పడిన గ్రంథాలయాల నుంచి నేటివరకు వాటి సేవను చర్చించాను. సాహిత్యం వివిధ అంశాలతో గల అనుబంధాన్ని తెలిపాను.

ప్రాచీన సాహిత్యంలో– కాకతీయుల కాలం నాటి రచనలలో పాల్కురికి సోమనాథుని కావ్యాలు భాషా సాంస్కృతిక, రంగనాథ, భాస్కర రామాయణంలోని జీవన శైలిని స్పృశించాను. పద్మనాయకుల నాటి పోతన భాగవతం, కొరవిగోపరాజు 'సింహాస ద్వాత్రింశిక'లోని సాంఘిక, సాంస్కృతిక విషయాలను చర్చించాను. కుతుబ్ షాహీల కాలం నాటి చిత్రభారతం, అచ్చ తెలుగు కావ్యం యయాతి చరిత్ర, ప్రతాప చరిత్ర–సిద్దేశ్వర చరిత్ర, అసఫ్‌జాహీలు–సంస్థానాల కాలం నాటి వైవిధ్య కావ్యాల విషయాలను **మూడవ అధ్యాయం ప్రాచీన సాహిత్యం–తెలంగాణ స్పృహలో** వివరించాను.

**ఆధునిక కవిత్వం – తెలంగాణ అస్తిత్వం నాల్గవ అధ్యాయంలో** గంగిరెద్దు, కాపుబిడ్డ, రైతు రామాయణం, పోతనచరిత్రము వంటి తెలంగాణ ఆధునిక పద్య కావ్యాలలోని జీవన విధానాన్ని చిత్రణను చర్చించాను.

ప్రజా పోరాటం కవులు కాళోజీ, దాశరథి కవిత్వం విశ్లేషించాను. సి.నారాయణరెడ్డి 'ఋతుచక్రం' కావ్యంలోని గ్రామీణ వాతావరణాన్ని గురించి చర్చించాను. సాయుధ పోరాట సాహిత్యంలో భాగంగా సుద్దాల హనుమంతు, బండి యాదగిరి వంటి కవుల గీతాలను పేర్కొన్నాను.

అస్తిత్వం అంటే ఏమిటి? 2001 తర్వాత తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వంపై కవిత్వం గ్రామీణ జీవన అస్తిత్వం, సాంస్కృతిక అస్తిత్వం, నగర జీవన అస్తిత్వం, వనరుల అస్తిత్వం, చారిత్రక అస్తిత్వం, ఉద్యమ అస్తిత్వం వంటి విభాగాలుగా విశ్లేషించాను. తెలుగు సాహిత్యంలో గత పదిహేనేళ్లుగా ఈ వ్యక్తీకరణలు వివిధ రూపాల్లో బయటపడుతూనే వున్నాయి. జూలూరి గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువడిన 'పొక్కిలి' కవితా సంకలనం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు సంపాదకత్వంలో వెలువడిన 'మత్తడి' కవితా సంకలనం, కాంచనపల్లి

సంపాదకత్వంలో వెలువడిన 'మునుం' కవితా సంకలనాలు కర్ర ఎల్లారెడ్డి వెలువరిస్తున్న సుంకర రమేష్, అన్వర్ వెలువరించిన 'తెలంగాణ కవితావార్షిక 2006' స్థానీయతను భౌగోళిక, సాంస్కృతిక భాషాపరమైన విషయాలను వివరించిన ప్రాంతీయ అస్తిత్వ కవితా సంకలనాలను పేర్కొన్నాను.

**తెలంగాణ – దీర్ఘ కావ్యా (కవిత)లు** జలగీతం, దాలి వంటి వాటిని పరిశీలించాను. తెలంగాణ–గేయకవిత్వం చారిత్రక ప్రాంతీయ అస్తిత్వం, ప్రాంతీయ ఉద్యమ అస్తిత్వం గేయాలను చర్చించాను. సినిమా గీతాలలోని తెలంగాణ నుడికారం, సంస్కృతిని చర్చించాను.

తెలంగాణలో పద్యం తర్వాత గేయానిదే మొదటి స్థానం. దాశరథి, సి.నారాయణరెడ్డి వంటి కవులు గేయకవిత్వం రాశారు. సి.నారాయణ రెడ్డి 'కర్పూర వసంతరాయలు' 'నాగార్జున సాగరం' ఋతుచక్రం వంటి గేయకావ్యాలు రచించారు. దాశరథి, సినారె రేడియో మాధ్యమం కోసం లలిత గీతాలు రచించారు. తెలంగాణ జీవనాన్ని చిత్రించే గీతాలు రాయలేదు. తెలంగాణకు పాట సాంస్కృతిక వాహిక. ఆనందం కలిగినా, విచారం కలిగినా పాటవస్తుంది. మాట నడుస్తుంది. పాట (పరిగెత్తుతుంది) ఉరుకుతుంది. చారిత్రక ప్రాంతీయ అస్తిత్వం గీతాలలో ప్రాచీన చారిత్రక వైభవం, ప్రాంతీయ చారిత్రక వైభవం, తెలంగాణ పల్లె సంస్కృతి, తెలంగాణ గత సంస్కృతి వైభవం, తెలంగాణ ప్రాంతీయ ఉనికి వంటి అంశాలను పేర్కొన్నాను.

ప్రాంతీయ ఉద్యమ అస్తిత్వం, ఉద్యమ మేలుకొలుపు, తెలంగాణ ఉద్యమ పిలుపు, తెలంగాణ ఉద్యమ సంస్కృతి, తెలంగాణ ఉద్యమ కేకలు, విముక్తి చెందిన తెలంగాణ వంటి అంశాలను చర్చించాను.

**లఘు కవితా రూపాలలో తెలంగాణ** అనే అంశంలో భాగంగా మినీ కవిత్వం, హైకూలు, నానీలను చర్చించాను. తెలంగాణేతర కవిత్వం త్వమేవాహమ్, ఉదయని, సంఘర్షణ, వజ్రాయుధం, అడవి, భువనఘోష,తెలంగాణ సంఘీభావ కవిత్వరాకావడి కుండలు పరిశీలించాను.

**"జీవితం నవల లాంటిది. నవల జీవితం వంటిది"** అని ఇల్యా ఎహ్రెన్ బర్గ్ పెర్కొన్నారు. ఒక జాతి సంస్కృతిని తెలుసుకోవటానికి మంచి సాధనం నవల. నవలలను పరిశీలిస్తే జాతి చరిత్ర, సంస్కృతి వివరంగా తెలుస్తాయి. ప్రజల జీవన గమనం, సమాజ ప్రజల ఆలోచనలోని మార్పులు, సామాజిక సంఘటనలు సాహిత్యానికి అద్దం పడుతాయి. తెలుగులో నవలా రచనా 1872లో ప్రారంభమైంది.

తెలుగు నవలపై ప్రధానంగా బెంగాలీ, ఇంగ్లీషు ప్రభావముంది. బెంగాలీ సాహితీ వేత్తలు రమేశ్ చంద్ర, బంకించంద్ర, శరత్ చంద్ర, రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రభావం ఎక్కువ. బంకించంద్ర రచించిన కపాలకుండల, ఆనందమఠం, దుర్గేశనందిని నవలలు తెలుగులోకి అనువాదమయ్యాయి. తెలంగాణ నుంచి మొట్ట మొదట "హితబోధిని" అనే స్వతంత్ర పత్రికను నడిపిన బండారు శ్రీనివాసరావు 1910లో 'ఆశాదోషం' అనే నవలను రచించారు. శేషభట్టరు వేంకట రామానుజా చార్యులు రచించిన 'ప్రాకృత దాంపత్యము' అనే నవల నల్లగొండలోని ఉస్మానియా ముద్రణాలయంలో ప్రచురించబడింది.

ఒద్దిరాజు సోదరులలో సీతారామచంద్రరావు 'రుద్రమదేవి' అనే చారిత్రక నవలను 1918లో రచించారు. ఒద్దిరాజు రాఘవ రంగారావు 'వీరావేశం' చారిత్రక నవల రచించారు. ఒద్దిరాజు సోదరుల నవలకు కొనసాగింపుగా నోరినరసింహాశాస్త్రి రుద్రమదేవి, తిక్కనసోమయాజి వంటి చారిత్రక నవలలు రచించారు. సురవరం ప్రతాపరెడ్డి 'ఆరె వీరులు' 1932లో రాశాడు. ఇది సంస్థానాధీశుని కథ. బిరుదురాజు రామరాజు 'తెలుగు వీరుడు' పావన్నపేట సంస్థానాధీశుడు సదాశివరాయలు కథ.

ఉద్యమస్ఫూర్తితో వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన మొట్టమొదటి నవల 'ప్రజలమనిషి' అసంపూర్ణమైన 'గంగు' రెండవ నవల. ఆ తర్వాత ఆళ్వారుస్వామి వారసత్వాన్ని కొనసాగిస్తూ దాశరథి రంగాచార్య రచించిన 'చిల్లరదేవుళ్లు', 'మోదుగుపూలు', 'జనపదం', 'మాయ జలతారు' సాయుధ పోరాటాల స్ఫూర్తితో ముదిగంటి సుజాతరెడ్డి 'మలుపు తిరిగిన రథచక్రాలు' విమోచనోద్యమ నవలలు.

కార్మిక ఉద్యమ నవలలో ఆకులతో బీడిలుచుట్టి కట్టలు కట్టి ఫ్యాక్టరీలో బ్రోకర్లకిచ్చే కొద్దిపాటి కూలీలతో బతికే కార్మికుల స్థితిని "బతుకుపోరు" నవలలో వర్ణించారు. బి.ఎస్.రాములు ఈ నవలను 1982లో రచించారు. 1987లో ఎస్.ఆర్.పవన్ కుమార్ రచించిన 'నల్ల వజ్రం' గని కార్మికుల బతుకు కడగండ్లను వ్యక్తం చేసిన మొట్ట మొదటి నవల. బోయి జంగయ్య 'జాతర', వేముల ఎల్లయ్య 'కక్క', 'సిద్ధి', భూతం ముత్యాలు 'సూర', 'పురుడు' వంటివి పేర్కొనదగిన దళిత జీవన చిత్రణ నవలలు. 1960–1999 వరకు పల్లెటూళ్లలో వచ్చిన మార్పులను చిత్రించారు ఈ నవలలో. వానసీరు, చెరువు నీటితోనే వ్యవసాయం ఆ ఊరులోకాపు కులానికి పేద రైతు లసుమయ్య బతుకులో వెలుగు నీడలు చిత్రణే నవల ప్రధాన అంశం.

తెలంగాణ నవలా కుల వృత్తులలో భాగంగా పద్మశాలీల కులవృత్తిని గురించి, చేనేత కార్మికుల కష్టాలను,కడగండ్లను వివరించిన నవల కాలువ మల్లయ్య 'గువ్వలచెన్నా'. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించి పోతున్న కులవృత్తి చేనేత వృత్తి. చేనేత కార్మికుల కష్టాలను నవల రూపంలో చిత్రించాడు. సురవరం ప్రతాపరెడ్డి 'శుద్ధాంతకాంత' అనే నవలను హైదరాబాద్ జీవితంలో భాగమైన రొమాన్స్‌ని ఇతివృత్తంగా తీసుకొని రాశాడు. 'రొమాన్స్ ఆఫ్ జెనానా' ఇందులో చిత్రించాడు. హైదరాబాద్ స్థానిక విషయాలను పి.లోకేశ్వర్ 'సలాం హైదరాబాద్' నవలలో బలంగా వ్యక్తీకరించారు.

తెలంగాణ నవలలా భాష, తెలంగాణేతరుల నవలలు ఇలాంటి నవలలోని జీవనాన్ని చర్చించాను. **ఐదవ అధ్యాయం తెలంగాణ నవలాజీవన వైవిధ్యం**లో పరిశీలించినాను.

**తెలంగాణ కథాజీవన చిత్రణ ఆరవ అధ్యాయంలో** తెలంగాణ ప్రాంతం నుంచి భండారు అచ్చమాంబ 1902లో గురజాడ కంటె ముందే 'స్త్రీవిద్య', 'ధనత్రయోదశి' కథలు రాశారు. మాడపాటి హనుమంతరావు 1912లో రచించిన "హృదయశల్యం" మొట్ట మొదటి కథానిక గుర్తిస్తే, తెలంగాణ కథకుల్లోమొదటి కథకుడవుతాడు. అచ్చమాంబను తెలంగాణతోని అనుబంధాన్ని ఆసరా చేసుకొని ఆమెను తెలంగాణరచయిత్రిగా ఆమె తెలంగాణ కథకు ఆద్యురాలవుతుంది.

తెలంగాణ కథ ఆలస్యంగా ప్రారంభమైనా జనజీవనాన్ని చిత్రించడంలో మొదటి స్థానంలో ఉంది. కథా సాహిత్యంలోతెలంగాణ కథ పాత్ర ప్రముఖమైంది. తెలంగాణ కథలో ఎంతో వస్తు వైవిధ్యం ఉంది. తెలంగాణ కథకులు సమకాలీన ప్రాంతీయ సమస్యలను వారి కథల్లో ప్రతిఫలింపజేశారు. నైజాం పరిపాలన నుంచి నేటి వరకు ప్రజలు ఎదుర్కొన్న ఎన్నో సమస్యలు తెలంగాణ కథల్లో చిత్రించబడ్డాయి.

తెలంగాణ కథను తొలితరం, మలితరం మూడవతరం, సమకాలీన అని నాలుగు భాగాలుగా విభజించాను. నిజాం కాలంనాటి తెలంగాణ బతుకుల్ని, వెతల్ని, సంస్కృతీ సంప్రదాయాలను చిత్రిస్తూ సురవరం ప్రతాపరెడ్డి 'గ్యారా కద్దు బారా కొత్వాల్' కాంచనపల్లి చిన వెంకటరామారావు 'చెరువొడ్డున' భాస్కరభట్ల కృష్ణారావు 'ఇజ్జత్' జి.సురమౌళి "ముక్కోటి బలగమోయి" పి.వి.నరసింహారావు 'గొల్లరామవ్వ' వంటి కథలను రాశారు.

తెలంగాణా కథల్లో ప్రధాన ఇతివృత్తం ప్రాంతీయ అస్తిత్వం. ఇతర ప్రాంతాలలో రచయితల్లో కనిపించని ప్రాంతీయ అభిమానం తెలంగాణ వారిలో కనిపిస్తుంది. మట్టి మీద, సంస్కృతి మీద, జీవన విధానం మీద రచయితలకు అభిమానం ఎక్కువ. ప్రాంతీయ స్పృహతో, తెలంగాణ మాండలిక భాషతో కథలు ఎన్నో వచ్చాయి.

వట్టికోట ఆళ్వారుస్వామి, పొట్లపల్లి రామారావు, గూడూరి సీతారాం, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, కాలువ మల్లయ్య, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, ఆడెపు లక్ష్మీపతి కథలను, తెలంగాణ కథల్లో భాష విశ్లేషించాను.

నాటకం ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన దృశ్య ప్రక్రియ. జీవిత సంఘర్షణను, మానవ సంబంధాలను, వాచిక, అభినయ భావవిన్యాసాల ద్వారా అభివ్యక్తి చేసేసమిష్టి కళారూపం నాటకం. తెలంగాణ సాంప్రదాయక ప్రజా ప్రదర్శన రూపాలకు ఎంతో ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పూర్వ కాలం నుంచి కళా ప్రదర్శనలుండేవి. తెలంగాణ పాలకులు అందరూ కళలను ప్రోత్సహించినారు.

తెలంగాణలో వచ్చిన అనేక ఉద్యమాలపై నాటక ప్రభావం ఉంది. నాటి ప్రాచీన సాహిత్యం నుంచి నేటి ఆధునిక సాహిత్యం వరకు ఎన్నో నాటకాలు తెలంగాణలో రచించబడ్డాయి. మొట్టమొదట పౌరాణిక, చారిత్రక నాటకాలు వెలువడ్డాయి. ఆ తర్వాత ఉద్యమ భావాలతో కూడిన నాటకాలు వచ్చాయి. సాంఘిక నాటకాలు వచ్చాయి. సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతికోద్యమాలలో నాటకం క్రియాశీలక పాత్ర పోషించింది. తెలంగాణలో నాటక రచన సంస్థానాల కాలం నాటి నుంచే ఆవిర్భవించింది.

ఇతివృత్తం నాటకానికి ప్రాణం. ఇతివృత్తం ఆధారంగా పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాలు వర్గీకరించవచ్చును. వైవిధ్యం రీత్యా నాటకాలను ప్రయోగాత్మకాలు, నృత్య రూపకాలు, జానపద రూపకాలు, వీధి నాటకాలుగా చారిత్రక, సాంఘిక నాటకాలను విభజించవచ్చునని **ఏడవ అధ్యాయం తెలంగాణ నాటకం – ప్రాంతీయ ఉనికిలో** వివరించాను.

దాసరుల నాటకాలు, తెలంగాణ నాటక ప్రదర్శనలు, తెలంగాణ నాటకం – వైవిధ్యం, చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలు, శేషాద్రి రమణ కవులు, ఒద్దిరాజు సోదరులు, పొట్లపల్లి రామారావు, పి.వి.రమణ నాటకాలను మరియు తెలంగాణేతర నాటకాలు తెలంగాణ పోరాట నాటకంలో పోతుగడ్డ, గెరిల్లా నాటకాలు పేరు పొందాయి. తెలంగాణ పోరాట స్ఫూర్తితో న్యాయం, సరబరాహి, పగ, వీరకుంకుమ, కాంగ్రెసా–ఆంగ్రేజా, శాంతిరక్షణ కోసం, రిపబ్లిక్ వెలసింది, వీరనారి 'పోతుగడ్డ' నాటికను వాసిరెడ్డి భాస్కరరావు 1953లో రచించారు.

**స్వీయ'చరిత్ర'లా తెలంగాణ సోయి ఎనిమిదవ అధ్యాయంలో** ఒక వ్యక్తి తన గురించి తాను రాసుకుంటే స్వీయ చరిత్ర. ఒక ప్రముఖ వ్యక్తి గురించి మరొకరు రాస్తే జీవిత చరిత్ర అని వ్యవహారంలో ఉంది.

చరిత్రల ద్వారా ప్రాంతీయ విషయాలు, మరుగున పడిన వ్యక్తుల జీవిత విశేషాలు తెలుస్తాయి. అంతేకాక ఆ కాలంనాటి ఆచార వ్యవహారాలు కూడా తెలుస్తాయి. యాత్ర చరిత్ర ఒక ప్రాంత చరిత్రను తెలిపితే, స్వీయ చరిత్ర ఒక వ్యక్తి జీవిత యాత్రను తెలుపుతుంది. ఈ కోణంలో వీటిని పరిశీలించదలచాను.

తెలంగాణ స్వీయ (జీవిత) చరిత్రలలో భాగంగా దేవులపల్లి రామానుజరావు "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు", గడియారం రామకృష్ణశర్మ 'శతపత్రం', దాశరథి కృష్ణమాచార్య ఆత్మకథ 'యాత్రాస్మృతి', సామల సదాశివ 'యాది', దాశరథి రంగాచార్య 'జీవనయానం', ఈ ప్రాంత సాంఘిక సాంస్కృతిక పరిస్థితులను చిత్రించాయి. పాత్రికేయుల – స్వీయ చరిత్రలు (జి.కృష్ణ), సమరయోధుల – స్వీయ చరిత్రలు, తెలంగాణేతరుల – స్వీయ చరిత్రలు, తెలంగాణ – సాహిత్య చరిత్రలు, తెలంగాణేతర–సాహిత్య చరిత్రలు, తెలంగాణ–చరిత్రలు, తెలంగాణేతరుల–చరిత్రలలోని తెలంగాణ ప్రాంత సంస్కృతి ప్రస్తావన తెలిపాను.

**'తెలుగు సాహిత్యంలో తెలంగాణాసంస్కృతి'** అంశంలోని 8 అధ్యాయాలను ప్రక్రియా, కాల పరంగా ఈ విధంగా విశ్లేషించే ప్రయత్నం చేశాను.

# ఇందూరు గడ్డపై తొలి క్షేత్ర మాహాత్మ్య కావ్యం

# “శ్రీమన్నింబాచల మాహాత్మ్యం”

**మేకల రామస్వామి,** ఫోన్ : 8500 400 150

ఇందూరుజిల్లాలో వెలసిన నారసింహ సాహిత్యంలో తొలి క్షేత్ర మహాత్మ కావ్యం “నంబి శ్రీధర్ రావు రచించిన “శ్రీమన్నింబాచల మహాత్మ్యం”. ఇది యావత్ తెలంగాణ సాహిత్యంలోనే ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. దీనిని ఇందూరు జిల్లా భీంగల్ వాసి, వృత్తిరీత్యా ఉపాధ్యాయులు, అనువంశికంగా ఆలయ పురోహితులైన నంబి శ్రీధర్ రావు రచించారు. వీరు జిల్లా సంప్రదాయ కవుల్లో ప్రముఖమైన ప్రౌఢ కవి. హృదయం నిండా భక్తి పారవశ్యం గల కవి. కవులు తమ కవితా నైపుణ్యం దిద్దుకొనడానికి మొదట శతక ప్రక్రియను ఆశ్రయిస్తుంటారు. కానీ ఈ కవి మొదట శ్రీమన్నింబాచల మహాత్మ్య కావ్యాన్ని మొదలు పెట్టినప్పటికీ, అది సంపూర్తి కాక ముందే ప్రసిద్ధమైన రెండు శతకాలు వెలువరించారు. **“శ్రీ మన్నింబగిరి నరసింహ శతకా”**న్ని 108 కంద పద్యాలతో **“నింబగిరి నరసింహ”** అనే మకుటంతో రచించారు. ఇది ఇందూరు జిల్లాలో కందపద్యాలతో వెలువడిన మొట్ట మొదటి వైష్ణవ శతకం.

శ్రీ నింబగిరికొండల్లో వెలసిన శ్రీలొంక రామేశ్వరస్వామి ప్రేరణతో **“శ్రీ లొంక రామేశ్వర శతకా”**న్ని శార్దూల, మత్తేభ వృత్తాలతో రచించారు. జిల్లా శతక రచనల్లో ఇదొక నూతన ఛందో ప్రయోగం. ప్రతి పద్యం భక్తి పూరితమై, మంచిపద్యధారకలిగి, ప్రాచీన కవుల శైలికి ఏమాత్రం తీసిపోకుండా సుందరంగా సాగుతుంది.

నంబి శ్రీధర్ రావు రచించిన “శ్రీమన్నింబాచల మాహాత్మ్యం” కావ్యానికి మూలం సుమారు నూరేళ్ళ క్రితమే సంస్కృతంలో బ్రహ్మ వైవర్త పురాణ అంతర్గతంగా రచించబడిన ‘‘నింబాచల క్షేత్ర మాహాత్మ్య” మని ‘కృతజ్ఞతాంజలి’లో కవే స్వయంగా పేర్కొన్నాడు.

దండాల వంశానికి చెందిన నరసింహుడను నతడు ఈ కావ్యాన్ని నూరేళ్ల క్రితమే సంస్కృతంలో రచించి, ముద్రింపజేశాడని, వేముగల్లు వాసి అయిన శ్రీ చౌడి గంగారామాచార్యులు ఈ స్థల పురాణ ముద్రిత ప్రతిని కవికి అందించాడని, తన అన్న నంబి లింబాద్రి సహకారంతో ఆ సంస్కృత ప్రతిని అర్థం చేసుకొని, 1961ప్రాంతంలో ఈ కావ్యరచనకు సంకల్పించినప్పటికీ, అది “శ్రీముఖపు మార్గశీర్షాది జెలగు తదియ/ బూర్తియయ్యె నీశక్తితో బూర్ణ పురుష” అనగా 16/12/1993 నాటికి కావ్యరచన పూర్తయిందని, సుమారు 40 ఏళ్ల కాలం పట్టిందని కవి చెప్పుకున్నాడు. అయినను ముద్రణకు నోచుకోక చాలాకాలం మరుగుననే ఉండిపోయింది. కవి పండితులలో మాత్రం ఈ కావ్య సంబంధిత అంశాలు, బహుళ ప్రచారం పొంది, కవికి తగినంత ప్రశస్తిని, రచనా కాలం నుంచే ప్రసిద్ధిని తెచ్చిపెట్టాయి. ఇటీవలే ముద్రణకు నోచుకుంది. కవికి గురు సమానులైన శ్రీ దోర్భల విశ్వనాథ శర్మ ఈ కావ్యానికి ‘‘సింహావలోకనం” పేరుతో ముందుమాటను అందించారు. శ్రీ వానమామలై వరదాచార్యులు దోమకొండ జనతా కళాశాలలో అధ్యాపకత్వం చేస్తున్న సందర్భంలోనే “పోతన చరిత్రము” రాస్తూ, చేసిన కావ్య గానాలు ఈ కవి కావ్య రచనకు ప్రేరణనిచ్చాయి.

నాటి ‘‘వేముగల్లు” అనే గ్రామం పేరునే పండితులు సంస్కృతీకరించి “నింబాచలం” అని పిలుస్తున్నారు. ఈ ప్రదేశంలో దట్టమైన వేపచెట్లు ఉన్న కారణంగా ఈ నామం ఏర్పడిందని చెప్తుంటారు. ఈ వేముగల్లే ప్రస్తుతం ‘భీంగల్’గా పిలువబడుతుంది. (వభయోరభేద:) ఈ ప్రాంతం ప్రాచీన కాలం నుండి కూడా చారిత్రకంగా, సాహిత్యపరంగా విశిష్టతను కలిగి ఉన్నది. రేచర్ల వంశానికి చెందిన రాణా మల్లన్న ఏలుబడిలో ఉన్న ఈ ప్రాంతంలో “సింహాసన ద్వాత్రింశిక” కథాకావ్యాన్ని రచించిన కొఱవి గోపరాజు, అతని తాత ఆంధ్ర కవితా పితామహుడనే బిరుదు పొందిన కొరవి సత్తెనారన వంటి మహాకవుల స్వస్థలం ఇదే.

తెలుగు సాహిత్యంలో క్షేత్ర మాహాత్మ్య కావ్య రచన సంప్రదాయం ప్రాచీన కాలం నుంచే కొనసాగుతుంది. ఎఱ్ఱన్నతో మొదలై, ప్రబంధ యుగంలో మరింత వికాసం చెందిన ఈ ప్రక్రియలో పాండురంగ మాహాత్మ్యం, శ్రీ కాళహస్తి మాహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం వంటి శైవ, వైష్ణవ సంబంధిత రచనలు వెలువడినవి. జిల్లాలో వెలువడిన ఈ వైష్ణవ ప్రతిపాదిత క్షేత్ర మాహాత్మ కావ్యం తొలి ప్రయోగం. ఈ క్షేత్రంలో నెలవైన స్వామి పేరుమీద కాకుండా, స్థలం పేరుమీద కావ్యనామాన్ని పెట్టడం ఒక ప్రత్యేకత. దీన్నిబట్టి కవి క్షేత్రానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు గ్రహించాలి.

స్థానికంగా ‘‘లింబాద్రిగుట్ట” గా పిలువబడే ఈ పుణ్యక్షేత్ర ప్రశస్తిని తెలిపే ‘‘శ్రీమన్నింబాచల మాహాత్మ్య” కావ్యాన్ని 10 ఆశ్వాసాలుగా, సుమారు 600 పద్యాలతో సంప్రదాయ మార్గంలోనే నంబి శ్రీధర్ రావు సంస్కృత మూలగ్రంథానికి అనుసరణగానే రచించారు. ప్రాచీన మాహాత్మ్య కావ్యాలు చంపూ పద్ధతిలో వెలువడగా ఈ కావ్యం నిర్వచన కావ్యంగా రచించుట ప్రయోగమే అవుతుంది. ఇటువంటి బృహత్ కావ్యాలను ప్రబంధ మనుట పరిపాటి. జిల్లాలో వెలువడిన ప్రబంధ సాహిత్యమంతా శైవ సాహిత్యానికి సంబంధించిందే ఎక్కువ. కవి దీనిలో ప్రాచీన ప్రబంధ లక్షణాలన్నీ

పాటించినాడు. కథ పురాణానికి సంబంధించిందే. అయితే వర్ణనల్లో నవ్యత కనిపిస్తుంది. సమకాలీన సమాజం ప్రతిబింబిస్తుంది.

ప్రాచీన కావ్య మర్యాదల ననుసరించి శ్రీకారంతో కావ్యాన్ని ప్రారంభించి, అవతారిక సంప్రదాయాన్ని పాటించి, ఇష్టదేవతా స్తుతిలో విష్ణువు, బ్రహ్మ, శివుడు, గణపతి వంటి దేవతలతో పాటు గాయత్రీమాతను వర్ణించడం ఈ కవి నవ్యతగా కనిపిస్తుంది. (అవతారిక.07). పూర్వకవి స్తుతిలో వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు, దండి, భానుడు వంటి కవులను ముందుగా స్మరించాడు. తల్లిదండ్రులకు, గురువులకు ముందుగా వందనం పలికి, నంబుల మగుట చేత, హరి పాదాంభుజముల సేవ మాకు అలవాటు పడినందున, నింబాచల మాహాత్మ్యమే కావ్య ఇతివృత్తమని (అవతారిక.17) తెలిపి, కావ్యాంకితం విష్ణువునకే చేశాడు. (అవతారిక.18,19). ఈ సందర్భంలో చమత్కారమైన ఒక కల్పన చేశాడు. లోకానికి తండ్రి అయిన విష్ణుమూర్తికి తన కావ్య కన్యను ఇవ్వడమంటే ముసలివానికి కన్యనిచ్చుటే అనుకోవద్దని, అజరతతికిపతి అంటే ముసలితనమే లేని దేవతలకు అధిపతి అయిన విష్ణుమూర్తి ఎప్పుడూ లేత వయసు యువకుడే అని సమర్థించు కున్నాడు. (అవతారిక.20) ఉత్సాహవృత్తాన్ని ప్రయోగించి అంకితమివ్వడంలో తనకు గల ఉత్సాహాన్ని వ్యక్తం చేశాడు. వృత్త ఔచిత్యానికి ఇదొక ఉదాహరణ. అవతారికలో కందపద్యాలతో షష్ఠ్యంతాలను రచించాడు. ఆశ్వాసాంతాల్లో ఒక వృత్తంతో పాటు, గద్యను పాటించాడు.

ఇతివృత్తం బ్రహ్మ వైవర్తక పురాణాంతర్గతమైనది. 114 పద్యాలు గల ప్రథమాశ్వాసం నైమిశారణ్యంలో సూత శౌనకసంవాదంతో మొదలవుతుంది. నింబాచలంలో విష్ణువు కొలువై ఉండుట, ఆ ప్రాంతంలోనే వ్యాసుడు ఆశ్రమం నిర్మించుకొని ఉండుట, వ్యాసుడు నారద మహర్షికి ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని తెలుపుట, బ్రహ్మ తన సతి తోడ క్షేత్రాన్ని దర్శించుట, తన పాప పరిహారం కొరకు అక్కడే తపస్సు చేయుట, ఆ సందర్భంలో చింతామణి పేరుగల చెరువు గంగాదేవి యొక్క మరో రూపంగా భావించి, కవి చేసిన వర్ణనలో అతడి పరిశీలనా నైపుణ్యం బహిర్గతమవుతుంది.

**గండుమీలో యామె కంటి వెలుగులో**
**తుమ్మెదలో యామె తురుము సిరియొ**
**కర్ణికలో యామె కర్ణికలో కేస**
**రమ్ములొ యాయమ రదన తతియొ**
**తొగరేకులో యామి తొగరు వాతెర కెంపొ**
**వనజ వరమొ యామె వదన శశియొ**
**తమ్మి మొగ్గలొ యామె స్తనహేమ ఘటములో**
**చెంగల్వలో యామె చేజివుళ్ళొ**
**సుడియొ యామె పొక్కిలియొ యిసుక జిగిలియొ**
**యామె పిరుదులో, తుంపిళ్ళొ యామె స్వేద**
**బిందు సందోహమొ నాగమందయాన**
**గంగ రెండు రూపములలో గానిపించె (1-74)**

విష్ణువు ప్రత్యక్షమగుట, లక్ష్మీ సహితుడై విష్ణువును క్షేత్రంలో నిలవమని బ్రహ్మ ప్రార్థించుట, దానికి విష్ణువు అంగీకరించుట జరిగింది.

ద్వితీయాశ్వాసం 203 పద్యాలతో సుదీర్ఘంగా సాగింది. దీనిలో ప్రధానంగా ధర్మపాలుడనే రాజు ఒక సుందరమైన పట్టణాన్ని నిర్మించుట వర్ణించబడింది. ఈ సందర్భంలో సామాజికమైన దృశ్యాలు కళ్లకు కట్టినట్లు వర్ణించుట సమకాలీన ప్రభావమే. పట్టణ నిర్మాణ పనుల్లో వివిధ వృత్తులను చేపట్టే వారిని (2-10 నుండి 2-14), వడ్డెర, కుమ్మరి, కాచెవారు (శిల్పులు), వడ్రంగి, కమ్మరి, కంచరి, సాలెలు, నగసాలెలు, మేదరి మొదలగు వృత్తుల వారిని పిలిపించి సత్కరించినాడని వర్ణించాడు.

ధర్మపాలుడు పురవీధుల్లో ఊరేగుటను (2-15 నుండి 2-21), పట్టణ ఉత్సవ సందర్భంలో గ్రామ దేవతలను పూజించిన విధానం చూడండి.

**పోచమ్మ! మా యూరు బ్రోవుమమ్మ యనుచు**
**నర్చించె నొక బెస్త యాడుబిడ్డ**
**యెల్లమ్మ! మీ మ్రొక్కు చెల్లింతు గావుము**
**మా రాజు ననుచు దంబళిది మ్రొక్కె**
**పెద్దమ్మ! మా యూరు విడిచిపెట్టు మెపుడు**
**పూజింతుమని తెన్గు పొంది వలికె**
**కట్ట మైసమ్మ! నీ కాన్కలిత్తు జెరువు**
**కాపాడుమని వేడె గాను చేడె (2-20)**

స్త్రీ దేవతలకు బోనములు తీయుటను కూడా పేర్కొన్నారు. ప్రజలకు రాజు ఏర్పాటు చేసిన వివిధ రకాల కూరగాయల భోజనం, తొక్కులు, పచ్చడులు, పిండిపదార్థాలు వడ్డించిన తీరును(2-30 నుండి 2-41)

**మల్లెల నగజాలు మంచి తావుల గ్రాలు**
**బియ్యపు బువ్వ క్రొవ్విరులు గాగ**
**రంగారు బంగారము గెలిసేయంగ**
**జాలు పప్పే హరిచందనముగ**
**నొగరు జంపెడు వాత దగరంపు బూతగా**
**నారు మిరియము కాశ్మీరజముగ**
**గిన్నెల జెన్నొందు ఘృత దధి మధు పాయ**
**సములభిషేకోదకములు గాగ**
**నుప్పు కప్పురమై కరమొప్పుచుండ**
**భోక్తలందరాత్మారామ పూజసేసి**
**రన్నపూజలు ముగియ పత్రార్చనమ్ము**
**సేయగోరు వారలనెల్లచేరబిలిచి"( 2-40)**

మెతుకులే పూవులుగా, పప్పును గంధంగా, కారపు పొడే కుంకుమ పువ్వుగా, ఘృతదధి పాయసాలే పంచామృత అభిషేకాలుగా, ఉప్పును కర్పూరంగా చేసుకొని, ఆ భోక్తలు ఆత్మారాముని పూజించారని వర్ణించాడు. శ్రీ దోర్బల విశ్వనాథ శర్మ గారు పేర్కొన్నట్లు **"మొత్తం ఆంధ్ర సాహిత్యమును ఎంత కెలికినను ఈ భావం అపూర్వమనియే స్పష్టమగుచున్నది"**

ప్రాచీన కావ్యాలలో తాంబూలమును కవులు పలు రకాలు వర్ణించారు. దానికి భిన్నంగా స్వానుభవం గలిగిన నంబి వారు చక్కగా వర్ణించారు.

**వెన్నను తలదన్ను నున్నని సున్నమ్ము**
**పచ్చ నాకులు కాచు వక్క తుమురు**
**నేలకి విత్తులున్ మేలిమి కస్తూరి**
**పచ్చ కప్పురము లవంగములును**
**చేర్చినట్టి విడెము చేతికిచ్చె నౌకరు..(2-41)**

కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు. రాజనర్తకి నృత్యం, సంగీత రాగాలు, కళారూపాలు, ప్రకృతి వర్ణనలు, గ్రీష్మ ఋతువర్ణన, శీతాకాలంలో చలిని వర్ణించిన తీరు అద్భుతంగా ఉంది.

**కం."అహహహ యిహిహిహి యుహుహుహు**
**లహరహముదయాస్తమయము లందరి నోళ్ళన్**
**ముహూరాలాపము లయ్యెను**
**మహి హిమయై తిరుగబడె క్రమంబుగ నంతన్"(2-159)**


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**


హిమ మహి అయిందంట, మహి హిమ అయ్యిందంట, లోకమే చలితో తిరగబడిందని, చలికి వణికినప్పుడు చేసే నోటిచప్పులను కూడా పద్యంలోకి పొదగడంలో కవి ప్రతిభ తేటతెల్లమవుతుంది. సందర్భాన్ని బట్టి ఈ అధికరణ చాలా పద్యాల్లో చేశారు.

శరత్ ఋతువు వర్ణన, చింతచెట్ల వర్ణన, ఆరోగ్య చిట్కాలు, క్రీడలు, వ్యవసాయ పంటలు, సంగీత వాద్యాలు,ప్రజల సాంస్కృతిక జీవనాన్ని బహువిధాలుగా పరిచయం చేశాడు.

తృతీయాశ్వాసంలో పోతన భాగవతాన్ని అనుసరించి, హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడు, నరసింహావతారాన్ని ఇతివృత్తంలో భాగంగా రచించాడు. ఉగ్ర నరసింహుని ప్రహ్లాదుడు శాంతింపజేసి సందర్భంలో **"భక్తుని స్పర్శచే పరమాత్మ కోపము / వరి గడ్డి మంట మాదిరి శమించె" (3-39)** చక్కని ఉపమానం ప్రయోగించాడు. వరిగడ్డి ఒకక్షణమే మండిన తీవ్రంగా మండుతుంది మళ్ళీ క్షణంలోనే చల్లబడిపోతుంది.

నాలుగవ ఆశ్వాసంలో పద్మ,చింతామణి, నంది, విరజానది, భవాని సరసుల వర్ణనలు, పౌరాణిక విశిష్టతలు చెప్పబడ్డాయి.

పంచమాశ్వాసంలో శివుడు నింబగిరికి చేరుకొనుట, చింతామణి సరసు పూర్వవృత్తం, ఇంద్రుడి తపస్సు, ఉత్తర భారతదేశంలోని బద్రీనాథ్, కేదరీనాథ్ క్షేత్రాల మాదిరి, దక్షిణ భారతదేశంలో శివకేశవులకు ఈ నింబాచలం నిలయమైంది.

షష్ఠాశ్వాసంలో భృగువు మహర్షి శాపానికి గురై నింబగిరిలో నందీశ్వరుడు కొలువై ఉండుట, హరిశ్చంద్రుడు వశిష్ఠుని సూచన మేరకు ఈ క్షేత్రాన్ని దర్శించుట,


సప్తమాశ్వాసంలో త్రేతాయుగానికి సంబంధించిన దశరథ శ్రీరాముడు, ఆంజనేయులకు ఈ క్షేత్రానికి గల సంబంధను,

అష్టమాశ్వాసంలో విరజా నది విశిష్టత, మహిమలను, నవమాశ్వాసంలో పార్వతికి భృగు శాపం తొలగుట, బిల్వ పత్రముల విశిష్టత, దశమాశ్వాసంలో ద్వాపరయుగంలో శ్రీ కృష్ణ నిర్యాణం, కృష్ణార్జునులు నరనారాయణులై ఈ క్షేత్రంలో కొలువై ఉండుట ఇతివృత్తంగా కొనసాగింది.

ఈ కావ్యంలో పంచచామరం, వనమయూరం, క్రౌంచం, అశ్వధాటి, రగడలు, మంగళమహశ్రీ మరియు ఒక దండకం, ఒక గేయాన్ని ప్రయోగించి ఛందోవైవిధ్యంచూపినాడు. కవి శైలి సరళ సుందరం. భావనాశక్తి, ఊహా పరికల్పన, అలంకార ప్రయోగం, వర్ణనా నైపుణ్యం..మొదలగు అంశాలతో ఆధునిక కాలంలో వెలువడిన అత్యద్భుతమైన సంప్రదాయ పద్య ప్రౌఢ ప్రబంధం మరియు క్షేత్ర మాహాత్మ్య కావ్యమిది. ఇది వెలుగు చూడటం వల్ల తెలుగు సాహిత్యానికి మరింత వన్నె చేకూరింది.

# వంగర 'వాసీ'యుడు - భారతీయ భాస్కరుడు

**డా. వొజ్జల శరత్ బాబు**, ప్రభుత్వ ఉపాధ్యాయులు, హైదరాబాదు. ఫోన్ : 9494183937



కోరిన వెంటనే అనుమతించి ఆప్యాయంగా వారి నాన్న పీవీ నరసింహారావు గూర్చి అనేక విషయ విశేషాలను అనుగ్రహించిన మాన్యులు గౌరవనీయులు శ్రీమతి సురభి వాణి దేవి ఎం.ఎల్.సి., గారికి అనేకానేక కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

**బలవానార్యా, నాస్త్యుత్సాహాత్ పరమం బలం?**
**సోత్సాహస్య హి లోకేషు, న కించి దపి దుర్లభం?**
**రామాయణం కి.కాం.1-121.**

(ఉత్సాహమే బలం. ఉత్సాహమును మించిన శక్తి ఇంకొకటి ఈ ప్రపంచంలో లేదు ఉత్సాహం ఉన్నవాడికి ఈ లోకంలో దుర్లభమైనది ఏదీ లేదు.)

చిన్నప్పటినుండి చివరివరకు శారీరక, మానసిక ఉత్సాహుడై తాను తన బాటలో పొందిన అవకాశాల సోపానాల్లో చేయదలుచు కున్న అన్ని కార్యాలు చేస్తూ వెళ్ళిన మహానుభావుడు. ఆయన భారత మాజీప్రధాని శ్రీ పాములపర్తి వేంకట నరసింహారావు గారు. నరసింహా రావు గారిని అనేక కోణాలలో పరిశీలించవచ్చు. ఆయన వైఖరి పూర్తిగా అర్థం కావాలంటే విభిన్న కోణాల్లో ఆయన చేసిన పనులను చూడాల్సి ఉంటుంది.

డెన్మార్క్ లోని కోపెన్హాగన్ లో జీవించిన డానిష్ తత్త్వవేత్త సోరెన్ ఆబై కియర్క్ గార్డ్ చెప్పిన మాటలు ఒకసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

"Personality is only ripe when a man has made the truth his own" ఈ మాటలతో పి.వి. జీవితాన్ని చూడాలి. ఎంత చక్కటి తత్త్వమో పి.వి.ది ఇట్టే అర్థమవుతుంది.

భారతీయ సంస్కృతి ఆయనకు ప్రాణం. భారతీయ సాహిత్యం ఆయన ఆచరణ.భారతీయ సనాతన ధర్మం ఆయన జీవిక. పీవీ ఏదైనా ఇతరులకు చెప్పడం అనేది మనకు కనబడదు. చేసి చూపించడమే ఆయన తత్త్వం. ఆయనలోని ఏకోణంలో చూసినా మనకు కనబడేదదే.

**పీవీ - కౌటుంబిక విశేషాలు :**

పూర్వ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామానికి జూన్ 28 1921వ సంవత్సరంలో అదృష్టయోగం పట్టింది. భారతదేశంలో నరసింహుడు ఉద్భవించాడు. అదీ రుక్మాబాయి సీతారామారావు దంపతులు కన్న మగబిడ్డ రూపంలో. దగ్గరే ఉన్న కటుకూర్ లో ప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్నాడు ఆ బిడ్డడు.

పూర్వ కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ఓ గ్రామం వంగర. ఇది ప్రస్తుతం వరంగల్ గ్రామీణ జిల్లాలో ఉంది. ఈ గ్రామం లోనే పాములపర్తి రంగారావు రుక్మిణమ్మ అనే పుణ్య దంపతులు ఉండేవారు. పీవీ కి జన్మనిచ్చిన దంపతులకు వీరు చుట్టాలే. రుక్మిణమ్మ (రత్నాబాయి) అన్న మురళీధర రావు. మురళీధర రావు కూతురి పేరు సత్యమ్మ (సత్తెమ్మ). సత్యమ్మ రత్నాబాయి మేనకోడలన్నమాట. కానీ ఈ పాములపర్తి దంపతులకు మగసంతానం లేదు.

మేనకోడలు అయిన సత్యమ్మనే వారింటి కోడలు కావాలనేది వారి కోరిక. ఆ ఆరాటంతోనే నరసింహారావు - సత్యమ్మ ల పెళ్లి ఒప్పందం చేసుకున్నారు. దత్తత కార్యక్రమం నిశ్చయించుకున్నారు. ఆ కాలపు సంప్రదాయ మంతేగా! పాములపర్తి వేంకట రంగారావు రుక్మిణమ్మలకు నరసింహారావు అతి చిన్నవయసులోనే అలా దత్తపుత్రు డైనాడు. ఇక నరసింహారావు పాములపర్తి వేంకట నరసింహారావుగా మారినాడు.

వంగర బిడ్డగా స్థిరపడ్డాడు . ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. కన్నతండ్రి సీతారామారావుగారు తన కొడుకులను అంటే నరసింహా రావు తమ్ములను నరసింహారావు చిన్న తనంలోనే ఆయన చేతిలో పెట్టి స్వర్గస్తులైనారు. ఆ విధంగా చిన్నప్పటినుండి కుటుంబ భారాన్ని మోయాల్సిన పరిస్థితి పీవీ కి ఏర్పడింది.

పీవీ నరసింహారావు గారికి ఒక అక్క. ఆమె పేరు సరోజనీదేవి. సరోజినీ దేవి అంటే ఆయనకు అత్యంత ప్రాణం. ఆమెకు తమ్ముడంటే తన రెండు కళ్ళు. మేనత్తలు - మామలతో సహా ఇతర బంధువులను-

మిత్రులను విపరీతంగా ఆయన అభిమానించేవాడు. ఇరు కుటుంబాలకు ఆయన ఒక మార్గదర్శకుడు. ఊర్లో అత్యున్నత గౌరవనీయ వ్యక్తి.

సరోజినీ అక్క రక్షా(రాఖీ) బంధనం లేకుండా ఏ ఒక్క సంవత్సరం ఉండేవారు కాదు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా వీలుంటే స్వయానా ఆయనే వచ్చి కట్టించుకుని వెళ్లేవారు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చినా తన అక్కను చూడకుండా మాట్లాడకుండా అసలు వెళ్లేవాడు కాదు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రతిసారి ఎంత ఆధికారికమైన పనిలో ఉన్న తన సమయం ప్రకారం కుటుంబంతో గడిపి వెళ్ళేవాడు. కచ్చితంగా అక్కతో మాట్లాడే వెళ్ళేవాడు. అనుకోకుండా అత్యవసరంగా ఓసారి ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చినాడు. వెంటనే ఢిల్లీ కి వెళ్ళాలి.. ఆ సమయంలో ఆయన ఎంత ఒత్తిడిలో ఉంటారో ఊహించుకోవచ్చు. అయినా సరే తాను హబ్సిగూడ లో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లినాడు. రెండుగంటల సేపు అక్కాతమ్ముళ్ళు మాట్లాడుకున్నారు. ఇదీ ఆయన ప్రేమతత్వాన్ని బయట పెడుతుంది.

మరోసారి పీవీ హైదరాబాద్ వచ్చినప్పుడు పీవీ కుటుంబ సభ్యులు వారి మేనత్త వెంట లేకుండా పీవీ దగ్గరికి వెళ్ళినారు. అప్పుడు పీవీ అడిగిన మొదటి ప్రశ్న "అత్త ఉందా? వెంట రాలేదేమిటి?" అని. ఇలా అనేక సందర్భాల్లో ఆయా సందర్భానుసారంగా పీవీ బంధుగణంతో గడిపేవారు. వారిని గుర్తుకు తెచ్చుకునే వారు.

అది సంజయ్‌గాంధీ మరణించిన రోజు. ఆ వార్తతో తాను అత్యవసరంగా ఢిల్లీకి వెళ్ళాల్సి ఉంది. నాడు జూన్ 28. ఏదో పని మీద పివి గారు హైదరాబాద్‌కు వచ్చారు. ఆ పని ఒత్తిడిలో మునిగి ఉన్నాడు. ఆనాడు పివి గారి పుట్టినరోజు. విశేషంగా 60వ పుట్టినరోజు. కానీ ఆయన ఆ చిత్తంలో లేరు. ఆ సమయంలో పీవీ కుమార్తె వాణి గారు వారి నాన్నను కలుసుకున్నారు. "బాపూ ఇంటికి రా !" అని పిలిస్తే అంత కార్యమగ్నులై ఉన్నా కూడా వారి ఇంటికి వెళ్ళాడు. వారి కుటుంబ సభ్యులు ఆయన పుట్టినరోజు జరిపినారు. ఆయన వారితో కొంత సమయం గడిపినారు. ఏ విషయంలో అయినా ఎంత ఒత్తిడి ఉన్నా కుటుంబం తర్వాతే బయటికి వెళ్లడం. అదీ ఆయనకున్న గొప్ప లక్షణం. కుటుంబం అంటే ఎనలేని ప్రాణం. కుటుంబంలో ఏ చిన్నపాటి కార్యక్రమం ఉన్నా ఉపస్థితుడు అయ్యేవాడు.

కీర్తిశేషులు శ్రీ పి. వి. నరసింహారావు సత్యమ్మల సంతానం ఎనిమిది ఫలాలు. ముగ్గురు పుత్రులు. ఐదుగురు పుత్రికలు. వారు పీవీ రంగారావు, పీవీ రాజేశ్వరరావు, పీవీ ప్రభాకరరావు అనే మగ సంతానం. వాణీ, జయ, సరస్వతీ, శారద, విజయ అనేవారు ఆడ సంతానం.

మన రాష్ట్రంలోని మహబూబ్ నగర్ – హైదరాబాద్ – రంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన వారు సురభి వాణీదేవీగారు. ఈమె ప్రముఖ చిత్రకారిణి. విద్యావేత్త. పీవీ గారి కూతురనే విషయం అందరికి సువిదితమే.

మాన్యులు శ్రీమతి సురభి వాణి దేవి, ఎం.ఎల్. సి.గారితో వారి నాన్న గారి గురించిన విశేషాలను తెలుసుకొనే అవకాశానికి ఆవిడ ఆప్యాయంగా అనుమతి ఇచ్చారు. ఆ సందర్భంలో మనకు పీవీ గురించి తెలిసిన విశేషాలేవేవి అనుగ్రహించారో ఒక్కసారి చూద్దాం!

**ప్రాశ్నికుడు :** అమ్మ ! నమస్సులు. మీకు శుభాకాంక్షలు.

**వాణీ దేవి గారు :** నమస్సులండీ! ధన్యవాదములు.

**ప్రాశ్నికుడు :** పీవీ గారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాస పత్రిక 'మూసీ' వారు పీవీ గారిని వారి సేవలను వివిధ కోణాలలో స్మరిస్తూ ఉన్నారు. ఈ సందర్భంలో మిమ్ములను కలుసుకోవడం చాలా సంతోషం. మీరు అనుమతిస్తే పీవీ గారికి సంబంధించిన కొన్ని విశేషాల గురించి మాట్లాడాలని ఉంది..

**వాణీదేవి :** మూసీ పత్రిక వారికి శుభాకాంక్షలు. వారు చేస్తున్న సత్కార్య క్రమాలకు శుభాభినందనలు. వారు చాలా మంచి పని చేస్తున్నారు. పివి గారి గురించి అనేక కోణాలలో స్మరించుకోవడం మనకు గర్వకారణం. ఆ సందర్భంలో పివి గారి గురించి మాట్లాడటం చాలా సంతోషకరమైన విషయం.

**ప్రాశ్నికుడు :** మీ బాల్యంలో మీ నాన్నగారు మీకు సమయం ఎలా కేటాయించేవారు?

**వాణీదేవి :** తనకు వీలు చిక్కినప్పుడల్లా మాతో గడిపేవారు. కొన్ని సందర్భాల్లో వీలు చేసుకుని గడుపుతూ ఉండేవారు. పండుగలు, పబ్బాలు అయినప్పుడు తప్పకుండా తను మాతోటి ఉండేవారు. ఆనందంగా గడిపేవాడు. సంతోషకరమైన ఇతర సందర్భాల్లో కూడా మాతో కలిసి ఉండేవారు. మా ఇంట్లో చాలా శ్రద్ధగా జరుపుకునే వ్రతం కేదారేశ్వర వ్రతము. ఆ వ్రతాన్ని చాలా భక్తితో చేసుకునేవారు. చాలాకాలం వరకు మా బాపు (నాన్నను మేము బాపు అని పిలిచే వాళ్ళం) ఎక్కడ ఉన్నా ఈ వ్రతానికి ఇంటికి చేరుకునే వాడు. ఆరోజు మా ఇల్లంతా సందడి. బంధువులతో ఆహ్లాదంగా ఉండేది. ఇలా అనేక పండుగలే గాకుండా తనకు వీలు చిక్కినప్పుడల్లా మా బాపు మా తోటి గడిపేవాడు.

**ప్రాశ్నికుడు :** విద్యాభ్యాసం విషయంలో మీ నాన్న మీకు నిర్దేశనం చేసేవాడా? చేస్తే ఎట్లా చేసేవాడు?

**వాణీ దేవి :** మా నాన్న చెప్పిన సూత్రం ఒకటే. **"నీవు నీ ప్రయత్నం చెయ్. నీ అభ్యాసమే నీకు ముఖ్యం"** అని అంటుండేవాడు. మేము ఒక మంచిపని చేస్తే లేదా ఒక మంచిమార్గంలో వెళితే దానికి ఆటంకం చేసేవాడు కాదు. మార్కులు ఇలా ఉండాలి అలా ఉండాలి అని చెప్పేవాడు కాదు. కానీ మా బాపు మమ్మల్ని చూస్తున్నారు అనే విషయం మాకు స్పష్టంగా తెలిసేది. ఆయన చూసినట్లు మాత్రం మనకు కనబడదు. ఆయన్ని చూసే మేము చాలా నేర్చుకున్నాము.

**"మనందరికీ చదువే పెద్ద సంపద"** అని పదే పదే చెప్పేవారు. మేము చదువుకునే మార్గంలోనే మమ్మల్ని ప్రోత్సహించేవాడు. ఎవరికి ఎలా మార్కులు వచ్చినా ఏ ఇబ్బంది లేదు. వాటి కొరకు ఆయన ఎన్నడూ పట్టించుకోలేదు. చదువులో కానీ ఇతర విషయాలలో కానీ ఆడ మగ అనే తేడాలు చూపించలేదు. ఆయన నడచిన నడకలే మాకు శ్రీరామరక్ష గా ఉండేది.

**ప్రాశ్నికుడు :** మీ బంధువులతో మీ నాన్నగారి అనుబంధం ఎలా ఉండేది?

**వాణీ దేవి :** మా బాపుకు కుటుంబం అన్నా బంధువులు అన్నా అమితమైన అభిమానం. బంధుప్రీతి ఎక్కువ. వాళ్ళ అక్కగారిని విపరీతమైన ప్రేమతో చూసుకునేవాడు. మా ఇళ్ళల్లో ఏ కార్యక్రమం జరిగినా ఆయన ఏ పదవిలో ఉన్నా తప్పనిసరిగా వచ్చేవాడు. బంధువుల ఇళ్లకు అలానే వెళ్లేవాడు.

**ప్రాశ్నికుడు :** మీ పూర్వుల గురించి మీకందరికీ తెలియజేసే వారా?

**వాణీదేవి :** ఆయన మా పూర్వుల గురించే కాదు, దేశ వారసత్వాన్ని కూడా తెలిపేవాడు. కొన్ని విషయాలు మా ఇంట్లో జరిగే అనేక సమావేశాల వల్ల మాకు తెలిసి పోయేవి. ఆనాటి పరిపాలనా వ్యవస్థలు, తెలంగాణ రాష్ట్రం పడిన ఇబ్బందుల గురించి తెలిసేవి . రజాకార్ల ఆగడాలు, ఆనాటి చాందా క్యాంపు ఇట్లాంటి పోరాట విషయాలు మా ఇంట్లో జరిగే సమావేశాల ద్వారా వాళ్ళ మాటల్లో మాకు తెలిసేవి. ఇంటి నిండా స్వాతంత్ర సమరయోధులు. వారు అనేక విషయాలు చర్చించేవారు. వారందరి ద్వారా మేము వినేవాళ్ళం. నిజంగా ఆనాటి ఆ సమయంలో కుటుంబాల పోషణకు కూడా చాలా కష్టపడాల్సి వచ్చేది. మా బాపుకు ధైర్యం ఎక్కువ. మా కుటుంబాలు అనేకం చాందా క్యాంపు కి వెళ్ళాయి.

**ప్రాశ్నికుడు :** భారతీయ సంస్కృతి పాశ్చాత్య సంస్కృతి గూర్చి ఏమైనా మీ మధ్యలో చర్చకు వచ్చేదా?

**వాణీ దేవి :** తప్పకుండా వచ్చేది. మా బాపుకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అపారమైన ప్రేమ. అవ్యాజ్యమైన అనుబంధం. అలా అని కొన్ని అనవసరమైన మూఢవిశ్వాసాల పట్ల వ్యతిరేకత కలిగి ఉండేవాడు. మన సంస్కృతి అంతా మనకు దేవాలయాల నుండే వస్తుందనే గట్టి నమ్మకం ఆయనది. దాన్ని ప్రమోట్ చేయాలని ఆయన చెప్పేవాడు. సంస్కృత భాష పట్ల అపార అభిమానం. సంస్కృత భాషను పాఠశాల కళాశాలల స్థాయిలలో పునరుద్ధరణ గురించి బాగా ఆలోచించేవారు. దానిద్వారా సంస్కృతి సంప్రదాయాలు కలకాలం నిలిచి ఉంటాయని ఆయన అభిలాష. ఇంట్లో ఎంత శుభ్రంగా ఉండాలో బయట అంతే శుభ్రంగా ఉండటం, తాను తన మనసును అంతకంటే ఎక్కువ శుభ్రంగా ఉంచుకోవడం ఆయన అలవాటు. అవసరమైతే ఇల్లు ఊడ్చుకోవడం కూడా



ఆయనకు అలవాటే. పాశ్చాత్య సంస్కృతి – భారతీయ సంస్కృతులలో ఉన్న మంచిని గ్రహించాలి అనేవాడు. ఆయన మాటల్లో చెప్పాలంటే–

externally - western good.

internally - India good.

మన సంస్కృతి – ధర్మంలో అంతర్భాగమైన పితృదేవతలకు పెట్టే విశేష దినం తిథి. ప్రతి సంవత్సరం మా బాపు వారి కన్న తల్లిదండ్రుల తిథుల నాడు ఖచ్చితంగా ఇంటికి వచ్చేవారు. ప్రసాదం తిని అందరితో మాట్లాడి వెళ్లేవారు. అది ఆయనకు తన తల్లిదండ్రుల పట్ల ఉన్న గౌరవ, భక్తి భావాలు..

**ప్రాశ్నికుడు :** మీరు, మీ పిల్లలు మీ నాన్న గారితో గడిపిన సందర్భాలలో ఏవైనా ఒకటి రెండు విషయాలు ...?

**వాణీ దేవి :** మా బాపుకు చదువు అంటే చాలా ఇష్టం. చదువుకొమ్మని మనుమళ్ళు మనుమరాళ్ళందరికీ చిన్నప్పటి నుండే చెబుతూ ఉండేవాడు. ఎక్కడ మంచి ఉన్నా అడాప్ట్ చేసుకోమని చెప్పేవాడు. మనుమలు, మనుమరాళ్ళతో చాలా సరదాగా గడిపేవాడు.ఆడుకునేవాడు. ఇంటికి వచ్చిన తరువాత తనంతట తానుగా ఎప్పుడు వెళ్లేవాడు కాదు. "ఇక వెళ్ళమంటారా?" అని అడిగి, వెళ్ళమని అంటేనే వెళ్లేవాడు. మాకు తృప్తి కలగడం అనేది ఆయన భావన. మా పిల్లలు లేకుండా మేము ఢిల్లీకి వెళితే "మీరు కాదమ్మా! పిల్లలు ఏరీ?" అని అడిగేవాడు. తన పుట్టిన రోజును పిల్లలే చేయాలి. పిల్లల్ని ముఖ్యమైన అన్ని ప్రదేశాలను చూడమని చెప్పేవాడు. భ్రమణం చేయాలని అనేవాడు. కానీ వారికి ఒక షరతు పెట్టేవాడు. మీరేం చూశారో అదంతా ఒక 'ఎస్సే' గా రాయమనేవాడు. రాసిన దానిని చూసి సంతోషించేవాడు. కావలసిన సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ఆయనకు పిల్లలతో షటిల్ ఆడడం ఇష్టం. వచ్చినప్పుడల్లా వారితో షటిల్ ఆడేవాడు. కెమెరా అంటే ఆయనకు ఇష్టం. పిల్లల్ని తప్పనిసరిగా ఫోటోలు తీసేవాడు. మా పాప నృత్యం నేర్చుకునేది. ఆ విషయం తెలిసిన ఆయన మా పాపను 'నట్యాంగం'

చేయమన్నారు. ఆ తర్వాత మెచ్చుకొని ఆయనా చేసి చూపించారు. దాని మీద కూడా ఆయనకు పట్టు ఉండేది.

ఒక సంఘటన నాకు బాగా గుర్తు. మా బాపుతో మేము కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి మా పిల్లలతో సహా వెళ్ళాం. అప్పుడు ఆయన ప్రధానమంత్రి. ఆలయంలోనికి ఇంకా వెళ్ళలేదు. వెళ్ళటానికి అడుగు దూరంలో ఉన్నాం. సరిగ్గా అదే సమయంలో ఒక విషాద వార్త వచ్చింది. నడిచే దేవుడు అయినా కంచి పరమాచార్య స్వామి శివ ఐక్య సమాధి అయ్యారని. ఆలస్యం చేయకుండా వెంటనే మా బాపు ఆ స్వామి స్మృత్యర్థం మైలను (ముట్టుడు) పాటించాడు. సంతాపంలో మునిగారు. ప్రోటోకాల్స్ అన్నీ ప్రక్కన పెట్టినాడు. తన వెంట ఉన్న ఆనాటి కేరళ ముఖ్యమంత్రితో "నేను వెళ్ళాలి. మర్యాదలన్నీ మా పాపకు చేయండి" అని చెప్పినారు. ముఖ్యమంత్రి కరుణాకరన్ దగ్గర సెలవు తీసుకున్నారు. కంచికి పయనమయ్యారు. ఆయన నిర్ణయాలు సాంస్కృతిక పరమైనా సాంప్రదాయ పరమైనా అలా ఉండేవి. ప్రధాని పదవి కంటే ముందు ఆయన సర్వ సంగ పరిత్యాగానికి సిద్ధపడ్డారు. కుర్తాళం పీఠానికి వెళ్ళాలని అనుకున్నారు. కాని దైవాజ్ఞగా భావించి ప్రధాని పదవిని స్వీకరించారు. ఇలా అనేక సందర్భాల్లో మేము ఆయన వెంట ఉండేవాళ్ళం.

**ప్రాశ్నికుడు :** మీ నాన్నగారికి ఇష్టమైనవి ఏవి? మీ అభిప్రాయంలో మీ నాన్నగారు?

**వాణీ దేవి :** షటిల్ ఆడటం ఆయనకు చాలా ఇష్టం. 62 ఏళ్ల వయసులో అమితమైన ఆసక్తి తో కంప్యూటర్ నేర్చుకోవడం ఆయనకే చెల్లింది. మితాహారం తీసుకునేవాడు. పూర్తిగా శాకాహారి. ఆయనకు అణువు నుండి అంతరిక్షం వరకు అన్ని విషయాలపై పట్టు ఉండేది. కళల పైన, సంగీతం పైన మంచి పట్టు ఉండేది. వ్యవసాయం అంటే ఇష్టపడేవాడు. బాలమురళీకృష్ణ, ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి, భీమ్సేన్, పర్వీన్ సుల్తానా – వీళ్ళ సంగీతం అంటే ఇష్టపడేవాడు. కేలు చరణ్ మహాపాత్ర నాట్యం చూసేవారు. హిందుస్తానీ–కర్ణాటక సంగీతాలు రెండూ ఆయనకు ఇష్టమైనవే.

ఆయన గొప్ప పాఠకుడు. నేను ఒకసారి ఆయన ఇంట్లో 15000 పుస్తకాలు సర్దినాను. వాటిలో ఆయా రచయితలు ఇచ్చినవి కొన్ని. బహుమతులుగా పొందినవి మరికొన్ని. ఎయిర్ పోర్ట్ తదితర ప్రదేశాలల్లో కొన్నవి ఇంకొన్ని . వాటిలోని దాదాపు అన్ని పుస్తకాలనూ ఆయన చదివారు.

ఎవరిని ఏ హద్దుల్లో ఉంచాలో వారిని ఆ హద్దులో ఉంచేవాడు. ఆయా వ్యక్తుల దగ్గర తానూ ఆ హద్దుల్ని పాటించడం అంటే ఆయనకు ఇష్టం. ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కంచి స్వామి శతజయంతి ఉత్సవాలు జరిగినాయి. అవి అంత ఘనంగా జరగటానికి కారణం పివి గారి భక్తి అని కొందరంటారు. వీలు చిక్కినప్పుడల్లా పీఠాధిపతులతో గడపడం ఆయనకు ఇష్టం.

ఒకరు తనను మెచ్చుకోవాలి అనే అపేక్ష ఆయనకు లేదు. ఏ పదవి వచ్చిన దైవాజ్ఞగా భావించేవారు. భయం లేని వ్యక్తిత్వం. పరోపకార గుణం. ప్రజాసేవ ఇష్టం. గురు శివానంద మూర్తి గారు మా అందరికీ మార్గదర్శి. ఒక సందర్భంలో గురు శివానంద మూర్తి గారు మా బాపు గురించి **"ఈ దేశానికి , దేశ ప్రజలకు కావలసింది ఏంటో పివి గారికి తెలుసు. ఒకవేళ ఇతరులకెవరికైనా తెలిసిన ఆ పనులు చేసే ధైర్యం వారికి లేదు.కానీ అవి చేసే ధైర్యం పివి గారికి ఉంది"** అని అన్నారు.

నేను మరచిపోలేని మరో సంఘటన మా పాప పెళ్లి సందర్భం. ఆ సందర్భంలో పత్రికలు అచ్చు వేయించాలి కదా! కానీ అప్పుడు ఆయన ప్రధానమంత్రి. ఆయన పేరు పత్రికలో పెట్టుకోవాలా వద్దా అనేది మా అందరికీ సందేహం. బాపును అడిగే ధైర్యం మాకు



లేదు. అందుకని పత్రిక డిటిపి అయిన తరువాత ప్రూఫ్ కొరకని ఆయనకు పంపాను. కావలసిన సవరణలు చేశారు. గ్రాండ్ ఫాదర్ గా తన పేరును రాసుకున్నారు. అంతేకాదు **"ఆ పెళ్లి పనులు అన్ని నేనే చూసుకోవాలి"** అని అనేవాడు. పెళ్లికి వచ్చిన అందరికీ స్వాగతం చెప్పేవాడు. అందరితో కలిసి తిరిగేవాడు. తనకు తన కుటుంబం అంటే ఎంతో అభిమానం. మా అక్క చెల్లెళ్ళు, అన్నదమ్ముల ఇళ్లల్లో ఏకార్యం జరిగినా తాత హోదాలో ఆయన చేయవలసిన పనులన్నీ చేసేవాడు. సంప్రదాయాన్ని పాటించేవారు.

**(ఇవి శ్రీ పి వి నరసింహారావు గూర్చి మాన్యశ్రీ సురభి వాణి దేవి ఎమ్మెల్సీ గారితో చేసిన సంభాషణా విశేషాలు)**

**విశిష్ట వ్యక్తిత్వం :**

అబ్బా అబ్బా ! ఒక వ్యక్తి ఇంత ఇలాగా ఉండడం సాధ్యమా అని అనిపిస్తుంది !? కానీ పి వి గారికి అది మినహాయింపు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. న్యాయవాది. వ్యవసాయ వేత్త. సంగీతాభిమాని. కళాభిమాని. కాదుకాదు వాటిపై గట్టి పట్టు సాధించిన వ్యక్తి. సినిమాలన్నా ఇష్టమే. నాటకాలన్నా ఇష్టమే. ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కాస్త విశ్రాంతి కొరకు మన తెలుగు సినిమా నాయకుడైన రాజేంద్ర ప్రసాద్ గారి హాస్య సినిమాలు చూడడం, అది ప్రముఖ వార్తగా రావడం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆయన భారతీయ తత్వశాస్త్రం అధ్యయనం చేసినారు. ఆచరణలో పెట్టినవాడు. భాషావ్యసనం చేసినారు. పాండిత్యం గడించినారు.

తన ఊరిలో గౌరవాన్ని పొందటం మొదలుకొని రాష్ట్ర, దేశ అంతర్జాతీయ గౌరవాలను అందుకున్నాడు. పేరు ప్రఖ్యాతులు సాధించారు. కానీ ఎన్నడూ ఇవే ముఖ్యమని ఆయన తలచుకో లేదు. ఎక్కడ ఆయన తన సంస్కృతీ – సంప్రదాయాలను వీడలేదు. కుటుంబంతో బంధువులతో గడపడం మరచిపోలేదు. మిత్రులతో మాట్లాడకుండా ఉండలేదు. తనకు తెలిసిన వారు ఎక్కడ కనబడినా పేరుతో మరీ పలకరించేవాడు. అందరితో చమత్కారంగా మాట్లాడేవాడు. హాస్యాన్ని పండించే వాడు. ఎమ్మెల్యే, ఎంపీగా ఉన్నా, మంత్రిగా ఉన్నా, ప్రధాన మంత్రిగా ఉన్నా తన తత్వాన్ని, తన సత్యాన్ని తాను నమ్ముకున్నాడు. ఎవరినీ నొప్పించనూ లేదు. దేశ సేవే పరమ లక్ష్యంగా పని చేసినాడు. కుటుంబ శ్రేయస్సు తన కర్తవ్యంగా ఎంచుకున్నాడు. సన్మానాలకు పొగడ్తలకు ఆమడ దూరంలో నిలిచినాడు. ఆనాటి కాలంలో ఆయనను ఆంధ్రప్రదేశ్ బృహస్పతి అని పిలిచినా పట్టించుకోనేవాడు కాదు. మేధావులను, కళాకారులను తాను ఎప్పుడూ పొగుడుతూ ప్రోత్సహిస్తూ ఉండేవాడు. అలా పివి ప్రోత్సాహం పొంది ఎదిగినవారు ఎందరెందరో. బాల్యంలో పిల్ల – పిడుగులా ఉన్నాడు. కుటుంబ జీవనంలో అందరిలో తానూ ఒకడై ఉన్నాడు. పిల్లల పెంపకంలో తన నడవడితో, చూపులతోటే క్రమశిక్షణ విద్యాభ్యాసాలకు ప్రాణం పోసినాడు. ఆయన ఎవరి నుండి దూరం కాలేదు. కానీ తాను ఒంటరిగా ఉన్నాడు. ఎలా ఉన్నప్పటికీ ఆయన తామరాకు మీద నీటి బొట్టులాగానే ఉన్నాడు. అందుకే **'ఆయన అందరిలో అందరివాడు. తనకు తానుగా ఒంటరి వాడు'** అనే భావన అందరికీ కలుగడం సహజమే కదా!

Character is like a tree and reputation like a shadow. The shadow is what we think of it, the tree is the real thing. - Abraham Lincoln.

ఈ మాటల ప్రకారం పివి గారు తన మానసిక వృక్షానికి ప్రాధాన్యమిచ్చారు తప్ప తన భౌతిక నీడకు ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వలేదు. తన చిన్ననాటి ఆ పాములపర్తి సదాశివ రావు (తన సోదరుడు) గారితో సాన్నిహిత్యం మొదలుకొని అంతర్జాతీయ వ్యక్తుల సాహిత్యం వరకు ఆయన ఎక్కిన మెట్లు ఎన్నో. పొందిన పదవులు ఎన్నో. ఆయన దేశాన్ని, ప్రజలను దృష్టిలో పెట్టుకొని దేశానికి చేసిన సేవ అమూల్యమైనది.

**ఆయన బహు దీర్ఘదర్శి. బహు కోణీయుడు.**
**భారతీయ తాత్త్విక చింతనాపరుడు.**
**సదభిలషణీయుడు.**
**ఆయన లక్నేపల్లి లలితుడు.**
**వంగర 'వాసీ'యుడు.**
**తెలంగాణా తెంపరి.**
**భారతీయ భాస్కరుడు.**


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ముగిసిన విద్యార్థి శకం అందమైన తరగతి జీవితం..

మరోజన్మంటూ ఉంటే తప్పా
మళ్ళీ రాలేని బాల్య జ్ఞాపకాలు
జ్ఞాపకాలు బాల్యమే కావచ్చు కాని
ఈ జీవితంలోకి మళ్ళీ వెళ్ళలేననే మదిలో వేదన..

నిక్కరు లాగు మోకాళ్ల వరకు లొడాసు అంగి
ఇవే విద్యార్థిగా నేను ధరించిన తొలి వస్త్రాలు
యూరియాసంచి బుక్కుల బ్యాగు
ఒక పొరలో పుస్తకాలు
మరోపొరలో తినేప్లేటు
ఇవే బడికి మోసిన పనిముట్లు

ఐదో తరగతి అయిపోయింది
అప్పుడు తెల్వదు నాకు బడిలో ఉన్నతస్థాయికి
వచ్చానని
ఏడో తరగతి పాసయ్యాను
ఆనాడు తెలియలేదు
బాల్య జీవితం సగం అయిపోయిందని
పదోతరగతి ఉత్తీర్ణత సాధించాను
ఆనాడు గుర్తించలేదు ఇలాంటి రోజులు మళ్ళీరావని

పాఠశాల దశ ముగిసిందని
కళాశాల వైపు అడుగులేస్తూ
సంబరపడ్డాను
పెద్దవాళ్ళమని మమ్మల్ని దండించే వారే లేరని
మేము యూత్ అని యువజన సంఘం లీడర్లమని
మాకు మేమే మరిచిపోయాము
మేము విద్యార్థులమని..

నేడు..

వృత్తి విద్య వైపు పయనమై
ఉన్నత చదువులు చదివి



ఆఖరి పరీక్షలకు హాజరయ్యే
నాకు వెనుకటి రోజులు యాదికొచ్చి ఏడుపొస్తుంది
మేత మేసిన పసురం నెమరువేసుకుంటున్నట్లు
పూర్తైన చదువు ముగిసిన తరగతి జీవితాన్ని
తలుచుకుంటుంటే..

ఆటల పోటీలు పాటల పోటీలు
జెండావందనాలు కారబూంది పొట్లాల ఆనందాలు
చిన్న చిన్న కార్యక్రమాలు
పెద్దల ఉపన్యాసాలు
ఆటల పిరియడ్ కేరింతల జీవితం
రాలిన ఎండుటాకులు మళ్ళీ యథాస్థానంలోకి రానట్లుగా
స్థాయి ఏదైనా ముగిసిన విద్యార్థి శకం మళ్ళీ రాదని తెలిసి..

తరగతి పాఠాలు వినే స్థాయి దాటొచ్చామని
జీవిత పాఠాలు నేర్చుకునే వయస్సు వచ్చిందని
సమాజసేవలో భాగమవ్వాలని
కుటుంబ బాధ్యతలు చేపట్టాల్సిన తరుణమని
భావితరాలకు ఆదర్శంగా
బాల్య స్మృతులను బంధాలను
పదిలంగా లిఖించుకుంటూ
తరగతి జీవితానికి విద్యార్థి శకానికి వీడ్కోలు పలుకుతున్న...

**ఎజ్జు మల్లయ్య**
ఫోన్ : 965 287 1915

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం - 14

# జీవన జ్యోతి

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



**"కె. విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "జీవన జ్యోతి". ఈ చిత్రం 1975వ సంవత్సరంలో విడుదలైంది. 2 గం.26 ని. ల నిడివితో నిర్మితమైన ఈ చిత్రంలో శోభన్ బాబు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులు. వాణిశ్రీ ఈ చిత్రంలో తల్లిగానూ, కూతురుగానూ ద్విపాత్రాభినయం చేశారు. సాధారణంగా తన భాగస్వామి కోసం తన జీవిత సుఖాలను పక్కనపెట్టి తన క్షేమమే మన క్షేమంగా భావించి జీవించే త్యాగశీలత, సహనం, ఔదార్యం స్త్రీ మూర్తుల్లోనే ఎక్కువ మొత్తంలో చూడగలం. కాని దానికి విభిన్నంగా కథానాయకుడు ఈ చిత్రంలో ఆ భూమికను పోషిస్తాడు. చిత్ర ప్రధాన కథ అంతా ఫ్లాష్‌బ్యాక్‌లో సాగుతుంది.

**చిత్ర కథ :**

వయస్సు పైబడిన పాత్రలో శ్రీనివాస్ (వాసు)(శోభన్‌బాబు) తన ఇంద్రసౌధం లాంటి ఇంటినుండి ఒక పిచ్చాసుపత్రికి వెళ్తాడు. అక్కడ ఒకామె చిన్నబాబు బొమ్మను చేతిలో పెట్టుకొని పిల్లాడి కోసం తాపత్రయ పడుతూ పక్కవాళ్ళతో గొడవపడుతూ వుంటుంది. ఆ పిచ్చామె శ్రీలక్ష్మి (లక్ష్మి) (వాణిశ్రీ). లక్ష్మి, వాసు భార్య. కాని లక్ష్మి పిచ్చిదవడం వల్ల అతనెవరో ఆమెకు తెలీదు. కాని తన కొడుకు గురించి ప్రేమగా మాట్లాడతాడనే ఆలోచనతో వాసుతో మాట్లాడు తుంది. తర్వాత వాసు ఇంటికెళ్ళి లక్ష్మి ఎప్పుడు మునుపటి మనిషిలా మారుతుందనే విచారంలో వుండగా ఫోన్ వస్తుంది. ఫోన్ లో పాండు (కైకాల సత్యనారాయణ) రేపు నిన్ను కలవడానికి శోభ(వాణిశ్రీ)తో పాటు వస్తున్నాం అంటూ కాల్ కట్ చేస్తాడు. శోభ విసుక్కుంటూ అసలే అమెరికా వెళ్ళే కంగారులో వున్న నాకు బాబాయ్ వద్దకు వెళ్ళే కార్యక్రమం అవసరమా అని అరుస్తుంది. పాండు మీ బాబాయ్. నీ ముద్దుల కుమారుణ్ణి చూడ్డానికి ఆరాటపడుతున్నాడు తప్పదు అంటాడు.

పాండు – జానకి(శుభ)లు తాము స్వంత కూతురిలా పెంచిన తమ్ముడి కూతురైన శోభను ఆమె కుమారుణ్ణి తీసుకొని శ్రీనివాస్ వద్దకు వెళ్తారు. కాని శోభకు మొదటినుండీ తన బాబాయ్ శ్రీనివాస్ పట్ల సదభిప్రాయం వుండదు. ఒకరోజు శ్రీనివాస్ రాత్రి పూట శోభ పడక గదిలోకి వెళ్ళి ఆమె పడుకుని వుండగా ఆమె తలపై చేయి పెట్టి 'చల్లగా కలకాలం బతుకమ్మా' అని దీవించి గదిలోంచి వెళ్ళిపోతాడు. ఆ విషయానికి శోభ ఆశ్చర్యం చెంది తన తల్లి వద్దకు వెళ్లి మీరంతా నాతో ఏదో విషయం దాచారు, అదేంటో చెప్పమంటూ తల్లి జానకిని గట్టిగా నిలదీస్తుంది. జానకి బదులుగా చెప్పడానికి సంకోచిస్తూనే మేం నిన్ను పెంచిన తల్లిదండ్రులం మాత్రమే, నీ తండ్రి మీ బాబాయ్ గారే అని నిజం చెప్తుంది. ఇన్నాళ్లు నాకు నిజం చెప్పకుండా నన్ను పెదనాన్న గారి వద్ద పెంచడానికి కారణం ఏంటో? చెప్పమని నాన్న శ్రీనివాస్ ను అడుగుతుంది. శోభ ప్రశ్న విని శ్రీనివాస్, అక్కడే వున్న అతడి అన్న పాండు నివ్వెరపోతారు. శ్రీనివాస్‌కు మౌనమే శరణ్యం అవుతుంది. వెంటనే మళ్ళీ శోభ 'అంటే నా తల్లి తన వివరాలు నాకు కూడా చెప్పలేనంత కులటా లేక పతితా' అంటూ ఘాటుగా ప్రశ్నిస్తుంది. ఆమె ప్రశ్నకు సమాధానం చెప్తూ శ్రీనివాస్ గతం వివరిస్తాడు. (ఫ్లాష్ బ్యాక్)

శ్రీనివాస్ తన జీవితంలోకి రాబోయే అమ్మాయి గురించి కథలు, కవిత్వాలు రాస్తూ చాలా ఆశలతో జీవిస్తూ వుంటాడు. అతని స్నేహితుడు ధర్మరాజు (రాజాబాబు). శ్రీనివాస్‌ను అతడి స్నేహితు లందరూ వాసు అని పిలుస్తుంటారు. ధర్మరాజు జమీందారు వీరరాజు గారి మనుమడు. ఒకసారి ధర్మరాజు వెంట శ్రీనివాస్ అతడి ఊరికి వెళ్తాడు. ధర్మరాజు తాత వీరరాజుకు వాసు అంటే మనుమడితో సమానమైన ప్రేమాభిమానాలు వుంటాయి. పడవ దిగి ధర్మరాజు ఊరి శివారుల్లోకి వెళ్ళిన తర్వాత వాసుకు ఒక అమ్మాయి తారస పడుతుంది. ఆమె వట్టి ఆకతాయి పిల్ల. ఆమె ఒక చిన్న దొంగతనం చేసి అది వాసు పై మోపే ప్రయత్నం చేసి విఫలమవుతుంది. ఆమె పేరే శ్రీలక్ష్మి. అందరూ ముద్దుగా లక్ష్మి అని పిలుస్తుంటారు. ఒకరోజు ధర్మరాజుకు పెళ్ళి సంబంధం చూసే క్రమంలో లక్ష్మి ఇంటికి వెళ్తారు వాసు, ధర్మారాజులు. ఆ సంబంధం చూడబోయేది లక్ష్మికే. ధర్మరాజు ముందు లక్ష్మి తనకు మెల్లకన్ను వున్నట్టు నటిస్తుంది. వాసుకు లక్ష్మికి అలాంటి వైకల్యం ఏదీ లేదని తెలుసు, కాని ధర్మరాజు మాత్రం

భయపడ్తాడు. అదే సమయంలో వారికి కాఫీ ఇవ్వడానికి వచ్చిన చిట్టి (రమాప్రభ) కాఫీ అందిస్తూ ధర్మరాజును చూసి పలుమార్లు కన్నుకొడ్తుంది (కన్నుగీటుతుంది). అప్పటిదాకా ఎంతోమంది అమ్మాయిలను బుట్టలో వేసుకోవడానికి ప్రయత్నాలు చేసి విఫలమైన ధర్మరాజుకు చిట్టి మొదటిసారి చూడగానే కన్నుకొట్టడం నచ్చి ఆమెతో ప్రేమలో పడతాడు. మరోవైపు వాసు లక్ష్మి తో ప్రేమలో పడ్తాడు. వారి మధ్య ప్రేమ సన్నివేశాలు ఒకరితో ఒకరు దోబూచులాడినట్లుగా కొనసాగుతాయి. ఒకరోజు వాసు తన ప్రేమను గూర్చి ఇరు కుటుంబాలకు చెప్పి ఒప్పించి పెళ్ళి చేసుకుంటాడు. మరోవైపు ధర్మరాజు, చిట్టిల వివాహం కూడా జరుగుతుంది.

ఇక వాసు కుటుంబం విషయానికి వస్తే అన్నా వదినలు పాండురంగారావు (పాండు) – జానకి, అమ్మానాన్నలు అల్లు రామలింగయ్య – నిర్మలమ్మ. పాండు చిన్న ఉద్యోగం చేస్తుండగా, జానకి అతని కన్నా మంచి ఉద్యోగంలో వుంటుంది. కాని ఒక గృహిణిగా మాత్రం నడుచుకోదు. ఆలస్యంగా నిద్రలేవడం, కుటుంబ సభ్యుల పట్ల అమర్యాదగా వుండటం చేస్తుంది. చదువుకున్న అమ్మాయి, పైగా ఉద్యోగం చేస్తుంది అనే కారణంచే కుటుంబ సభ్యులంతా సర్దుకుపోతుంటారు. వాసు పెళ్ళి తర్వాత కోడలిగా వచ్చిన లక్ష్మి కోడలుగా చక్కగా నడుచుకుంటుంది. కాని పెళ్ళి చేసుకొని చాలాకాలం గడిచినా సంతానం కలగదు, దాంతో పాండు– జానకిల కుమారుడిని బావ కొడుకులా కాకుండా స్వంత కుమారుడిలా ప్రేమానురాగాలతో పెంచుతూ వుంటుంది లక్ష్మి. జానకికి తన కొడుకు తనతో కన్నా లక్ష్మితో ఎక్కువ చనువుగా వుండడం నచ్చదు. అంతేకాక కోడళ్ళ మధ్య పోలిక వచ్చే ప్రతిసారి అందరూ లక్ష్మి వైపే వుండడం నచ్చక జానకి తరచూ లక్ష్మి కలహాలకు పోతుంది. జానకి అవే కలహాలలో మాట్లాడుతూ **'నీ లాంటి గొడ్రాలి చేతిలో పెరిగితే నా బిడ్డ ఆయుస్సు తగ్గుతుంది'** అంటూ లక్ష్మిని నిందిస్తుంది. ఒకరోజు లక్ష్మి గుడికి వెళ్తూ జానకి మాటలకు భయపడి బాబును వెంట తీసుకెళ్ళకుండా ఒంటరిగా వెళ్తుంది. ఇంట్లో తను అమ్మగా భావించే చిన్న బాబుకు లక్ష్మి కనపడకపోయే సరికి నాన్నమ్మ– తాతయ్యల వద్దకు వెళ్ళి అమ్మ నన్ను గుడికి తీసుకువెళ్ళలేదు. నేను గుడికి వెళ్తానంటూ ఏడుస్తూ గోల చేస్తాడు. పిల్లాడి ఏడుపును చూసి జాలిపడి నాన్నమ్మ సరే నువ్వూ వెళ్ళమని చెప్తుంది. ఆ పసి బాబు సంతోషంగా గుడికి వెళ్తాడు. అదే సమయంలో గుడిలో దేవుడి రథయాత్ర వుంటుంది. భక్తుల కోలాహలం మధ్య తాను అమ్మ అని పిలిచే పిన్నిని వెతుక్కుంటూ భయంభయంగా ఆ గుంపులో వెళ్తుంటాడు. అలా వెళ్ళే సమయంలో దురదృష్టవశాత్తు ఆ అబ్బాయి రథం కింద పడి మరణిస్తాడు. ఆ సంఘటనతో లక్ష్మి షాక్ కు గురవుతుంది. ఆ పిల్లాడి ఊహల్లో మతిభ్రమించి, కనిపించే ప్రతి పిల్లాడిలో ఆ బాబునే చూసుకుంటూ ఇంటివాళ్ళందరికీ దూరంగా మతిస్థిమితం లేని మనిషిగా మారి వెళ్ళిపోతుంది. అలాంటి లక్ష్మిని చూసి ఒక తాగుబోతు చేరదీస్తాడు. వాసు లక్ష్మిని వెతుక్కుంటూ పోలీసు స్టేషన్లో కంప్లైంట్ ఇస్తుండగా అదే సమయంలో అక్కడికి వేరొక కారణం చేత ఆ తాగుబోతును స్టేషన్‌కు తెస్తారు పోలీసులు. టేబుల్‌పై వున్న లక్ష్మి ఫోటోను చూసి ఆ తాగుబోతు ఆమె నా దగ్గర వుందని చెప్పి వాసు, పోలీసులను వెంట తీసుకొని వెళ్తాడు. వాసు మతిస్థిమితం లేని లక్ష్మిని తీసుకు వెళ్ళి పిచ్చాసుపత్రిలో చేర్చి చికిత్స ఇప్పిస్తాడు. కాని అప్పటికే ఆమె గర్భవతి అని తెలుస్తుంది. వాసు ఆమెను జాగ్రత్తగా కాపాడుతూ లక్ష్మికి పుట్టిన పాపను తీసుకెళ్లి ఆ పాపను పెంచే బాధ్యతను తన అన్న– వదినలైన పాండు–జానకిలకు అప్పజెప్తాడు. అప్పటి నుండి లక్ష్మి ఎప్పటికైనా మునుపటి మనిషిగా మారుతుందనే ఆశతో ఆమెకు సేవలు చేస్తూ జీవిస్తుంటాడు శ్రీనివాస్ (వాసు). అలా పాండు– జానకి ల వద్ద పెరిగి పెద్దదైన పాపే శోభ. ఇలా వాసు తన గతాన్ని తన కూతురైన శోభకు వివరిస్తాడు.

ఇన్నాళ్లు తను ద్వేషించిన బాబాయే తన తండ్రి అని తెలిసి శోభ పశ్చాత్తాపం చెందుతుంది. తన తల్లిని ఎలాగైనా మునుపటిలా మార్చాలని నిర్ణయించుకుంటుంది. దానికోసం మూర్తిమత్వంలో తను, తన తల్లి అచ్చు గుద్దినట్లు కనిపిస్తామనే విషయాన్ని నిర్ధారించుకుంటుంది. తల్లి లక్ష్మిని మార్చే ప్రయత్నంలో శోభ తన కొడుకు ముందు రావణాసురుడి వేషంవేసి పాట పాడుతూ కొడుకును భయపెడుతూ బాబుకు తన అమ్మే ఆ వేషం వేసి భయపెడుతుంది అని గుర్తుపట్టేలా చేస్తుంది. మరోసారి పులి వేషం వేసి పాట పాడుతూ బాబు తనను గుర్తుపట్టేలా చేస్తుంది. ఒకరోజు బాబును తన తల్లి లక్ష్మి వద్దకు వెళ్ళేలా ప్లాన్ చేసి ఆసుపత్రికి పంపుతుంది. పిచ్చిదైన లక్ష్మిని చూసి ఆ పసిబాబు మునుపటి లానే తన తల్లి అని భావించి ప్రేమగా పరుగెడతాడు. ఆ పిల్లాడి ప్రేమకు లక్ష్మి (చనిపోయిన బాబు) నేను వెతుక్కుంటున్న ఆ బాబే ఈ బాబు అని భ్రమించి ప్రేమగా దగ్గరికి తీసుకుని ఉప్పొంగిపోతుంది. శోభ తన బాబును తల్లి లక్ష్మి వద్దే వదిలేసి తన తల్లి ఎప్పుడూ అలాగే సంతోషంగా తన తండ్రితో కలిసి వుండాలనే ఆలోచనతో అమెరికాకు బయల్దేరుతుంది. వాసు ఎన్నో ఏళ్లుగా వేచిచూస్తున్న నా లక్ష్మి మునుపటిలా నా చెంతకు చేరిందనే ఆనందంతో లక్ష్మి, బాబులను దగ్గరికి తీసుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

**చిత్ర విశేషాలు :**

**"జీవన జ్యోతి"** ఈ చిత్రానికి ఆ పేరు ఎంత సరియైనది అనే విషయానికి చిత్రం మొత్తం ఎంత సమాధానంగా నిలుస్తుందో, అలాగే చిత్రంలో ఒక సన్నివేశంలో వాసు, లక్ష్మిల మధ్య జరిగే సంభాషణ కూడా ఈ చిత్రానికి ఆ నామకరణం ఎంత సార్థకమో తెలియజేస్తుంది. ఆ సన్నివేశం ఇలా వుంటుంది : వాసు రోజు మతిస్థిమితం లేని తన భార్య లక్ష్మి వద్దకు వెళ్ళి సపర్యలు చేసేటప్పుడు ఆమె ఒకరోజు వాసును ఇలా ప్రశ్నిస్తుంది. ఇంతకు నువ్వెవరు?

నాకు నువ్వేమవుతావ్? అంటుంది. దానికి సమాధానంగా వాసు **"గుడికి దీపం ఏమవుతుంది? దీపానికి వెలుగు ఏమవుతుంది? అదే నువ్వు నాకవుతావ్"** అంటాడు. ఈ మాటలను పరిశీలిస్తే దీపం (జ్యోతి) లేని ఏ గుడి కూడా గుడి అన్పించుకోదు, వెలుతురు ఇవ్వలేని దీపమంటూ వుండదు. వెలిగే దీపం గుడికి (దేవుడికి) అర్థాన్నిస్తుంది. సాధారణంగా మన సమాజంలో భార్య పతియే దైవంగా జీవిస్తుంది. భార్య/ స్త్రీ తోడు లేని మగాడి జీవితం బోసిపోతుంది. గుడికి దీపం విలువనిచ్చినట్టుగానే మగాడి జీవితానికి స్త్రీ తోడు ఒక అర్థాన్నిచ్చి నిలబెడుతుంది అనే విషయాన్ని తెలుపుతుంది. శ్రీనివాస్ జీవితానికి జ్యోతి (దీపం) వంటిది లక్ష్మి. ఒకానొక సందర్భంలో దేవుడికే ఆ జ్యోతిని కాపాడుకునే పరిస్థితి వస్తే? ఏమిటి అనే దానికి సమాధానంగా ఈ చిత్రం వుంటుంది.

ఈ చిత్రంలో లక్ష్మి, శోభ రెండు పాత్రలను వాణిశ్రీ గారే పోషించారు. వాణిశ్రీ నటన రెండు పాత్రల్లోనూ అద్భుతంగా వుంటుంది. చిత్రంలో ప్రధాన పాత్ర వాణిశ్రీ గారిదే. వాణిశ్రీ లక్ష్మి పాత్రలో పల్లెటూరి పిల్లగా, మెట్టినింట్లో చక్కని ఇల్లాలుగా, యవ్వనంలో తుంటరిగా వున్న అమ్మాయిగా, వివాహం తర్వాత ఇంట్లో బాధ్యతలు మోస్తూ పరిణతితో కూడిన వ్యక్తిగా మెలగడం, స్వంత కుమారుడు కాకపోయినా బావ పొందు కుమారుడిని ప్రేమగా పెంచి పెద్దచేస్తున్న సమయంలో ఒక దురదృష్టకర సంఘటన వల్ల ఆ బాబు మరణించడంతో ఆమె మతిస్థిమితం లేని మనిషిగా మారడం, మరోవైపు కూతురు శోభగాను ఇలా విభిన్న నటనా వైరుధ్యాలు గల పాత్రలను చక్కగా పోషించింది. విభిన్న కాలాలు, కోణాల సమ్మేళనంతో కూడిన పాత్రల్లో వాణిశ్రీ అభినయించడం విశేషం.

దర్శకుడు ఈ చిత్ర పతాక సన్నివేశాన్ని కొత్త రీతిలో రూపొందించారు. కథను ఎలా ముగించబోతున్నాడు అనే విషయం ఊహలోకి కూడా తీసుకోలేనంత కొత్తగా వుంటుంది... బాబు మరణించిన తర్వాత పిచ్చిదానిలా మారిన లక్ష్మి మునుపటిలా మారాలంటే మళ్ళీ ఆ బాబు ప్రేమను అదే స్థాయిలో వ్యక్తం చేసే మరో బాబు కావాలి. అంటే లక్ష్మి పిల్లవాడికి ప్రేమను పంచడం ఎంత ముఖ్యమో? ఆమె ప్రేమ వాత్సల్యానికి అదే స్థాయిలో స్పందించేలా ఆ అబ్బాయిని సిద్ధం చేయాలి. దానికోసమై శోభ పతాక సన్నివేశంలో తన కుమారుడు (బాబు) ముందు రావణాసురుడి వేషం వేసి పాట పాడుతూ అభినయిస్తూ చివరికి ఆ వేషం వేసింది అమ్మే (శోభ) అని గుర్తుపట్టేలా చేస్తుంది. మరోసారి పులి వేషం వేసి తానే ఆ వేషం వేసినట్లు గుర్తు పట్టేలా చేస్తుంది బాబుతో. ఇలా తన అమ్మే ఆ వేషం వేసిందని గుర్తుపట్టగానే ఆ అబ్బాయి ఒక్కసారిగా తల్లిపై ప్రేమను కురిపిస్తూ హత్తుకుంటాడు. శోభ తల్లి లక్ష్మి మూర్తిమత్వంలో శోభలాగే ఉంటుంది కాబట్టి ఆ విషయాన్ని అవకాశంగా చేసుకొని లక్ష్మిని మార్చడానికి అవకాశంగా భావిస్తుంది




శోభ. ఒకరోజు శోభ తన కుమారున్ని ఆమె తల్లి లక్ష్మి వద్దకు తీసుకెళ్లి పక్కకు పోతుంది. అదే సమయంలో లక్ష్మి బాబు కోసం పాట పాడుతూ వుంటుంది. బాబు ఆ పాట పాడుతున్నది అమ్మే అని భ్రమించి అమ్మను గుర్తుపట్టాననే ఆనందంలో ఆమె వద్దకు పరిగెత్తుకెళ్ళి హత్తుకుంటాడు. ఆ బాబు ను దగ్గరికి తీసుకుని తాను వెతుకుతున్న బాబు నా బాబు అని ఇన్నాళ్ళకు మళ్ళీ దొరికాడు అనే సంతోషంలో మునుపటిలా మారుతుంది. శోభ తన తల్లి లక్ష్మిని జీవితాంతం సుఖంగా బతికేలా చేయగలిగే ఔషధం తన తల్లి మాత్రమే అని భావించి ఆ బాబును తన తల్లిదండ్రులైన శ్రీనివాస్- లక్ష్మి దంపతుల వద్ద వుంచి అమెరికా బయలుదేరడం తో కథ సమాప్తం అవుతుంది.

చిత్ర కథానాయకుడు శోభన్ బాబు గారి పాత్ర అటు వృద్ధుడిగా, ఇటు యువకుడిగా స్థిరమైన వ్యక్తిత్వం కలిగిన, పరిస్థితులను భరించగలిగేంత సహనం గల వ్యక్తిగా వుంటుంది. సోగ్గాడు, అందగాడైన శోభన్ బాబు గారి నటన రెండు వయస్సులలో వైవిధ్యానికి తగినట్లుగా వుంటుంది. యవ్వనంలో లక్ష్మి సరదా స్వభావాన్ని చూసి ప్రేమించిన వాసు వివాహం వరకే ఆ ప్రేమను చూపే మనిషిగా కాకుండా, ఆమె మతిస్థిమితం కోల్పోయిన తర్వాత కూడా ఆమెను మునుపటిలా మార్చడానికి ప్రయత్నం చేస్తాడు. ఆమె మళ్ళీ ఎప్పటిలా మారి తన జీవిత దేవాలయాన్ని వెలిగించే జ్యోతి అని ఆమె కోసం వేచిచూస్తుండడం ఇవన్నీ కలగలిసి శోభన్ బాబు ప్రేమికుడి గాను, భర్త గాను మంచి పాత్ర పోషించారు.




కె. విశ్వనాథ్ గారి ముందు చిత్రాలతో పోల్చితే ఈ చిత్రంలో హాస్యం పాలు ఎక్కువ. వాసు స్నేహితుడిగా ధర్మరాజు పాత్రలో రాజాబాబు నటన ప్రేక్షకులను నవ్విస్తుంది. ధర్మరాజు శ్రీనివాస్‌ను తీసుకొని పెళ్లి సంబంధానికి వెళ్ళినప్పుడు చిట్టి(రమాప్రభ) తనకు కన్ను గీటిందని (కన్ను కొట్టిందని) ఉబ్బితబ్బుబ్బైపోయి ఆమెను వివాహం చేసుకుంటాడు. కాని తర్వాత చిట్టి అలా కన్నుకొట్టడం నరాల బలహీనత వల్ల కల్గిన వైకల్యం అని తెలిసి నిర్ఘాంతపోతాడు. అంతేకాక ధర్మరాజు, చిట్టిలకు కల్గిన పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి లేడీ టీచర్ వచ్చినప్పుడు అందులో ఒక పిల్లాడు టీచర్‌కు కన్ను కొడ్తుండడంతో ఆమె భయపడి పారిపోవడం వంటి సన్నివేశాలు కామెడీగా వుంటాయి.

మరోవైపు శ్రీనివాస్ తండ్రి పాత్రలో అల్లు రామలింగయ్య ఇల్లు గడవడానికి ట్యూషన్ చెప్తున్నప్పుడు పిల్లలిచ్చే కూరగాయలు, పండ్లను తీసుకొని ఆ రోజుకు వారిని కొట్టకుండా వదిలేయడం చేస్తాడు. అది చూసి భార్య నిర్మలమ్మ పిల్లలకు చదువు చెప్పమంటే లంచం ఇవ్వడం నేర్పిస్తున్నారా అంటుంది. దానికి బదులుగా అల్లు గారు దాన్ని లంచం అనకూడదే శ్రీకారం అనాలి అని సర్దిచెప్పడం గమ్మత్తుగా వుంటుంది. ఇక శ్రీనివాస్- లక్ష్మి లు ప్రేమలో పడడానికి ముందు వచ్చే సన్నివేశాలన్నీ చమత్కారంగా వుంటాయి.

ఈ చిత్రానికి మూలకథ కె.రామలక్ష్మి అందించగా పాటలకు సాహిత్యాన్ని సి.నారాయణ రెడ్డి గారు అందించారు. ఈ చిత్రంలో మొత్తం ఆరు పాటలుంటాయి. సంగీతం కె.వి.మహదేవన్ గారు అందించారు. చిత్రానికి హృదయం వంటి పాట, నేటికీ ప్రేక్షకుల హృదయాల్లో కొలువుదీరిన పాట ఒకటుంటుంది. అది

**"ముద్దుల మా బాబు నిద్దరోతున్నాడు/ సద్దు చేశారంటే ఉలుకులికి పడతాడు / గోపాల కృష్ణయ్య రేపల్లెకు వెలుగు/ మా చిన్ని కృష్ణయ్య లోకానికే వెలుగు"**

ఇదే పాట పతాక సన్నివేశంలో శోభ మొదటిసారిగా మతిస్థిమితం లేని తన తల్లిని చూసినప్పుడు ఎంతో భావోద్వేగంతో ఇలా వుంటుంది.

**"ముద్దుల మా బాబు నిద్దరోతున్నాడు/ సద్దు చేశారంటే ఉలుకులికి పడతాడు / నా పాటకు నే పాడే లాలిపాట / ఈ లోకాలన్నింటికి జోలపాట"**

అంటూ సాగుతుంది. పతాక సన్నివేశంలో తల్లీకూతుళ్ళ ప్రేమకు పొందిక కుదిరేలా చేసి రూపొందించిన ఈ పాట ప్రతీ ప్రేక్షకుడి హృదయాన్ని కదిలిస్తుంది.

**"జీవన జ్యోతి"** చిత్రానికి 1975 వ సంవత్సరంలో నంది అవార్డు లభించింది. అలాగే శోభన్ బాబు గారి నటనకు కూడా నంది అవార్డు లభించింది. దానితో పాటు ఫిల్మ్ ఫేర్ అవార్డుల్లో భాగంగా ఉత్తమ చిత్రంగా, ఉత్తమ నటుడిగా శోభన్ బాబుకు, ఉత్తమ నటిగా వాణిశ్రీకి, ఉత్తమ దర్శకుడిగా కె.విశ్వనాథ్ గారికి మొత్తంగా 4 ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ పొందిన చిత్రం "జీవన జ్యోతి".

1985లో జితేంద్ర- జయప్రదలు నాయకానాయికలుగా కె.విశ్వనాథ్ గారి దర్శకత్వంలో "సంజోగ్" పేరుతో రీమేడ్ అయింది. కన్నడంలో "బాలిన జ్యోతి" పేరుతో విష్ణువర్ధన్ తో రూపొందించారు.

విధి సవాలుకు మనిషి బలహీనుడైతే పరిణామాలెలా వుంటా యనడానికి ఉదాహరణగా లక్ష్మి పాత్ర వుంటే, సాగే కాలం ప్రతి సమస్యకు ఏదో ఒక రోజు పరిష్కారం చూపుతుందనే ఆశావహ దృక్పథంతో కూడినదై శ్రీనివాస్ పాత్ర వుంటుంది. ఏదేమైనా కాలం గాయం చేయగలదు, మాన్పగలదు. మనం చేయాల్సిందల్లా కాలానికి ఎదురొడ్డి బలంగా నిలబడడమే ముఖ్యం అని తెలిపే చిత్రం "జీవన జ్యోతి".

| | |
|---|---|
| **చిత్రం.** | **: జీవన జ్యోతి** |
| **విడుదల** | **: 1975** |
| **మూలకథ** | **: కె. రామలక్ష్మి** |
| **మాటలు** | **: సముద్రాల జూనియర్** |
| **సంగీతం** | **: కె.వి.మహదేవన్** |
| **నిర్మాత** | **: డి.వి.ఎస్.రాజు** |
| **దర్శకత్వం** | **: కె.విశ్వనాథ్** |

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

### వాక్యములు

గోలకొండ నవాబుల కాలపు శాసనములందలి వాక్యములలో కొన్నిటి యందు సమాపక క్రియల్లేవు. అట్టివాని యందు భూత తద్ధర్మ క్రియాజన్య విశేషణములతో గూడిన విశేష్యములతోను, తచ్ఛద్దాను ప్రయోగములతోను కూడిన భూత తద్ధర్మ క్రియాజన్య విశేషములతోను అర్థము సూచించపబడుచున్నది.

భూతకాల క్రియాజన్య విశేషముతో గూడిన విశేష్యము.

కావేరి పాక కట్టించ్చిన.. S.i.i Vol x, No.762

చేకొనవనవ ధరించ్చిన... S.i.i Vol x, No.745

బ్రాహ్మణి జంప్పిన.. S.i.i Vol x, No.745

వేయించ్చిన.. S.i.i Vol x, No.753

దున్ని పండించ్చిన నానాధాన్యమున్ను... S.i.i Vol x, No.753

తచ్ఛబ్దాను ప్రయోగముతో గూడిన భూత తద్ధర్మ క్రియాజన్య విశేషణము

1. ఇందుక్కు ఎవరం గనక తప్పినాను గంగకర్త్తా గోవు బ్రంహ్మల వధ శేశిన పాపానం బోవువారు ... S.i.i Vol x, No.748
2. యెవరు తప్పినా తమ తల్లితంద్రాదుల వారణాశిలో వధించ్చిన పాపాన బోదురు ... S.i.i Vol x, No.758
3. యీ ధర్మాను యవరు విఘాతం చేశినా వారు కాశిలో గంగాతీరమందున గోహత్య బ్రంహ్మ హత్య చేశిన పాపాన బోదురు ... S.i.i Vol x, No.763
4. శూద్రులు తప్పితే కాశిలోన బ్రాంహ్మల వధించ్చిన పాపాన బోదురు ... S.i.i Vol x, No.769

### సమాసములు

గోలకొండ నవాబుల శాసనములందు నవాబుల బిరుదములు, సంస్కృతాంధ్ర ఉరుదూ సమాసయుతములు ఉన్నవి. కొన్ని వాక్యములందు ద్విపద, బహుపద సమాసములు కనిపించుచున్నవి. ఈ కాలపు శాసనములలోని కొన్ని సమాసములిచట నుదహరింపబడుచున్నవి.

1. సులుతాన్ నిజహితుండైన ... S.i.i Vol x, No.743
2. నైజు ఠానేదారి ... S.i.i Vol x, No.745
3. మహా పాత్రుని కొమారుడు ... S.i.i Vol x, No.744
4. నీలకంఠేశ్వరుని ... S.i.i Vol x, No.746
5. గరుడ కంభము ... S.i.i Vol x, No.746
6. తల్లిదంద్రాదుల ... S.i.i Vol x, No.749
7. మోతిమ దవులతుల అలియు ... S.i.i Vol x, No.751
8. అయాలతుల బాహిరామల్కు ... S.i.i Vol x, No.751
9. ముంగోటలు ... S.i.i Vol x, No.751
10. యిజారతి గ్రామము ... S.i.i Vol x, No.752
11. యేకలాసఖాన చంద్రునికి ... S.i.i Vol x, No.753
12. నాలుగు యెడ్లఏరు ... S.i.i Vol x, No.753
13. పొల్లిపసరం ... S.i.i Vol x, No.753
14. ఘడకట్టడ ... S.i.i Vol x, No.758
15. కావేరి పాక కట్టించ్చిన ... S.i.i Vol x, No.762
16. గంగ్గాతీరమందున ... S.i.i Vol x, No.763
17. మొఖాసాసముతు ముక్తీశ్వరం ... S.i.i Vol x, No.765
18. హజరతు సులుతాను ... S.i.i Vol x, No.766
19. మామిడిపట్ల నేల ... S.i.i Vol x, No.766
20. సంగు శాసనాలు ... S.i.i Vol x, No.767
21. మడిపిచ్చకొలత ... S.i.i Vol x, No.772
22. అలంగీరు పాధాం ... S.i.i Vol x, No.775

గోలకొండ నవాబుల కాలపు శాసనములలోని అన్యభాషా పదములతో గూడిన తెలుగు వాక్యములు ఈ క్రింద నుదహరింపబడుచున్నవి.

1. భవుమవారంనాండు హజరతి యభురాహింపాదశహ వోదయలుంగారు తమ నామజాదు అంప్పితేను S.i.i Vol x, No.751
2. యరీ తలయిభురాహిము పాదశహ వొదయల పుత్రుండు మహమ్మదు కుల్లీ పాదశహ వొదయలుంగారు క్రితమి జయసనాలు ... S.i.i Vol x, No.751
3. పాయకట్టు దారలున్ను తిరుగాంబడి హరాంఖోర్లై కొండవీటి శీమలోను వుండంగాను హజరతి పాదుశహ వొదయలుంగారు ... S.i.i Vol x, No.751
4. మల్కు వొడయలుంగారు గోలకొండ వెళ్ళి వచ్చెనన్న ఖబురు విని యహరాంఖోర్లు అఇనవాండ్లు అంద్దరున్ను సూర్యోదయం అయితేను చీంకట్లు విచ్చిపోయగట్టె యక్కడివాండ్లు అక్కడనే యదాయదలై పారిపోయిరి ... S.i.i Vol x, No.751
5. దీనాంధకృపణపంగులు మోదలయిన తిరిపెలకుదరి వేగుల కును ... S.i.i Vol x, No.703
6. కొండ్డపల్లికి దక్షిణాన పెయ్యలు గలుపకును కిదదరబాజా గడీలంగర సాగించ్చి ... S.i.i Vol x, No.743
7. తురకలరాజు దప్పినా ముసాబుకుందప్పిన దోషాన తమ గురువులు పేరాలను హత్తె సేసిన దోషానంబోవువారు

...S.i.i Vol x, No.745

8. హవాలాదారు కిరియాయతి రావిపూండి స్థలం గ్రామాల ప్రజలు ...S.i.i Vol x, No.708

9. మహమందు ఖుల్లిపాదశహరజా అయఫహ్జ్జ ప్రమానను ...S.i.i Vol x, No.749

10. మోతి మదవులతుల అలియుతలలల అలియా – అనల తనతల అయాలతుల బాహిరు మల్క అమీమలక వొడయాలుగారు ...S.i.i Vol x, No.751

11. – తిసైను తిస్సామి యాచ ౧ మహాగువ్వాలు సన అలపు ౧౦౦౦– కు అగు నుండు ...S.i.i Vol x, No.751

12. మృత్తిజా నగరం అగ్రహారాలలోను మాయజారతి గ్రామము చామలన్ మూండిని ...S.i.i Vol x, No.752

13. మూండోపంట నుండి యెల్లకాలాలకున్ను సలాసుమిందు నాల్గోపాలు ...S.i.i Vol x, No.753

14. దివానాన జమచేసి రావారి ...S.i.i Vol x, No.753

15. యీ కాసుల వల్ల అయిన పదార్థం మొఖాసీలు అతికార్లు కాంపు కరణాలు ...S.i.i Vol x, No.753

16. యేలు బడిముఖాసీయిచ్చివుండ్రిగనక S.i.i Vol x, No.758

17. మహమ్మందు అమీను హవాలాదారు కిల్లెము బారకు మహమదా నగరుంగారి రొఖాను జాయతు వశాహ మత్తు దస్తుగహా మల్కియ సుమాయిలుఖావానుడె హాయకిల్లె ముత్తా జాంన్నగరు

## మూసీ పదవినోదం - 30

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మ | 3 గ | 4 ఉ | రు | ము | X | X | 11 గ |
| 2 హా | యి | హా | యి | గా | 13 జా | 12 బి | ల్లి |
| ను | X | 5 ను | రు | గు | ద | బ్బ | లు |
| 6 భా | 7 క్ష | X | X | 9 వే | ర | రిం | X |
| 10 వు | ప | ద | 15 శ | X | 17 లా | చె | ప్పా |
| లు | ణ | X | వ | 16 ఆ | డు | డి | X |
| X | 14 కు | వ | ల | ము | X | 18 నే | ను |
| 8 అ | డు | సు | తో | క్క | నే | ల | X |

రోయట్టహాయ ...S.i.i Vol x, No.759

18. కసుబెతాండి కొండ్డతా। శ్యదతువని కోబతుప – హ్నావజారతు వశహ్మంమత్తు దస్తుగ హసైదు అబ్దల్లాంగారి మొకాసావుండ్డగాను ...S.i.i Vol x, No.759

19. పరిమితన ఖామహతాజుకిల్లెమజు కూరువారు గరక సాశిజారు చేస్తు ఉండ్డంగాను ఆతాండికొండ్ల సముతువారున్ను ఆపరిమి వారున్ను వరహుజురుకు వచ్చి మాత్మా చేశిరి ...S.i.i Vol x, No.759

20. ఆ పరిమివారు గరక సాశాయనుహాజితులేదు ...S.i.i Vol x, No.759

21. పరిమివారు గరక సాచేగినండ్కా మహంమదమిను హుజురుకు వచ్చి మాల్కు చేశిరి మనస్కు తెచ్చుకొని ఆ పరిమి వారి మారద్దు ఆయును శామీ మహసూలు మీరు – మామీను చేసుకొని సంగ్గ శాసనాలు కానరాని జాగాలను వేయించేది ...S.i.i Vol x, No.759

22. కిల్లేపరగణే కావేరి పాక కట్టించ్చిన మశీదు గటి లావఖానిన్న ౧౦౮౪ యేదు మొదలు కొని ౧౦౮ వ యందు ముస్తయదు ఆయను ...S.i.i Vol x, No.762

23. తేజుఖాను ఖావందు దారు నిగారు కట్టించిరి ...S.i.i Vol x, No.765

24. మీరా శిడారు ఖురుబుదాలు అశేసం అయినవారు ...S.i.i Vol x, No.765

25. యవ్వరు నిగావానులు వచినా ...S.i.i Vol x, No.765

26. తిర్తులు అయిరా మశీదులోపం వినికోశినట్టు ...S.i.i Vol x, No.765

27. అందుకు యేల్నివారికి మాత్మాయేతను ...S.i.i Vol x, No.767

28. మామూలావారి పేరను అమర హిస్సాచిని తెరుగడ శెయ్యుమని ఫర్మాను సాదిరులై వుండ్డంగాను ...S.i.i Vol x, No.767

29. యెడ్లపల్లి కింద జమ చేశి మహజ్జరు చేశి హుజూరుకు పంపిన తర్వతను ...S.i.i Vol x, No.767

30. ముద్ర కత్తిాల ఇన మార్జా అజంనజరు బేగు పేజుదారు ...S.i.i Vol x, No.769

31. అవరంగజేబు సుచాఖాను బాజరురజబుఖానుదు ఫౌజుదారి చేస్తూపుతేరి కాపు కరణాలూ తింమాభట్లకు ఫరుమానా ...S.i.i Vol x, No.775

32. బహుధాన్య సంవత్సర ఆదినెల మొదటి తేది ...S.i.i Vol x, No.781

(సశేషం...)

మూసీ సాహిత్యధార
పుస్తక సమీక్ష


# సంకుచితత్వాన్ని ప్రశ్నించిన గ్రంథం
# 'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం'

**ఇమ్మిడి మహేందర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9505 645 706

ఒక రచన సాధించే అత్యుత్తమ ప్రయోజనం పాఠకున్ని అంతవరకు ఉన్న తన అవగాహనను తిరిగి వ్యాఖ్యానించుకునేలా చేయడమే. ఈ రచన ఆ ప్రయోజనాన్ని సాధించింది. సాహిత్యంలో అప్పటివరకు స్థిరపడ్డ భావాలను, కొత్త భావాలకు చోటివ్వలేని సంకుచితత్వాన్ని ప్రశ్నిస్తుంది ఈ పుస్తకం. సాహితీ ప్రపంచంలో పలకడానికి సిద్ధపడని పేరు బి.సి. వాదం. ఇది వాస్తవం. కొందరు అప్రయత్నంగా తప్పుకుంటే మరికొందరు ఉద్యేశ పూర్వకంగా తప్పుకుంటారు. మరికొందరు థాట్ పోలిసింగ్‌కి గురవుతారు. మరికొందరు కవిత్వాలకు ఉద్యమాలు రాలవంటారు. ఇన్ని నేపథ్యాల్లోంచి అట్టెం దత్తయ్య "తెలంగాణ బి.సి. వాదం" గురించి మాట్లాడుతున్నారు. పుస్తకం పేరు "తెలంగాణ బి.సి. వాద సాహిత్యం". దాదాపు 257 పుటలతో "ప్రణవం" పబ్లికేషన్స్ ద్వారా ఈ పుస్తకాన్ని అందిస్తున్నారు.

ఈ పుస్తకంలో 7 అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయ విభజన అకడమిక్ పరిశోధనలకు, వాటి విధివిధానాలకు చాలా దగ్గరగా ఉంది. మొదటి అధ్యాయంలో **'తెలంగాణ బి.సి. వాద సాహిత్యం – పరిచయం'** పేరుతో తెలుగులో ఉన్న బి.సి. వాద సాహిత్యానికి ముందు వెనుకలను ప్రస్తావించారు. రెండవ అధ్యాయంలో **'తెలంగాణ పద్య కవిత్వం – బి.సి.వాదం'**, తరువాత వరుసగా **'తెలంగాణ పాట – బి.సి. వాదం', 'తెలంగాణ వచన కవిత్వం – బి.సి. వాదం', 'తెలంగాణ కథ – బి.సి. వాదం', 'తెలంగాణ నవల – బి.సి. వాదం', 'తెలంగాణ బి.సి.వాద సాహిత్య విమర్శ'**లతో కూడిన అధ్యాయాలు ఉన్నాయి. పద్య సాహిత్యానికన్న ముందు పాటకు సంబంధించిన విశ్లేషణ ఉండి వుంటే బాగుండేది. ఈ పుస్తకం లోపటికి వెళ్లడానికి ప్రధాన ద్వారం, బి.సి.వాదానికి తాత్త్విక నేపథ్యాన్ని అందించే రోడ్ మ్యాప్ డా. ఎస్. రఘు రాసిన **"బహుజన వీలునామా"** అనే ముందుమాట. భవిష్యత్తు తార్కికత డా. సాగి కమలాకర శర్మ రాసిన **"సొంత గొంతుకల వెలుగు"** అనే ముందుమాట. ఈ రచయిత దాదాపు 190కి పైగా రచయితల సాహిత్యాన్ని స్పృశించారు. బి.సి. సాహిత్యానికి సంబంధించినంత వరకు ఈ పుస్తకం సాహిత్య రాశి. ఈ పుస్తకాన్ని స్థూలంగా **"తెలంగాణ బి.సి కులాల ప్రస్తావన ఉన్న సాహిత్య సమీక్ష"**గా చెప్పవచ్చు.

ఒక రచన, సంబంధిత విషయంపై మనకున్న అభిప్రాయాలను, సమాచారాన్ని సభ్య సమాజానికి తెలియజేయాలనే ఉత్సుకతలోంచి, అవసరంలోంచి బయటకు వస్తుంది. అవి కొన్నిసార్లు వ్యక్తిగత అవసరాలైతే, మరికొన్నిసార్లు సామాజిక అవసరాలు. ఈ విధంగా



**తెలంగాణ బి.సి.వాద సాహిత్యం**
**రచయిత : అట్టెం దత్తయ్య**
**పుటలు: 257**
**వెల : 230/–**
**ముద్రణ: ప్రణవం పబ్లికేషన్స్.**

చూసుకున్నప్పుడు రచయిత నిశ్చితాభిప్రాయాలు కొన్నిసార్లు అవేదనాభరితంగా, ధిక్కారంగా, భవిష్యత్తుపై ఆరాటంలోంచి కన్పిస్తున్నాయి. **"ఎంతటి వెలుగు ఎగచిమ్మినా ఒక్క దీపం సర్వలోకాలను కాంతిమంతం చేయలేదు. అసంఖ్యాక అజ్ఞాత జ్యోతులను వెలిగింప చేయగలిగినప్పుడే దాని కర్తవ్యం సార్థకమవుతుంది"** (పుట. 24) ఈ వాక్యమే రచన ఏ అవసరాల్లోంచి వచ్చిందనే ప్రశ్నకు సమాధానం.

సాధారణంగా పాఠకులు ఒకే రకంగా ఉండరు. పాఠకులు పుస్తకాలను తమ వైయక్తిక, సామాజిక అవసరాల్లోంచి అధ్యయనం చేస్తారు. కొందరు రచన కేంద్రంగా అధ్యయనం చేస్తారు. ఇంకొందరు రచయిత – రచన అనే రెండు కోణాల్లోంచి చూస్తారు. ఈ విధంగా రచయిత ఉదేశ్యాలు రచనలో ప్రతిఫలించాయా? ప్రతిఫలిస్తే ఎంతమేరకు ప్రతిఫలించాయి? ప్రతిఫలించకపోతే ఎందుకు ప్రతిఫలించలేదన్న ప్రశ్నలు సాధారణంగా వస్తాయి. వీటికి సమాధానం రాబట్టుకోవాల్సిన అవసరం రచయితకే కాదు, సమాజానికి కూడా ఉంటుంది. రచన సామాజిక అవసరం అయినప్పుడు, అందులోని మంచిచెడులు, అవసర, అనవసరాలు చర్చించే బాధ్యత కూడా పాఠకుల మీద ఉంటుంది. ఈ బాధ్యతతోనే ఈ పనికి పూనుకుంటున్నాను.

తెలంగాణ బి.సి.వాద సాహిత్యానికి సంబంధించి రచయిత ఏడు అధ్యాయాలుగా విభజించుకున్నారు. తెలంగాణ పద్య సాహిత్యం – బి.సి. వాదం అధ్యాయంలో 14 రకాల కులాలను ప్రస్తావన చేస్తూ, పద్యంలో చిత్రించిన బి.సి. కులాల జీవితాలను, ఘర్షణలను సమీక్షిం

చారు. పాల్కురికి సోమనాథుని మొదలు, ఆధునిక కవులైన మారుకొండ సాయిలు, సజ్జన, దోరవేటి లాంటి బి.సి. కవుల వరకు ఈ కృషి ప్రస్తావన ఉంది. తెలంగాణ పాట – బి.సి వాదం అధ్యాయంలో దాదాపు 14 కులాల ప్రస్తావన ఉన్న పాటలను పేర్కొన్నారు. పాటకు ప్రజలను మేల్కొల్పే శక్తి ఉన్నదన్నారు. బి. సి. కులాల ప్రస్తావన ఉన్న పాటలు తాము చేస్తున్న వృత్తులు, వాటి తాలూకూ కష్టనష్టాలు, అభిమానం, ఆవేదన కనపడినంతగా, పాటల్లో చూపించిన విముక్తి మార్గాల ప్రస్తావన లేదు. ఆ ప్రస్తావనలు తెచ్చి వాటిపై బి.సి కులాల అవగాహనను విశ్లేషిస్తే బాగుండేది. తెలంగాణ వచన కవిత్వం – బి. సి వాదం అధ్యాయంలో బి.సి వాదం ఎక్కువగా వచన కవిత్వంలో కన్పిస్తుందని, వచన కవిత్వానికి ఉన్న ప్రక్రియా పరమైన వెసులుబాటును ప్రస్తావించారు. బి.సి. కవిత్వం రాస్తున్న రచయితల సాహిత్య తత్త్వాన్ని పట్టుకునే ప్రయత్నం చేసారు. **“బి.సి. కవిత్వం రాసిన కవులు రెండు రకాలుగా దర్శనమిస్తున్నారు. కొంతమంది వారి వృత్తికి సంబంధించిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని వృత్తులు విధ్వంసం చెందుతున్నందుకు బాధపడుతున్నారు. వారి వృత్తికి కొత్త రంగులు పులిమి పెట్టుబడిదారులు వారి చేతుల్లోకి తీసుకుంటున్నారని వాపోతున్నారు. మరి కొంతమంది వృత్తులు ధ్వంసం కావాలంటూ, ఆ వృత్తులు మా కులాలకు అంటగట్టడం వల్లనే మేము వెనుకబడుతున్నామని నినదిస్తున్నారు. ఆ వృత్తే నా కులాభివృద్ధికి ఆటంకమని నిర్మొహమాటంగా అక్షరాల తూటాలను పేల్చుతున్నారు”**. (పుట.33 , 34) ఇది మంచి పరిశీలన.

**తెలంగాణ కథ – బి.సి. వాదం** అధ్యాయంలో బి.సి. కులాల స్థితిగతులను తెలిపిన కథలు అస్తిత్వోద్యమాల కంటె ముందు నుంచే ఉందని చెప్తూ, దాదాపు 20 పైగా కులాల ప్రస్తావన, వారి జీవన సంఘర్షణ నేపథ్యంగా కలిగిన కథలను పరిశీలించారు. తెలంగాణ నవల – బి.సి. వాదం అధ్యాయంలో బి. సి వాదం ఇతర ప్రక్రియల్లో వచ్చినంతగా నవల ప్రక్రియలో రాకపోవడానికి గల కారణాలను విశ్లేషించారు. నవల ప్రక్రియలో మరింత సాహిత్యం రావాల్సిందిగా చెప్పారు. తెలంగాణ బి.సి.వాద సాహిత్య విమర్శ అధ్యాయంలో బి.సి. వాదాన్ని సాహిత్య విమర్శ రంగంలో పట్టుకోకపోవడానికి గల కారణాలను విశ్లేషించడం ఈ రచనలో కన్పిస్తుంది. అది శాస్త్రీయం కూడా. బి.సి.వాద సాహిత్య విమర్శను ప్రధానంగా చేపట్టిన విమర్శకుల రచనా వ్యాసంగాన్ని విశ్లేషించారు. బి.ఎస్ రాములు, జూలూరి గౌరీశంకర్, చింతం ప్రవీణ్, సీతారాం, గుడిపాటి, బాణాల శ్రీనివాస్, పగడాల నాగేందర్, దెంచనాల శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, బి.వి.ఎన్ స్వామి, మాచిడి సంతోష్ గౌడు, ఐ. చిదానందం, వడ్డపురం క్రిష్ణ, తాటి కాయల బోజన్న, బాసని సురేష్, ఎం. భాస్కర్ వంటి విమర్శక, పరిశోధకుల సాహిత్య విమర్శ స్వభావం కలిగిన వ్యాసాలను పేర్కొన్నారు.

ఈ గ్రంథంలో మెజారిటీ ప్రజలకు తెలియని బి.సి కులాల ప్రస్తావన ఉన్న సాహిత్యాన్ని పరిచయం చేసారు. వంజరులు, పట్కారీలు, మేదరోళ్ళు, దాసరులు, దొమ్మరులు, పూసలొల్లు, భట్రాజులు, జంగాలు, గాండ్ల, ఆరె కటికలు, సూర్య బలిజలు వంటి ఎన్నడు వినని కులాల ప్రస్తావన కూడా ఉంది. ఈ కులాల ప్రస్తావనలో జోగినులు, దర్జీలు వంటి వాటిని కూడా కులాలుగా ప్రస్తావించారు. ఇక్కడ రచయిత పొరబడ్డారు. ఇవి వృత్తులు మాత్రమే. జోగిని అనే వృత్తి కేవలం స్త్రీకి సంబంధించింది. రెండు మూడు కులాలలోని ఆడపిల్లలకు మాత్రమే పరిమితం చేయబడ్డ మత మూఢ విశ్వాసం. దర్జీ (బట్టలు కుట్టే పని) బి.సిల్లోని రెండు, మూడు కులాల వారు వృత్తిగా కలిగి ఉన్నారు. అంతే కానీ దర్జీ అనే ప్రత్యేక కులం లేదు.

గ్రంథ రచయిత అట్టెం దత్తయ్య బి.సి వాదం అనే పదబంధాన్ని సామాజిక, రాజకీయ, సైద్ధాంతిక దృక్పథం నుంచి రూపొందించు కున్నట్లు కనిపించడం లేదు. దీనికి కారణం కేవలం సాహిత్యోద్యమాల సరసన బి.సి. వాదం ఎందుకు లేదన్న ప్రశ్న నుంచే వారి వెతుకులాట ప్రారంభమై ఉంటుంది. బి.సి.వాదానికి అవసరమైన రాజకీయ, సైద్ధాంతిక భావజాలాలు ఒక పుస్తకంలోకి రాకపోయినా వివిధ రచయితలు రాసిన వ్యాసాల్లోనూ, పుస్తకాల ముందుమాటల్లోను ప్రారంభమై, అనేక చర్చలకు దారి దీసాయి. బుద్ధ, నారాయణ గురు, పూలే, అంబేద్కర్‌ల ఆలోచన విధానాలు బి.సి. కులాలు అనుభవిస్తున్న అన్ని రకాల దోపిడి నుంచి విముక్తి కల్పిస్తాయి. ఈ పుస్తకంలో రాజకీయ, సామాజిక అవసరాల్లోంచి రూపుదిద్దుకున్న ‘బహుజన’, ‘బి.సి.’, ‘సబ్బండ’ వంటి పదాలలో బి.సి. అనే పదానికి రచయిత మొగ్గు చూపించారు. దీనికి గుర్తింపు రాజకీయోద్యమాల సాహిత్యం (అస్తిత్వోద్యమాలు) ప్రారంభమైనప్పటి నుండి వివిధ విమర్శకుల మాటలను ఉటంకిస్తూ బి.సి వాదం అనే పదాన్ని ఉపయోగించాడు. రచయిత బి.సివాదాన్ని ఎటువంటి తాత్త్విక భూమికను విశ్లేషించ కుండా అంగీకరించారు. కాలువ మల్లయ్య ప్రతిపాదించిన **“సబ్బండ సాహిత్య వాదా”**న్ని ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కె. కొండలరావు గారి అభిప్రాయాన్ని ఉటంకిస్తూ **“సమ సమాజంలో సమానమైన మనుగడ కోసం, మానవత్వం కోసం వాదం ప్రశ్నిస్తుంది. పని చేస్తుంద”**నే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. సామాజిక, రాజకీయ, గుర్తింపు ఉద్యమాల నేపథ్యంలో అభివృద్ధి అయిన కె. కొండలరావు గారి అభిప్రాయాన్ని ఈ గ్రంథం ప్రస్తావించినా, సాహిత్యంలో ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. ఈ పుస్తకం చివరన ‘వినతి’ పేరుతో రచయిత రాసిన మాటలో పుస్తకం పేరుకు సంబంధించి ఒక వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారు. **“గ్రంథనామం విషయంలో కొంతమందిని అనుసరించాను. జూలూరి గౌరిశంకర్ ప్రచురించిన పుస్తకాలు, బి.ఎస్ రాములు రాసిన ‘బి.సి. కథలు ఒక విశ్లేషణ (2000 – 2010)’, వి. జయప్రకాశ్ సంపాదకత్వాన వచ్చిన ‘బి.సి.**

**కవితా సంకలనం (2019)"** వంటివి. (పుట. 249) ప్రొఫెసర్ దండెబోయిన రవీందర్ యాదవ్ సూచించిన అభివృద్ధి చెందుతున్న కులాలు అనే పదాన్ని కూడా ప్రస్తావించారు.

బి.సి.లు అంటే ఎవరు అనే మౌలిక ప్రశ్నకు రచయిత బి.ఎస్ రాములు ఇచ్చిన నిర్వచనాన్ని ఉటంకింటారు. ఈ నిర్వచనాన్ని (రచయిత ఉటంకించినంతవరకు) లోతుగా అర్థం చేసుకుంటే అవ్యాప్తి దోషం ఉన్నట్లు మనకు తోస్తుంది. మారుతున్న కాలానికి, విస్తృతమవుతున్న సామాజిక, రాజకీయావసరాల్లోంచి ఇంతవరకు నిర్దేశించుకున్న లేదా ఆపాదించుకున్న పేర్లను సామాజిక అవసరాల దృష్ట్యా మార్చుకోవాల్సిన సందర్భం ఇది. బి.సి.లు అంటే కేవలం సాంస్కృతిక, వృత్తి మార్గాల నుంచే రూపొందించుకోవాల్సిన అవసరం లేదు. ఇది సామాజిక, రాజకీయ అవగాహనలోంచి రూపొందించు కోవాల్సిన వర్తమాన అవసరం ఉంది. ఈ రచనలో బి.సి.లు అంటే ఎవరనే ప్రశ్నకు రచయిత తనదైన అవగాహనను ఇవ్వలేకపోయాడు. **"ఈ దేశంలో శూద్రులుగా పిలవబడుతూ మెజారిటీ చేతివృత్తులు, కుల వృత్తులు చేస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, నిచ్చెనమెట్ల కుల సమాజంలో పీడితులుగా, పీడకులుగా ద్వంద్వ స్థితుల్లో ఉండి రాజకీయార్థిక, సామాజిక వెనుకబాటుతనానికి గురై, అగ్రకుల దోపిడికి గురైనవారు బి.సి.లు"** అని నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది.

ఏది బి.సి సాహిత్యం అనే ప్రశ్నకు సమాధానంగా **"ఈ సామాజిక వర్గాల క్షోభను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే సాహిత్యమే ఈ బి.సి వాద సాహిత్యం."** (పుట. 35) అని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇది పరిమితమైన అవగాహన. రచయిత ఈ అవగాహనను విస్తరించుకోవాల్సిన అవసరం ఉంది. **"ఈ దేశంలో శూద్రులుగా పిలవబడుతూ మెజారిటీ చేతివృత్తులు, కుల వృత్తులు చేస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికి, నిచ్చెనమెట్ల కుల సమాజంలో పీడకులుగా, పీడితులుగా ద్వంద్వ స్థితుల్లో ఉండి రాజకీయార్థిక సామాజిక వెనుకబాటుతనానికి, అగ్రకుల దోపిడికి గురైన బి.సి.ల స్థితిగతులను మార్చి వారిని రాజ్యాధికారం దిశగా ఉన్ముక్తుల్ని చేస్తూ, సాహిత్య, సామాజిక, రాజకీయ, సైద్ధాంతిక, తాత్త్విక అవగాహనల్లోంచి ఉద్యమించేందుకు అవసరమైన కార్యాచరణను ప్రకటించేది బి.సి. వాదం."** ఈ విధంగా **"బి.సి వాదం నేపథ్యంలో ఏ పీడితుల కోసమైతే పోరాడుతున్నామో, రాస్తున్నామో, ఆరాటపడుతున్నామో వారే తమ సాహిత్యాన్ని తామే రాసుకుంటామనే చైతన్యాన్ని ప్రదర్శిస్తారో, వారే తమ జీవన స్థితిగతుల నుంచి, కుల వివక్ష, అనుభవం, అనుభూతితో రాసిన సాహిత్యం బి.సి.వాద సాహిత్యం అవుతుంది. కానీ, బి.సిలు రాసిన సాహిత్యం బి.సి.వాద సాహిత్యం కాదు"** ఈ అవగాహనలోంచి బి.సి వాద సాహిత్యోద్యమ లక్ష్యాలను నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ గ్రంథంలో రచయిత పీడకులు అని అంటున్నారు. కానీ ఆ పీడకులు ఎవరో నిర్దిష్టంగా చెప్పలేదు. దీనికి రాజకీయ చైతన్యం తాలుకూ పార్శ్వం ఈ రచనలో లేకపోవడం ప్రధాన కారణం. ఒక వాదాన్ని గురించి మాట్లాడుతూ వారి రాజకీయ పార్శ్వాన్ని చెప్పకపోవడం కన్పిస్తుంది.

తెలుగు సాహిత్య రంగంలో బి.సి. ల సాహిత్యానికి, సాహిత్య కారులకు జరుగుతున్న అన్యాయాలు, వాటి వెనుకాల దాగిన కుట్రలను పసిగట్టడంలో ఈ రచయిత సఫలీకృతం అయ్యారు. **"బి.సి.లను హిందుత్వం పేరుతో కొందరు, దళితులలో ఒకరిగా మరికొందరు, బహుజనుల పేరుతో ఇంకా కొందరు, దళిత బహుజనుల పేరుతో మరికొందరు చూపిస్తున్నారు. రకరకాల గొడుగులను కప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సామాజికంగాను, సాహిత్య పరంగాను ఒక రకమైన కుట్ర"** (పుట. 30). సాహిత్య రాజకీయాలను ప్రస్తావిస్తూ, బి.సి. సాహిత్యకారులు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న **"సాహిత్య దూరాల"**ను చెప్పారు. సాహిత్య రాజకీయాల మాటున దాగిన సామాజిక, రాజకీయ అవసరాలను చర్చించాల్సి అవసరం ఉంది.

దళిత సాహిత్యంతో In Sider, Out Sider వంటి చర్చలు వచ్చిన తర్వాత **"మీరు పీడితులే కానీ, మాతో సమానమైన పీడితులు కారు. కొన్నిసార్లు మీరు కూడా పీడకులుగా ఉన్నారనే"** వారు చెప్పిన అభిప్రాయం సత్యదూరం కాదు. భౌతిక వాస్తవం. పాటకు పరాయి పల్లవి వ్యాసం ద్వారా సతీష్ చందర్ చేసిన సలహాను నాటి బి.సి. వాదులు కొందరు సవాలుగా స్వీకరించి స్వీయ అస్తిత్వవాద నిర్మాణానికి కొంతపని చేసారు. మరికొందరు బి.సి.లతో ఉన్నా మంటూనే దళితవాదానికి సతీష్ చందర్ మాటల్లో చెప్పాలంటే పులుపు చావని రాతలను రాసారు. ఇక్కడే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఒకరు వారి వెంట పులుపు చావని రాతలు రాస్తే, మరికొందరు మరొక్క రూపం ఎన్నుకున్నారు. అభ్యుదయకరమైన భావజాలాల్లో నిర్మాణమైన బి.సి. రచయితలకు మనవాళ్లు అనుకున్న దళితులు దూరం పెట్టేసరికి మరో రూపం అవసరమైంది. వెనుకబడిన కులాల పేరుతో సంకలనాలు ప్రారంభమయ్యాయి. జూలూరి గౌరిశంకర్ లాంటి వారు వెనుకబడిన కులాల తాత్త్వికతలోంచి సాహిత్యాన్ని సృజిస్తూ కొనసాగుతున్న సందర్భంలో, కొంతమంది Out Sider గానే ఉంటూ In Siders సహగమనం చేస్తూ దళిత విమర్శకులు అనే మాట కోసం పరితపించి సఫలీకృతమయ్యారు. ఆనాడు వారు ప్రత్యేక అస్తిత్వ మార్గంలో ఆలోచనలు చేయకుండా ఉన్నారు. వారే కనుక ప్రత్యేక అస్తిత్వ మార్గాన్ని ఎంచుకొని ఉంటే బి.సి సాహిత్య తాత్వికత నిర్మాణంలో సఫలీకృతం అయ్యేవాళ్లం. ఆనాడు బి.సి.ల సాహిత్యానికి ఒక వేదిక నిర్మించగల ధైర్యం ఎవరు చేయలేకపోయారు. తద్వారా బి.సి.వాదం కొన్ని సంకలనాల, రచనల ముందుమాటలకు

పరిమితమై పోయింది. నిద్రాణమైన ఉన్న బి.సి.వాదాన్ని నేడు బుద్ధుడు, పూలే, అంబేద్కర్, మండల్‌ల తాత్వికతలోంచి పని చేస్తూ కంచ ఐలయ్య, కాలువ మల్లయ్య, జూలూరి గౌరిశంకర్, సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, పగడాల నాగేందర్, చింతం ప్రవీణ్, ప్రభంజన్ యాదవ్, ఎస్. రఘు వంటి వాళ్లు మేల్కొల్పుతున్నారు. వారి సరసన **"బి.సి.ల ఉటంకింపు ఉన్న సాహిత్యాన్ని సమీక్షించిన"** ఈ పుస్తకం ద్వారా అట్టెం దత్తయ్య కూడా నిలిచాడు.


తెలుగు సాహిత్యంలో గుర్తింపు రాజకీయ ఉద్యమ సాహిత్యాలు (అస్తిత్వోద్యమాలు) అభివృద్ధి అయిన తర్వాత వాటి సరసన బి.సి. వాద సాహిత్యం కూడా విస్తరించాల్సిన అవసరం ఉంది. ఇది బి.సి.ల రాజకీయ, సామాజిక అవసరం కూడా. దాని కోసం ముందు వాదం, ధోరణి, ఉద్యమం వంటి పారిభాషిక పదాలను అర్థం చేసుకోవాలి. వాదం అంటే **"ఒక నిర్దిష్టమైన మార్గానికి, భావ సూత్రాలకు కట్టుబడే కవులు, రచయితలు చేసే వ్యక్తిగత ప్రయత్నాల, చర్యల పరంపర".** ధోరణి అంటే **"నిర్దిష్ట భావాత్మకాశయంతో కొంతమంది వ్యక్తులు ఉమ్మడి మార్గంలో చేసే వ్యక్తిగత ప్రయత్నాల, చర్యల పరంపర".** ఉద్యమమంటే **"నిర్దిష్ట భౌతికాశయంతో ఒక సమూహం చేసే సమష్టి ప్రయత్నాల, చర్యల పరంపర"**. ఈ పరంపరలో బి.సి సాహిత్యం మౌలిక మార్గమైన ఆలోచన మార్గం దాటింది. ఆచరణ రూపంలో వాదంగా రూపొందుతున్న దశ ఇది. దీని తర్వాత ఉద్యమ రూపం తోసుకోవాల్సిన అవసరం ఉంది.

అస్తిత్వం అనే మాటను ఉనికి అర్థంలో తీసుకుంటున్నాము. ఇక్కడ ఉనికి వ్యక్తిగత ఉనికి కాదు. సామాజిక ఉనికి. సాహిత్యంలోని అన్ని గుర్తింపు రాజకీయ ఉద్యమ సాహిత్యాలు (అస్తిత్వోద్యమాలు) తమ సామాజిక ఉనికిని ప్రకటించాయి. స్త్రీవాదం వ్యక్తిత్వానికి సంబంధించిన సమస్యలోంచి రూపుదిద్దుకున్నట్లుగా, దళిత వాదం సామాజిక ఆత్మగౌరవం, ముస్లిం వాదం మతపరమైన అగ్రత్వం, ప్రాంతీయవాదం ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యాల్లోంచి రూపుదిద్దు కున్నట్లుగా బి.సి వాదం కూడా తనదైన ప్రత్యేక అవసరాల్లోంచి, ఆవేదనల్లోంచి, పరిష్కార మార్గాల్లోంచి రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై మరింతగా చర్చలు జరిగి, నిష్పక్షపాతంగా వాటి మదింపు చేయడం అవసరం. విమర్శకులు, పరిశోధకులు ఈ దిశగా ఆలోచించాలి. ఈ గ్రంథ రచయిత అట్టెం దత్తయ్య ఆవేదన కూడా ఇదే.

బి.సి.వాదం సామాజిక, తాత్విక, సాహిత్య రంగాల్లో మౌలిక ప్రశ్నలను లేవనెత్తాలి. ఈ విధంగా కొత్త ప్రశ్నలను లేవనెత్తినప్పుడు కొత్త సమాధానాలు అవసరం అవుతాయి. సమాధానాలను సాధించే క్రమంలో ముందుకు పోతున్నా కొద్దీ అనిర్దిష్ట స్థితి నుండి నిర్దిష్ట స్థితి సాధిస్తాము. ఈ క్రమంలో వచ్చే వైరుధ్యాలు, వాటి పరిష్కారాలు, తృప్తికరమైన సమాధానాలన్నింటిని సాధించే క్రమంలో బి.సి. వాదానికి తాత్విక భూమిక ఏర్పడుతుంది. ఈ దిశలో అట్టెం దత్తయ్య రచించిన తెలంగాణ బి.సి.వాద సాహిత్యం తొలి అడుగు. అనేక ప్రశ్నలను లేవనెత్తే రచన. రచయితలందరు బ్రాహ్మణీయ, సాంస్కృతికాధిపత్యం నుంచి కెరియరిజం తాలూకూ ఆలోచనలోంచి నిర్భయంగా బయటికి వచ్చి కొత్త అస్తిత్వ పంథాను నిర్మించడానికి ఈ రచన సలహా పూర్వక గ్రంథంగా పనిచేస్తుంది. ఈ ప్రయాణంలో సాగడానికి మనకు సహకారాలు అందిస్తుంది. బి.సి.ల జీవితాలను స్పర్శించిన సాహిత్యం ఎంత?, వాటిలోని వైవిధ్యం ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తుంది. రచయిత యువ పరిశోధకుడు కావడం మూలంగా ఈ మధ్య తెలుగు సాహిత్య విమర్శలో అడుగుపెడుతున్న మొదటి అడుగులను ఒడుపుగా అందుకోగలిగాడు. కొత్త విమర్శకులను సాహితీ లోకానికి పరిచయం చేయగలిగాడు. సమకాలీన తెలుగు సాహిత్యాల్లో బి.సి.వాదానికి చోటునిస్తూ భావజాల, తాత్విక, సాహిత్య రంగాల్లో కృషి చేస్తున్న సబ్ ఆల్టర్న్, బహుజన కెరటాలు వంటి పత్రికల కృషిని, వివిధ సాహిత్య కారులు సృష్టించిన సాహిత్యాన్ని ప్రస్తావించారు. బి.సి.వాద నిర్మాణానికి మరిన్ని పత్రికలు రావాలని ఆకాంక్షించాడు.

**"బి. సి.లు కవులు రచయితలు. వారి స్వీయ అస్తిత్వ పంథాలో నడవక తప్పదు"** (పుట. 28). యుగాల నుంచి పొగడ్తలను ఆశిస్తూ, రసాలను ఆస్వాదిస్తూ ఇంకెన్ని సంవత్సరాలు కాలం వెలిబుచ్చడం. అసమానతను ప్రశ్నిస్తూ, మోసాలను గురించి రాసి పీడకులను నిలదీయ వలసిన అవసరం ఉంది. (పుట. 35) కలిసికట్టుగా పోరాడి రాజ్యాధికారాన్ని సాధించుకుందాం. (పుట. 110), బి.సి. సాహితీ వేత్తలు వారి వారి జీవితాలను వాస్తవికంగా, నిర్మొహమాటంగా, నిర్భయంగా లిఖించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. (పుట. 234) వంటి సూచనలు కన్పిస్తున్నాయి. ఇవి ఆయా అధ్యాయాలలో సాహిత్యాల విశ్లేషణ తర్వాత ఈ అభిప్రాయాలను వ్యక్తం చేసారు.

చివరగా ఒక సూచన ఇవ్వవచ్చు. ఒక సిద్ధాంతాన్ని లేదా వాదాన్ని నిర్మించాలంటే, ఇప్పటివరకు మనకున్న భేషజాలాల్నీ, అవగాహనలు, పరిభాషల్నీ, ప్రత్యయాలపై అనుమానం వ్యక్తంచేయాలి. ధ్వంసం చేయాలి. అప్పటివరకున్న అవగాహనను శాస్త్రీయ అవగాహనగా పునాదులు వేసుకొని, నిర్మించాల్సిన పనిలో నిమగ్నం అవ్వాలి. అది చేయనంత వరకు ఇప్పుడు మనమనుకుంటున్న వాద నిర్మాణాల్లో సఫలీకృతం కాలేము.



మూసీ సాహిత్యధార
పుస్తక సమీక్ష

# గుండె వాల్ మీద ప్రయోగాల కవిత్వపు పిట్ట

**పేర్ల రాము,** ఎం.ఏ., తెలుగు, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నల్గొండ. ఫోన్ : **964 257 0294**

కవిత్వం

జీవితపారమవ్వడం.

జీవితం అనేక విధాలుగా ప్రవహించడం కిందబడడం, పైకి లేవడం మనుషులకి కొత్తేమీ కాదు.. అలా కవి తండ హరీష్ మట్టిపరిమళాలతో మానవస్వేదబిందువులతో కవిత్వపు పువ్వై పూస్తున్నవాడు.

కళ్ళలో కదిలే దృశ్యాల్ని కవిత్వవాక్యాల్లోకి ఒంపుకొస్తున్నవాడు. తనకి నచ్చినట్టుగా తనను తాను చెక్కుకున్నట్టు కవిత్వాన్ని కూడా ఎక్కడ చెక్కాలో అక్కడే చెక్కుతున్నవాడు. తాజాదనంతో నిండిన కవితలను నిత్యనూతనంగా తన ఇన్‌బాక్స్ అనే గుండెవాల్ పై పోస్ట్ చేస్తున్న కవి.

రెండు కవితా పుస్తకాలను నీటిదీపాన్ని (2019), ఇన్‌బాక్స్‌ని పోల్చుకునప్పుడూ వస్తువు రీత్యా , భాషరీత్యా, వ్యక్త పరిచే విధానం రీత్యా నూతనత్వం కనపడుతుంది. తనలోకి తాను మరింత వెళుతున్నట్టుగానే అక్షరప్రతిబింబం ద్వారా అర్థం మౌవుతోంది. కవి హరీష్ కవిత్వం గూర్చి ప్రముఖ కవి అఫ్సర్ **"పూర్వం పఠాభి లాంటి కవులు నగరయాంత్రికతని కవిత్వం చేస్తే, ఈ కాలంలో హరీష్ రోజువారీ సాంకేతికతను వాక్యాల్లోకి అప్లోడ్ చేస్తున్నాడు"** అని అలాగే ప్రముఖ కవి సీతారాం **"రోజులు విషాద వదనాలతో ఉదయిస్తునప్పుడు, విచారాలతో పెనుదుఃఖాలతో అస్తమిస్తున్నప్పుడు రోజంతా పరిమళించే కవితలను పండించజూస్తున్నాడు. ఇతని దగ్గర ప్రమాదకర ఆయుధాలేమీ లేవు కవిత్వం తప్ప"** అని కవిని వాక్యాల ద్వారా పరిచయం చేశారు.

కవి ఈ ఇన్‌బాక్స్ కవితా సంపుటిలో కవితలను మూడు భాగాలుగా విభజించుకున్నాడు. సామాజికంగా స్పందించే కవితలు కొన్నిగాను, కొంచెం ప్రేమ కొంచెం విరహం, లాక్ డౌన్ పోయెట్రీగా కాలాన్ని తనదైన శైలిలో, తనదైన ముద్రలో రికార్డ్ చేశాడు.

ఓ సారి కవిత్వంలోకి వెళ్ళి చూద్దాం..

**ఆకాశంలో ఇంత నూనెను పోసి**
**చందమామలను కాల్చించి**
**అలలుగా దరికొస్తున్న నూనెను**
**తెడ్డుతో సముదాయించింది.** (చిరుతిళ్ళ సాయంత్రం)

సాధారణంగా మనం ఇంట్లో సాయంత్రం పూట చేసుకొని తినే రొట్టెలను, వివిధ తిను బండారాలను చెప్పడానికి వాడిన ఊహాత్మకమైన భావాలు ఇవి.

పొయ్యిరాళ్ళ మధ్య సూర్యుణ్ణి కుక్కడం, నక్షత్రాలను తుంచుకొని తినడం, చందమామలకి నదులను రుద్దడం వంటి పదదృశ్యాలతో కళ్ళముందు ఆ సన్నివేశాన్ని చూపెట్టడం కవి నైపుణ్యానికి చిరునామా.

**మనుషులిప్పుడు**
**అనుబంధాలను, ఆప్యాయతలను**
**డేటాతో కొనబడ్డ**
**ఓ 'కొత్త ఆప్' రూపాలు ( ఆన్లైన్)**

ఈ కవిత మనుషులు సాంకేతికకాలంలో ఫోన్‌లకు ఎంత అలవాటు పడ్డారో చెప్పే స్థితికి అక్షరరూపం.

సామాజిక మాధ్యమాలు మనుషుల్ని ఎంత ప్రభావితం చేస్తున్నాయో వాటి ద్వారా ఏమి కోల్పోతున్నారో చెప్పకనే చెప్తూ రాసిన కవిత ఇది. ఈ కాలాన్ని ఇలా వాక్యాల ద్వారా అప్లోడ్ చేశారు అనే చెప్పుకోవాలి.

మనుషుల్ని కొత్త యాప్ రూపాలు అని చెప్పడం వెనుక ఒక లోతైన కోణం ఉంది అది పాఠకులను ఆలోచింప జేస్తుంది.

**ఈ రోజు పచ్చని ఆకుల వంతు**
**అడవి బిడ్డల వంతు**
**రేపు నువ్వు, నేను**
**ఏదో తవ్వకాల్లో శవాలై బయటపడుతాం. (నీ కంటిని నువ్వే పొడుచుకుంటున్నావు)**

ఇది నల్లమల్ల యురేనియం తవ్వకాల్లో సంఘటనాత్మకంగా రాసిన కవిత. ఈ కవిత సందేశాత్మకంగా సాగుతుంది. అడవి అడవిబిడ్డల నేలకళ్ళని పొడుస్తున్నావు అవి నీకళ్ళే అని ఎరుక చెప్పేలా దృశ్యమయం చేసిన కవిత. ప్రకృతి నీవు ఒకటే అని దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కవితలో చెప్పుకొచ్చారు.

**అయ్యా!**
**రైలునేమనకండి**
**పట్టాల మీద దీనంగా పడి ఉన్న**
**మా పేదరికపు రహస్యాన్ని తవ్వి తీయండి. (ఏం తెలువనోళ్ళం)**

ఏమి తెలవనోళ్లం అంటూ రైలు పట్టాలమీద నుజ్జునుజ్జు కాబడిన పేదజీవితాల గొంతుతో రాసిన కవిత. సముద్రమేదో, నదేదో తెలీదు, దిక్కులెన్నుయో, హక్కులెన్నుయో తెలీదు అంటూ వాళ్ళ దీనస్థితిని తెలుపుతూ పేదరికపు రహస్యాన్ని విప్పిచెప్పమని ప్రాధేయ పడతాడు.

ఈ క్రమంలో కవి పూర్తిగా వస్తువులో మునిగిపోయి మాట్లాడినట్టు దుఃఖ పడతాడు.

**ఆమెను**
**సూర్యుడితో పోలుద్దామనుకుంటే**
**వెలుగు 24×7 ఇస్తుంది. (24×7)**

స్త్రీ గొప్పదనాన్ని చెప్పే కవిత ఇది. అతి తక్కువ పదాలతో చెప్పాల్సిన గాఢతను చెప్పారు.

ఆమెను సముద్రంతో పోల్చాడు, సూర్యుడితో పోల్చాడు, జాబిలితో పోల్చుతూ ఆమెని అమెతోనే పోల్చాలని తెలిసొచ్చింది అని ముగిస్తాడు.

**అలలు ప్రేమవస్త్రాలై**
**చుట్టుకున్నాయనుకున్నగాని**
**జీవితమే ఖాళీసీసా అయి**
**సముద్రంలో తెలియాడుతుందనుకోలేదు.**
**(ఈ రోజు ఏమయ్యిందో)**

లాక్డౌన్ కాలంలో అనుభవిస్తున్న అనుభవాలను కవిత్వంలోకి ఒంపుకొచ్చాడు కవి. ఈ రోజు ఏమైందో అంటూ ప్రతీ రోజు బాధపడుతున్న బాధల్ని చూపెట్టారు. జీవితం ఖాళీసీసా అయి సముద్రంలో తేలియాడుతుంది అని చక్కని ప్రయోగం చేశారు.


ఇలా ప్రతీ కవితను తనదైన శైలిలో, తను ప్రవేశించిన పాత్రల ద్వారా కవితను పలికించ చూస్తాడు. దీనిలో మొత్తం 51 కవిత లున్నాయి. 9 ఇంగ్లీష్ పేర్లతో శీర్షికలు ఉన్నాయి. టికెట్ కొనుక్కోవాలి, పూర్తిగా విచ్చుకోండి, 24×7, తీరంచేర్చే పాట, మట్టేమాకు ఆకాశం, Village Ringtones, Break up , Distance, don't touch.. అనే మొదలైన ఇంగ్లీష్ తెలుగు భాషలతో కూడిన శీర్షికలు ఉన్నాయి. ఇతని ఊహాభావాత్మకమైనది, చిత్రాలను చూపిస్తుంది, ఒక రుచిని అందిస్తుంది. అప్పుడప్పుడు దుఃఖబెడుతుంది. అప్పుడప్పుడు అనుభూతిని పంచుతుంది. దీనిలో కవి గడిపిన క్షణాలున్నాయి. దు:ఖపడిన సందర్భాలున్నాయి. సందేశాత్మక కవితలున్నాయి. ప్రేమతో తడిమిన గాయలున్నాయి. సాంకేతికతో కలకలిసిన భాష ఉంది.


కవి నిత్యపరిశోధకుడిగా అధ్యయనం చేస్తూ అనేక ప్రయోగాలకి పూనుకోజూస్తున్నాడు. ఈ కవి ఆలోచనని లోతుగా తెలుసుకోవాల్సిన వాళ్ళు ఈ పుస్తకం తప్పకుండా చదవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను.


కవి తండా హరీష్ ఇంకెన్నో కవిత్వపు ప్రయోగాలను చేస్తూ మరింత ముందుకు నడవాలని కోరుకుంటున్నాను.

# అంతరాత్మ

అక్కడెవరూ లేరన్న ధీమాతో
అన్నీ చేస్తు ఆనందిస్తున్నావు గానీ
అంతరాత్మ గురించి ఏ కొంత ఆలోచించినా
అన్ని పనుల్లో కొన్ని ఆపెయొచ్చు మరి
చేస్తున్న అన్ని పనుల గురించీ
చేతికి మట్టి అంటకుండా చూసి
చేసిన పనికి సాక్ష్యం లేదంటూ
చెయ్యాల్సిన చాలా పనుల గురించి
చేయి తిరిగినవాళ్లతో కలిసి
చేయరాని పనులను చేస్తున్నావు గానీ
అంతరాత్మ గురించి కూడా ఆలోచించి చూడు
అనుకోని ఫలితం కన్పిస్తుంది
అంగబలం, అర్థబలముందంటూ
అన్ని పనులు చేయొచ్చంటూ
అయినవాళ్లు దూరమవుతున్నా
ఆత్మీయతను కోల్పోతున్నా
స్వార్థం పెర్గుతున్న చిత్తంతో
ఏం సాధిస్తున్నావో...
ఎందుకు సాధిస్తున్నావో...
ఆలోచించడం మానేశావు గానీ
అంతరాత్మ గురించి గుర్తుంటే బావుండు
ఎంతో కొంత మేలు కన్పిస్తుంది
తరతరాలు బతకడానికంటూ
తాపత్రయం మంచిదే కావచ్చు గానీ
ఆస్తులూ అంతస్తుల గురించి
అధికారం చలాయిస్తున్నప్పుడు
అంతరాత్మ గురించి కొంతైనా ఆలోచించు
అన్ని పనుల్లో కొన్ని ఆపేయొచ్చు మరి









**కన్నోజు లక్ష్మీకాంతం**
ఫోన్ : 9246338115

# మనసుతో చేసిన పరిశోధన - మచ్చా హరిదాసు 'తథ్యము సుమతి'

**డా. అమ్మిన శ్రీనివాస రాజు,** సీనియర్ తెలుగు ఉపన్యాసకుడు, వాజేడు, ఫోన్ : **772 988 3223**

పరిశోధన అంటేనే ఒక ప్రామాణికత కోసం చేసే "అక్షర కృషి". అనేక సందేహాలను, మూలాంశాలను, చరిత్రలను, సహేతుకంగా సరైన ఆధారాలతో చూపించే ఒక యజ్ఞంలాంటి పని, కానీ కాలానుగుణంగా వచ్చిన పరిశోధన,అధ్యయనాల మార్పుల్లో భాగంగా పరిశోధనా సిద్ధాంత గ్రంథాల రచనా లక్ష్యం కేవలం "డాక్టరేట్" పట్టాలకే పరిమితం అయిపోతుంది.

ప్రస్తుత మన పరిశీలనా గ్రంథం "తథ్యము సుమతి" రచయిత డాక్టర్ 'మచ్చా హరిదాసు' గారు, ఆయన "తెలుగులో యాత్రా చరిత్రలు" అనే అంశం మీద పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొంది అంతటితో తన పరిశోధన జిజ్ఞాస నిలుపుకోక పరిశోధనకు ముందు నుంచే తన అభిలాషతో సేకరించి ఉన్న అంశాల ఆధారంగా నిరంతర పరిశోధన రచనలు చేసే మంచి లక్ష్యంతో ఈ గ్రంథం వెలువరించారు.

విశ్వవిద్యాలయానికి సమర్పించాల్సిన పరిశోధనా గ్రంథం కాకపోయినా ఎక్కడ రాజీ పడకుండా తన యొక్క ఉత్తమ పరిశోధన లక్షణాలను వాక్య వాక్యానికి పూసి వ్రాసిన అద్భుత రచన ఇది.

1977-1978 సంవత్సరాల కాలంలో తన సహాధ్యాయి ఎన్.గోపి గారితో పాటు తంజావూరులోని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారానికి వెళ్ళిన హరిదాసు, మిత్రుడు ఎన్. గోపి తన పరిశోధన అంశం అయిన వేమన గురించిన రచనలు అన్వేషిస్తూ ఉంటే, తనలోని ఆసక్తి మేరకు అక్కడి సుమతి శతక పద్యాల తాళపత్ర గ్రంథాల కాగితపు ప్రతులు సేకరించుకున్నారు. వాటితోనే ఈ 'తథ్యము సుమతి' రచనకు అంకురార్పణ చేసి 2017లో అచ్చు రూపంలో పాఠకలోకానికి పరిచయం చేశారు,

ప్రామాణిక పరిశోధన లక్ష్యం గల ప్రతి పరిశోధక విద్యార్థి తప్పక చదవాల్సిన గ్రంథం ఇది. రెండు భాగాలు రెండు అనుబంధాలుగా విభజించుకున్న ఈ పుస్తకంలో ప్రారంభంలోనే సుమతి శతక కర్త ఎవరు? అనే విషయం గురించి అన్నివిధాలా విమర్శలను క్రోడీకరించి చివరికి సుమతి శతకకర్త 'బద్దె భూపాలుడు' అన్న విషయం నిరూపించారు.

తెలుగు భాషా సాహిత్యాలకు తన అమూల్యమైన సేవలు అందించిన మహానుభావుడు సి.పి.బ్రౌన్. వేమనను వెలుగులోకి తెచ్చిన వాడు ఆయనే!! అన్న విషయం మాత్రమే మనకు తెలుసు కానీ వేమన పద్యాల తాళపత్ర గ్రంథాలతో పాటు సుమతి పద్యాలు గల తాళపత్ర గ్రంథాలను కూడా బ్రౌన్ సేకరించి మేలుప్రతులు వ్రాయించిన విషయం డాక్టర్ హరిదాసు తన "తథ్యము సుమతి" లో సహేతుకంగా పేర్కొన్నారు, ఆయన సేకరించిన 10 ప్రతుల్లో గల మొత్తం పద్యాల సంఖ్య వివరాలు, కూలంకషంగా పేర్కొంటూ .. సర్వజిత్ నామ సంవత్సరం కార్తీక బహుళ పంచమి గురువారం రాత్రినాటికి పుదుచ్చేరిలో "మాజేటి సర్వేశలింగం" ఈ సుమతి శతకం పూర్తి చేసిన విషయం ఆ మేలుప్రతిలో లిఖించి ఉన్న ఆధారాన్ని బట్టి తెలుస్తుంది. ఇలా 1827 నవంబరులో ఈ సుమతీ శతకం తెలుగు సాహితీలోకానికి పరిచయం అయినట్టు హరిదాసు ప్రామాణీకరించారు.

1825 ఏప్రిల్ 25 నాటికి వేమన పద్యాల చిత్తు ప్రతి పరిష్కరణ, ఆంగ్లానువాదం, వంటి పనులు బ్రౌన్ పూర్తి చేయించి 1829 నాటికి ముద్రణ పని కూడా ముగించారు, ఆ ప్రధాన పనిలోనే సుమతి పద్యాలు సేకరణ కూడా చేసి పండితులతో పరిష్కరింప చేసి 1832 నాటికి సిద్ధం చేసి 1842 వరకు ముద్రణ పనిపూర్తి చేసినా దురదృష్టం కొద్దీ ఆ ప్రతి నేడు అలభ్యం, అనంతరకాలంలో బ్రౌన్ సిద్ధం చేసిన పరిష్కృత గ్రంథం ఆధారంగా "వావిళ్ళ" వారు ఆదినిలయం సరస్వతి ముద్రాక్షరశాల మద్రాసులో ఏప్రిల్ 20, 1868 నాటికి సుమతీ శతకం అచ్చు పని పూర్తిచేసి పాఠకలోకానికి పరిచయం చేసిన విషయం హరిదాసు గారు వివరణాత్మకంగా సంబంధిత ఆధార గ్రంథాల సాక్ష్యంగా తెలియజేశారు.

అలాగే సుమతీ శతకం 'శ్రీకారం' తో ప్రారంభించబడని విషయం కూడా పేర్కొంటూ 'సుమతి' అనే జైన భిక్షువుకు ఈ శతక కారుడు తన రచనను అంకితం ఇచ్చినట్టు అందుకే దీని మకుటంలో సుమతిని చేర్చినట్టు, శ్రీకారం జైన సంప్రదాయం కాదు కనుక దీనిలో శ్రీకార ప్రారంభానికి స్వస్తి పలికినట్టు, అలాగే **"సుమతీ శతకం"** అసలు ప్రతుల్లో లేని పద్యాలు అనంతరకాలంలో ఈ శతకం పేరున పాఠ్యపుస్తకాల్లో సైతం ప్రత్యక్షం కావడం అందుకు కారణాలు, నాటి ప్రక్షిప్తకారుల అలసత్వాన్ని నిర్మొహమాటంగా బట్టబయలు చేశారు హరిదాసు.

అలాగే సుమతీ శతకం పద్యాలను పోలిన కొత్త పద్యాలు దొరికిన వివరాలు ఆయా పత్రికల వివరాల ఆధారంగా సమాచారం పొందు పర్చారు. సుమతీ శతకం లోని అసలు పద్యాలసంఖ్య ప్రస్తుతం పద్యాల సంఖ్యకు వస్తున్న తేడాను గురించి చెబుతూ అత్యుత్సాహ వంతులు ఇష్టమైన రీతిలో ఈ పేరున పద్యాలు రాసి దేశం మీదకు వదులుతున్నంతకాలం సుమతీ శతకం లోని ఖచ్చితమైన పద్యాల సంఖ్య మారుతూనే ఉంటుంది. అప్పటివరకు ఈ పద్యాల సంఖ్య

206 అని చెప్పక తప్పదు అంటూ తన ఆవేదనను వెల్లడించారు.

ఇక రెండవ భాగం మొత్తం సుమతీ శతక పద్యాలలో గల ఛందో గుణాలను వివరించే ప్రయత్నం చేశారు రచయిత, వేమన తన శతకాన్ని ఆటవెలదుల్లో అందిస్తే, బద్దెన కత్తి మీద సాములాంటి కందపద్య రచనతో తన పద్యాలను సామాన్య జనులకు చేరేలాగ రచించి తన కందపద్యప్రతిభను నిరూపించుకున్నారు.

ఈ కష్టతరమైన కందపద్య రచన చేసిన మరి కొందరు కవుల సమాచారం కూడా చేర్చడం రచయిత యొక్క పరిశీలనా శక్తిని తెలియజేస్తుంది, వేములవాడ చాళుక్య రాజు "అరికేసరి"ఆస్థాన కవి, కన్నడ ఆది కవి అయిన "పంప మహాకవి" తమ్ముడు 'జినవల్లభుడు' కందపద్యం రాసిన తొలి తెలుగుకవి అని చెప్పారు, క్రీస్తుశకం 946 ప్రాంతంలో కరీంనగరుకు 20 కిలోమీటర్ల దూరంలోని "కురిక్యాల" గ్రామ సమీపంలోని బొమ్మల(మ్మ) గుట్టపై చెక్కబడి ఉన్న శాసనం ఆధారంగా ఈ విషయం నిర్ధారణ చేశారు హరిదాసు.

సుమతీ శతకం లోని సామాజిక విషయాలు సైతం ఎంతో ప్రామాణికంగా అర్థవంతంగా ఆలోచనాత్మకంగా వివరించడంలో రచయిత ప్రామాణికత పరిపుష్టంగా కనిపిస్తుంది,

శతక కర్త తాను రాజు అయి కూడా ప్రజల పక్షాన నిలిచి రాజరిక వ్యవస్థలో ప్రజల అగచాట్లు వివరిస్తాడు, అలాగే కరణాల పట్ల కూడా జాలి చూపుతు సమాజంలో వారి ఆవశ్యకత వివరిస్తాడు. అలాగే సుమతీకారుడు స్త్రీల పట్ల చూపిన విముఖతను చూస్తే అతడు స్త్రీ ద్వేషా? అనిపిస్తుంది కానీ గుణశీల విషయాల్లో స్త్రీలతో పాటు పురుషులకు వర్తింప చేయడం ద్వారా సుమతీ కారునికి జాతి కన్నా గుణం ప్రధానం అన్న విషయం అర్థమవుతుంది.

ఈ సుమతి పద్యాల శైలి, అందులోని కవితా శిల్పం, మొదలైన అంశాల గురించి క్షుణ్ణంగా అర్థవంతంగా వివరిస్తూ సుమతి శతకం యొక్క ప్రయోజనం, ప్రామాణికత, తదితర అంశాలు పరిశోధన దృష్టికోణం ద్వారా వివరించడంలో రచయిత డాక్టర్ మచ్చ హరిదాసు మెచ్చదగిన కృషి చేశారు. నేటితరం సాహిత్య పరిశోధకులంత విధిగా చదవదగ్గ ప్రామాణిక గ్రంథం ఈ 'తథ్యము సుమతి'.

---

# సురాజ్య ఆశయం



ఆశలు......!
ఆరాటాలు......!!
ఆరు నూరైనా నూరు ఆరైనా
ఆశయమై ఉదయించాలి
ఆ ఉషోదయమే లోకదీప్తి




ఇలాంటి ఎన్నో ఆశలు
మరెన్నో ఆరాటాలు
స్వాతంత్ర్యఆశయమై ఉదయించి
నిద్రాణమైన భారతజాతిని
నినాదాలతో మేల్కొల్పితే
పెయ్యిమీద రోమాలు లేశి నిలబడి
పిడియావత్తు పిడికిలెత్తి
సిపాయిల తిరుగుబాటు బావుటాగా
క్విట్ ఇండియా ఉద్యమమై ఎగిసింది
నింగి నిండా త్రివర్ణ కేతనమై రెపరెపలాడుతుంది

ఈ ఆశయసిద్ధి కోసం
ఆరిపోయిన ఆత్మత్యాగాలెన్నో
స్వరాజ్యం సురాజ్యమవ్వాలని
కొండకు ఎదురుచూసినట్లు చూస్తున్నాయి
కానీ ఏం చేస్తాం...!
ఎద్దును చూసి మేతెయాల్సిన పాలకులు
గడ్డివామునే పనిదొంగగొడ్ల పాలుచేస్తున్నారు
కమ్మరిండ్లల్లో సూదులమ్మినట్లు
ఖజానా గుల్ల చేస్తున్నారు
ఇబ్బడిముబ్బడిగా
ఏండ్ల కొద్ది అమలవుతున్న పథకాలు
ఏరు దాటె తెప్పలే తప్ప
తిప్పలుతీర్చే వంతెనలు కాలేదు
పాలకుల్లో యిదెంతటి?
మితిమీరిన స్వార్థం
కుహానా కుంచిత భావం
ఇది ముమ్మాటికీ
అధికార అంగామా తప్ప
అరిగోస తీర్చే ఆలోచన
ఆవగింజంతైయినా లేదు


ఎవ్వారం ఎట్లున్నదంటే
బిడ్డ పసిద్దిగాక అల్లునిమీద ఏడ్చినట్లు
ఓటరుకి బుద్ధి తెల్సినక
పాలకులకు బుద్ధి రాదా ?
వస్తుందనే ఆశ......!
ఈ ఆశే భారతీయుల ఆరాటమై
సురాజ్య ఆశయంగా ఉదయించాలి
దేశం యావత్తు దేదీప్యమానంగా వెలగా

**జినుకుల వెంకటేశ్**
కరీంనగర్, ఫోన్ : 965 209 2120


## స్వ'కృతి'


**పరంపర (ప్రాతినిధ్య తెలంగాణ కవిత్వం)**
వివిధ కవుల కవితా సంకలనం
వెల : 250/- (మూడు భాషల్లో విడివిడిగా)
**ప్రతులకు :** తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ -500 004.
ఫోన్ : 040- 29703142



**ఒంటరీకరణ (కవితా సంపుటి)**
మామిడి హరికృష్ణ
**వెల :** 50/-
**ప్రతులకు :** స్వరాజ్యం పబ్లికేషన్స్, మామిడి జయకృష్ణ, 804, రాయల్ పెవిలియన్ అపార్ట్‌మెంట్స్, బిగ్ బాజార్ ఎదురుగా, ఆర్‌బిఐ క్వార్టర్స్ ప్రక్కన, అమీర్‌పేట, హైదరాబాద్. మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో.



**శఠకోప సహస్రి (స్రీ),**
ద్రావిడ మూలం - తిరువాయ్ మొళి
తెలుగు అనువాదం - డా. కిడాంబి నరసింహాచార్య
**వెల :** 200/-
**ప్రతులకు :** డా. కిడాంబి నరసింహాచార్య, 3-13-102/1, వీధి నం. 1, శ్రీనివాస పురం, రామంతాపూర్, హైదరాబాద్ -500 013. ఫోన్ : 98668 28404



**తెలంగాణ బి.సి.వాద సాహిత్యం**
అట్టెం దత్తయ్య
పుటలు: 257
వెల : 230/-
ముద్రణ: ప్రణవం పబ్లికేషన్స్.

ప్రతులకు: 2-2-1109/బి.కె-ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాదు - 500 013.
ఫోన్ : 9494715445
మరియు నవోదయ పుస్తక విక్రయ కేంద్రం.

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్‌అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# 'వహ్వా'వకాయ ...

డా. దామరాజు కామేశ్వరరావు
హైదరాబాద్, ఫోన్ : 9848799648

వేసవి వచ్చిందంటే
స్పైసీ కొత్తావకాయ వాసన రుచులున్
నైసుగ నోరూరించును
దాసులవరె ఎవ్వరైన దానికి డంబో...!

వేడన్నము పప్పుకు సరి
జోడుగ కొత్తావకాయ చుయ్యను నెయ్యిన్
వాడిగ కలగలపి తినని
వాడు తెలుగువాడు కాడు పలుకగ డంబో...!

అచ్చతెనుగు సంస్కృతిలో
అచ్చెరువొలికించునట్టి అద్భుత రుచితో
పచ్చళ్ళకు రారాజుగ
అచ్చంగా ఆవకాయ అగపడు డంబో...!

పొద్దున్నే పెరుగన్నము
ముద్దకు ఒక ఆవకాయ ముక్క కలిస్తే
అద్దిర స్వర్గం అంటే
అద్దానిని పొగడ బ్రహ్మకగునే డంబో...!

తిననగు నెవ్వరు బెట్టిన
తిനినంతనె లొట్టలేస్తు దివ్యంబనుచున్
తినిపించవలె పదుగురికి
మన అమృతము ఆవకాయ మహిలో డంబో...!

ఎందుకెనర్జీ డ్రింకులు
ఎందుకు ఉత్సాహమునకు ఏవో మందుల్
విందన ముందుగ చేర్చర
పొందుగ ఒక ఆవకాయ ముక్కను డంబో...!

విహ్వలమౌ మనసులకు సు
ఖాహ్వయమగు ఆవకాయ హ్లాదము గూర్చున్
జిహ్వకు తగిలిన చాలును
వహ్వా అనిపించి మురియు ప్రాణము డంబో...!

కొలదిగ నాకిన చాలును
జలజలమని కళ్ళు నోరు జలధారలతో
చెలమలుగా పులకించును
పలుకగ ఆ హాయి ఎవరి వశమగు డంబో...!





నలుసావకాయ నాకిన
జలజలమని కళ్ళు నోరు జలధారలతో
చెలమలుగా పులకించును
పలుకగ ఆ హాయి ఎవరి వశమగు డంబో...!

చెలి కోపమ్మే కారము,
చెలి మోటు సరసము ఉప్పు చిలిపియె పులుపున్
వలపేమొ ఆవపిండిగ
కలిసిన చెలి ప్రేమె ఆవకాయర డంబో...!

ఊరేకొద్దీ మన నో
రూరించెడి ఆవకాయ ఉపమానముగా
కోరే కొలది చెలి చెలిమి
పారించును మధుర రుచిని బ్రతుకున డంబో...!

సరికారమెరుపు, మామిడి
హరితము, లవణము ధవళము... ఆ మువ్వన్నెల్
అరయగ జాతీయతతో
మెరయును మన ఆవకాయ మేలిగ డంబో...!